www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 352 | ఆదివారం | 23-11-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

మరణ మృదంగం మోగిస్తున్న 'సర్'

కేరళలో వేగవంతమైన 'సర్'పై రాజకీయ పార్టీల ఆందోళన

డిఎంకెతో సీట్ల పంపకాలపై చర్చలకు ఐదుగురు సభ్యులతో కమిటీ 05



అంతర్జాతీయ ఆయుధ స్మగ్లింగ్ రాకెట్ గుట్టురట్టు

నలుగురి అరెస్టు 05



'పూర్తి సంతృప్తి'తో వెళుతున్నా

52వ భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ 05



బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

ప్రజాస్వామ్య గొంతుక నులిమేస్తున్నారు 03




## 37 మంది మావోయిస్టులు లొంగుబాటు

వనం వీడిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆజాద్, రమేష్, ఎర్ర, డివిజన్, ఏరియా కమిటీ సభ్యులు : ఆయుధాలు అప్పగింత

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ పోలీసుల ముందు 37 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో 25 మంది మహిళలు, 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో రాష్ట్ర కమిటి సభ్యులుగా ఉన్న కొయ్యద సాంబయ్య అలియాస్ అజాద్ (49), అప్పాసి నారాయణ అలియాస్ రమేష్ (70), ముచ్చకి సోమడా అలియాస్ ఎర్రలతో పాటు మిగతా 34 మంది జిల్లా కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. వీరి వద్ద ఉన్న ఒక ఎకె47 తుపాకీ, రెండు ఎస్ఎల్ఆర్‌లు, నాలుగు 303తుపాకీలు, జి3 తుపాకీతో పాటు వివిధ కాలిబర్లకు చెందిన 346 తూటాలు పోలీసులకు అప్పగించి మావోయిస్టు పార్టీని వీడి జన జీవన స్రవంతిలో కలిశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్ కుమార్, ఎస్ఐబి చీఫ్ బి.సుమతిలతో కలిసి డిజిపి బి.శివధర్‌రెడ్డి తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు.లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులకు పునరావాస ప్రయోజనం క్రింద రూ.20 లక్షల చొప్పున అందజేశారు. మిగతా 34 మందికి డివిసిఎం ర్యాంక్‌కు చెందిన కేడర్లకు రూ.5 లక్షల చొప్పున, ఎసిఎం కేడర్‌కు చెందిన వారికి రూ.4 లక్షల చొప్పున, పార్టీ సభ్యులకు తరువాయి 2లో




## పెన్నుపై మన్ను కప్పితే... గన్నై గడీలను కూల్చింది

- తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులదే కీలక పాత్ర
- తెలంగాణ సమాజం చైతన్యవంతమైనది..
- ఎంత అమాయకంగా కనిపించినా అవసరమైనప్పుడు పోరాట పటిమను ప్రదర్శిస్తుంది
- తెలంగాణ చరిత్రలో అందెశ్రీ ఒక కోహినూర్ వజ్రం
- సంస్మరణ సభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన కవులు, కళాకారుల గానం రాష్ట్రంలో వినిపించకుండా కుట్ర చేశారని, పెన్నులపైన మన్ను కప్పితే గన్నులై మొలకెత్తుతాయని, గడీలను కూల్చుతాయని అందెశ్రీ నిరూపించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఇప్పుడు తెలంగాణ నాలుగుకోట్ల ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటను నిత్యం పాడుకుంటున్నారని, తెలంగాణ సమాజం తరువాయి 2లో

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు

## భారీ ఏర్పాట్లు

- అంతర్జాతీయ స్థాయిలో ఉత్సవం
- ఫ్యూచర్ సిటీలో సువిశాల ప్రాంగణం, భారీ వేదిక
- డాక్యుమెంట్‌కు తుది మెరుగులు
- 25వ తేదీ నుంచి విభాగాల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో డిసెంబర్ 8, 9 తేదీలలో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సిఎంఎఓ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రితో పాటు సిఎంఓ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు తరువాయి 2లో



## విద్యా వ్యవస్థలో సమూల మార్పు

- అదే మా ప్రభుత్వ సంకల్పం
- నేటి అవసరాలకు అనుగుణంగా యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం
- స్కిల్లింగ్, రీ- స్కిల్లింగ్, అప్ – స్కిల్లింగ్‌పై ఫోకస్
- 'జెఎన్‌టియు హెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్'లో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

విద్యా వ్యవస్థలో సమూల మార్పు తేవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్‌పై తరువాయి 2లో

## ఐబొమ్మ కేసులో రంగంలోకి సిఐడి

- ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ల ప్రమోషన్ కోణంలో విచారణ
- మూడో రోజు రవిని కస్టడీకి తీసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఐబొమ్మ కేసులో దర్యాప్తు మరింత వేగవంతమైంది. ఈ కేసులోకి తాజాగా తెలంగాణ సిఐడి అధికారులు ప్రవేశించారు. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ సైట్లను ప్రమోట్ చేసిన వ్యవహారంపై సిఐడి దృష్టి సారించింది. ఇప్పటికే బెట్టింగ్ ప్రమోషన్ కేసులను దర్యాప్తు చేస్తున్న సిఐడి, ఈ కేసులో కీలక సమాచారం రాబట్టేందుకు తరువాయి 2లో

## పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లకు మార్గదర్శకాలు జారీ



- 50 శాతం దాటకుండా ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లు ఖరారు
- మహిళలకు 50 శాతం వరకు కోటా
- రాష్ట్ర ప్రభుత్వం జిఒ విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్‌లపై జరుగుతున్న చర్చకు కాంగ్రెస్ సర్కార్ తెర దింపింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతం మించకుండా రిజర్వేషన్‌లు కల్పించేలా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు శనివారం జి.ఓను విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. రిజర్వేషన్‌ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జి.ఓ విడుదల చేసింది. పంచాయతీరాజ్ జి.ఓ ప్రకారం రిజర్వేషన్‌లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50 శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జి.ఓ ప్రకారం బిసిలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ప్రకారం షెడ్యూల్ ఏరియాల్లో రిజర్వేషన్లను అమలు చేయనున్నట్లు జి.ఓలో స్పష్టం చేసింది. ఇక మహిళలకు 50 శాతం వరకు రిజర్వేషన్లకు కల్పించాలని నిర్ణయించింది. గత (2019) ఎన్నికల్లో ఏ కేటగిరీకి రిజర్వేషన్లు తరువాయి 2లో



## రామాలయం మునిగే ప్రమాదమున్నా చోద్యం చూస్తారా?

- నీటిపారుదల నిపుణుల హెచ్చరికలను పట్టించుకోరా?
- రాష్ట్ర విభజన సమయంలో ఎపిలో కలిపిన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలి
- సిపిఐ జాతా ముగింపు సభలో నాయకుల డిమాండ్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలం రామాలయం నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉందని నీటిపారుదల నిపుణులు చెబుతున్నారని, ఈ విషయంపై దృష్టి సారించకుండా చోద్యం చూడటం సరైంది కాదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి హితవు పలికారు. అవిభక్త తరువాయి 12లో



## చర్లగూడెం రిజర్వాయర్‌కు ధర్మభిక్షం పేరు

- ప్రభుత్వంతో చర్చించి నామకరణం చేసేలా కృషిచేస్తాం
- తాటి, ఈత మొక్కలు పెంచేందుకు కల్లుగీత సంఘాలు ముందుకురావాలి : మంత్రి పొన్నం
- స్వాతంత్ర్య పోరాటంలో ధర్మభిక్షం కీలక పాత్ర : పల్లా వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం 45 లక్షల తాటి, ఈత మొక్కలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నదని, వాటి పెంపకానికి కల్లుగీత సంఘాలు ముందుకు రావాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మొక్క నాటేందుకు, దానిని పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. గీత పనివారల సంఘం వ్యవస్థాపకులు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం అంటే తనకెంతో గౌరవమని, ప్రభుత్వంతో చర్చించి మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్‌కు ధర్మభిక్షం పేరు పెట్టే విధంగా కృషి చేస్తామన్నారు. హైదరాబాద్ బషీర్ బాగ్‌లోని దేశోద్ధారక భవన్ లో శనివారం తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర సదస్సు జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా తరువాయి 12లో

## మూఢనమ్మకాలతో కుటుంబం ఆత్మహత్య

అంబర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఘటన

ప్రజాపక్షం/హైదరాబాద్

మూఢనమ్మకాలతో ఒక కుటుంబం సామూహికంగా ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం అంబర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రామ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్, విజయలక్ష్మి దంపతులు. వీరికి కూతురు శ్రావ్యతో పాటు తరువాయి 2లో

## ప్రస్తుత అభివృద్ధి నమూనాలతో ప్రకృతి దోపిడీ



- పర్యావరణానికి హాని కలిగించే అభివృద్ధి నమూనాలు మారాలి
- వాటిపై పునఃసమీక్షకు ఇదే సరైన తరుణం
- జి- 20 సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు


**జోహన్నెస్‌బర్గ్ :** ప్రపంచాభివృద్ధికి పాటించే నమూనాలు, ప్రగతి నిర్వచన నమూనాలపై చాలా లోతైన గాఢతతో పునరాలోచన చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జి–20 సదస్సులో పిలుపు ఇచ్చారు. ప్రస్తుత అభివృద్ధి నమూనాలతో ప్రకృతి దోపిడీకి గురవుతోందని, పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోందని అన్నారు. ఉగ్రవాదులకు–మాదక ద్రవ్యాల రవాణాకు మధ్య ఉన్న అనుబంధాన్ని తెంపేయడంతో సహా నాలుగు ప్రధానాంశాలను సదస్సు ముందుకు తెచ్చారు. ప్రకృతి వనరులను విపరీతంగా దోపిడీ చేయడంవల్ల ఆఫ్రికాఖండం బలైపోతోందని, అభివృద్ధి నమూనాల పునఃసమీక్షకు ఇదే సరైన తరుణమని అన్నారు. భారత నాగరిక విలువలలో భాగంగా ఉన్న సమగ్ర తరువాయి 2లో

## ప్లాన్‌కు ఒప్పుకోవాల్సిందే

- ఉక్రేన్‌కు ట్రంప్ గడువు!
- నిర్ద్వంద్వంగా తిరస్కరించిన జెలెన్‌స్కీ
- జి- 20లో నేడు యూరప్ మిత్రుల కీలక భేటీ



**వాషింగ్టన్:** రష్యాతో యుద్ధం ముగించేందుకు రూపొందించిన ముసాయిదా ప్రణాళికను ఉక్రేన్ అంగీకరించాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పట్టుపట్టారు. 28 అంశాలతో రూపొందించిన ప్రణాళికను సమ్మతించేందుకు ఉక్రేన్‌కు ఈనెల 27వ తేదీ వరకూ గడువు విధించారు. ప్రతిపాదిత ప్రణాళికపట్ల రష్యా అధ్యక్షుడు పుతిన్ హర్షం ప్రకటించారు. ట్రంప్ గనుక ఉక్రేన్, యూరోపియన్ యూనియన్‌లను ఒప్పించగలిగితే తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## అమెరికాలో బర్డ్ ఫ్లూ
### మొదటిసారి ఒక వ్యక్తి మృతి

**వాషింగ్టన్:** అమెరికాలో బర్డ్ ఫ్లూ కారణంగా మొట్టమొదటిసారి ఒక మనిషి మరణించాడు. అమెరికా ప్రభుత్వ ఆరోగ్యవిభాగం వాషింగ్టన్ నుండి ఈ మేరకు మాత్రమే సమాచారాన్ని విడుదల చేసింది తప్ప ఇంతకుమించి ఇతర వివరాలు వెలత్లడించలేదు. గడచిన ఏడాదికాలంగా బర్డ్ ఫ్లూ కూడా మనుషులకు సోకుతున్నది. ఈ విధంగా దాదాపు 70 మంది హెచ్ 5 ఎన్ 5 బర్డ్ ఫ్లూకు గురయ్యారుకానీ ఇంతవరకూ ఎవ్వరూ మరణించలేదు. ఎవియన్ ఇన్‌ఫ్లూయన్‌జా అని పిలిచే ఈ బర్డ్ అనేక దశాబ్దాలుగా అమెరికాలో జంతువులకు సోకుతున్నది. జంతు మరణాలు సంభవిస్తున్నాయి. కానీ బర్డ్ ఫ్లూ కారణంగా అమెరికాలో మొదటి మరణం కేసు ఇదే. మరిన్ని మమ్మేలియా జాతి (పాలిచ్చే జాతి జీవజాలం) జీవులకు ఈ వ్యాధి సోకుతున్నది. సదరు వ్యక్తి ఇల్లంతా ఒక పక్షి కేంద్రంగా ఉంటుందని, ఆయన అందుకు తగినవిధంగా ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోలేదనేది అధికారవర్గాల సమాచారం. ఇప్పటివరకూ బర్డ్ ఫ్లూ సోకినవారిలో సగంమందికి హెచ్ 5 ఎన్ 1 వైరస్ సోకింది. హెచ్ 5 ఎన్ 5 వైరస్ ఇప్పటివరకూ జంతువులకే సోకింది గానీ మనుషులకు సోకలేదు.

## ఓవల్ ఆఫీస్‌లో మొదటిసారి మమ్దానీ భేటీ
### భారత్–పాక్ సహా 8 శాంతి ఒప్పందాలు చేశా : ట్రంప్

**న్యూయార్/వాషింగ్టన్:** న్యూయార్క్ నగర మేయర్ గా ఎన్నికై చరిత్ర సృష్టించిన జోహ్రాన్ మమ్దానీ శనివారం మొదటిసారి వాషింగ్టన్ వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షు డు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఆయన సమక్షంలోనే పాత్రికేయులతో మమ్దానీ మాట్లాడారు. తమ మధ్య సమావేశం ఎంతో హృదయపూర్వకంగా జరిగిందన్నారు. వారి మధ్య వైరుధ్యాలు ఉన్నప్పటికీ వాటి గురించి ప్రస్తావించకుండా ఉమ్మడి లక్ష్యాలు న్యూ యార్క్ అభివృద్ధికి దోహదపడతాయని పదే పదే మమ్దానీ చెప్పారు. గతంలో మమ్దానీని 'నూటికి నూరుశాతం కమ్యూనిస్టు పిచ్చివాడు'గా అభివర్ణించిన ట్రంప్ మాట్లాడుతూ, మమ్దానీ తనను ఎంతగానో ఆకట్టుకున్నాడన్నారు. ట్రంప్ ఒక నిరంకుశాధికారి అని ఎన్నికల ప్రచార సమయంలో మమ్దానీ విమర్శించా రు. ఇదిలా ఉండగా మమ్దానీతో ఓవల్ ఆఫీస్‌లో సమావేశం సందర్భంగా ట్రంప్ మరోసారి భారత్–పాకిస్థాన్ అంశాన్ని ముందుకు తెచ్చారు.

## నైజీరియాలో మరోసారి 315 మంది విద్యార్థులు, టీచర్లు కిడ్నాప్

**అబుజా:** నైజీరియా చరిత్రలో గతంలో ఎన్నడూలేని విధంగా సాయుధ ముష్కరులు పెద్దసంఖ్యలో 315 మంది పాఠశాల విద్యార్థులను, టీచర్లను కిడ్నాప్ చేసి తీసుకుపోయారు. రోజు రోజుకూ ఈ ఘటనలు నైజీరియాలో పెరుగుతున్నాయి. నైజీరియా నిగర్ రాష్ట్రం నార్త్–సెంట్రల్ ప్రాంతంలో ఉన్న సెయింట్ మేరీస్ క్యాథలిక్ స్కూలు నుండి శుక్రవారం సాయుధులు 303 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులను కిడ్నాప్ చేసి తీసుకుపోయారు. 2014లో ఛిబోక్ రాష్ట్రంలో 276 మంది బాలబాలికలను కిడ్నాప్ చేసిన తర్వాత అంతకు మించినస్థాయిలో జరిగిన అతిపెద్ద అపహరణ చర్య ఇదే. 10 నుండి 18 లోపు వయసుగల బాలికలు, బాలురు అపహరణకు గురైనవారిలో ఉన్నారు. పారిపోయేందుకు ప్రయత్నం చేసిన 88 మంది విద్యార్థులను కూడా సాయుధులు తర్వాత పట్టుకుని తమ వెంట తీసుకుపోయారు. క్రిస్టియన్ అసోసియేషన్ ఆఫ్ నైజీరియా (సిఎఎన్) ఒక ప్రకటన చేస్తూ, రోజు రోజుకూ భద్రతాలేమి భయాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కిడ్నాప్ తామే చేశామని ఇప్పటివరకూ ఏ సాయుధ ముఠా ప్రకటించలేదు. ఐతే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా, ప్రభుత్వం అదేశించకుండానే పాఠశాలను తెరిచారని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సాయుధ ముఠాల దాడులు పెరుగుతున్నాయని తమకు



ఇంటిలిజెన్స్ సమాచారం ఉందని వారు అన్నారు. ఐతే ప్రభుత్వం తప్పడు ప్రకటనలు చేస్తోందని సిఎఎన్ నిగర్ స్టేట్ ఛాప్టర్ ఛైర్మన్ మోస్ట్ రెవరెండ్ బులుస్ దౌవా యోహన్న విమర్శించారు. ఈ ఘటనతో నిర్ణీత ప్రకారం జి–20 సమావేశాలకు బయలుదేరిన నైజీరియా అధ్యక్షుడు బోలా తినుబు ఈ వార్త తెలిసిన వెంటనే తన పర్యటన రద్దుచేసుకున్నారు. ఆయన తరపున ఉపాధ్యక్షుడు కాసిం శెట్టిమా ఈ సదస్సుకు హాజరయ్యారు. నైజీరియాలో క్రైస్తవులపై దాడులు బాగా పెరిగిపోయాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శించిన కొద్ది రోజులకు ఈ కిడ్నాప్ ఘటనలు జరిగాయి. కానీ ప్రభుత్వం మాత్రం ట్రంప్ ప్రకటనను ఖండించింది. సాయుధ గ్రూపులవల్ల ముస్లిం లే ఈ కిడ్నాప్‌లకు, దాడులకు బలవుతున్నారని ప్రభుత్వం విమర్శించింది.శనివారం తొలు త అధికారులు ఒక ప్రకటన చేస్తూ కిడ్నాప్‌కు గురైన విద్యార్థుల సంఖ్యను 215గా పేర్కొన్నారు. ఆ తర్వాత మ ళ్ళీ పూర్తిగా ధృవీకరించుకున్న తుది లెక్కల ప్రకారం 303 మంది విద్యార్థులు కిడ్నాప్‌కు గురైనట్లు తేల్చారు. తేల్చారు. గడచిన సోమవారం తెల్లవారుఝాము నుం డి ఈ కిడ్నాప్ సంఘటనలు జరుగుతున్నాయి. వాయు వ్య నైజీరియాలోని కెబ్బీ రాష్ట్రం మాగాలో ఉన్న కాంప్రిహెన్సివ్ సెకండరీ స్కూలు హాస్టలుపై దాడిచేసిన సాయుధులైన దుండగులు స్కూలు ఉపాధ్యాయుణ్ణి కాల్చి చం పారు. 25 మంది బాలికలను కిడ్నాప్ చేశారు. ఐతే వీరి లో ఒక బాలిక వారి నుండి తప్పించుకుని పారిపోయింది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఈ ఘటన జరిగిందని పోలీసులు చెప్పారు. పోలీసులు పహారాలో ఉన్నాగానీ సాయుధులు ఫెన్సింగ్‌లు ఎక్కి రహస్యంగా హాస్టల్‌లోకి ప్రవేశించి టీచర్‌ను హత్యచేసి బాలికలను అపహరించుకుపోయారు. కాల్పుల్లో గాయపడి న మరో హాస్టల్ ఉద్యోగి కోలుకుంటున్నారు. పోలీసులు వెంటనే సైనికులను, ఆధునిక ఆయుధాలున్న పోలీసులను రంగంలోకి దించారు. ఆ ప్రాంతాన్ని స్వాధీనంలో కి తెచ్చుకున్నారు. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసి భారీ ఎత్తున ర్యాన్సమ్ ధనాన్ని సంపాదించేందుకు నైజీరియా లో ఇలా పాఠశాలలపై దాడులు చేసి ముఖ్యంగా బాలికలను కిడ్నాప్ చేసి తీసుకుపోవడం ఒక అలవాటుగా మా రింది. కానీ ఈసారి మాత్రం ప్రభుత్వం కిడ్నాపర్లకు లొంగిపోకుండా వారి భరతం పట్టాలని తీర్మానించుకుం ది. సైన్యాన్ని భారీగా మోహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకుంటున్నాయి. గడచిన పది సంవత్సరాలుగా నైజీరియాలో పాఠశాలలపై దాడులు చేయ డం, బాలికా విద్యార్థినులను అపహరించి తీసుకుపోవడం ఒక అలవాటుగా మారింది. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసి భారీగా ధనం సంపాదించడంకోసం సాయు ధ మూకలు తరచు ఈ విధంగా స్కూళ్ళపై దాడులు చే స్తూ బాలికలను కిడ్నాప్ చేసి తీసుకుపోతున్నారు. ఐతే ప్రభుత్వం కూడా కిడ్నాపర్లకు లొంగడంలేదు. వారు కోరిన ధనాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం తిరస్కరిస్తోంది. వారిని అణచివేస్తోంది. ఐనాగానీ మళ్ళీ మళ్ళీ ఇలాంటి దాడులు జరుగుతూనే ఉన్నాయి.

## గడీలను కూల్చింది (మొదటి పేజీ తరువాయి)

చైతన్యవంతమైనది, ఎంత అమాయకంగా కనిపించినా అవసరమైనప్పుడు పోరాట పటిమను ప్రదర్శిస్తుందని గుర్తుచేశారు. 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం చరయిత, ప్రముఖ కవి, అందెశ్రీ సంస్మరణ సభ శనివారం రవీంద్ర భారతిలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగింది. సభలో అందెశ్రీ చిత్రపటానికి సిఎం పుష్పాంజలి ఘటించారు. కవులు ఎంత మంది ఉన్నా తెలంగాణ చరిత్రలో అందెశ్రీ ఒక కోహినూర్ వజ్రంలా నిలిచిపోతారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బడి మొహం ఎరుగని అందెశ్రీ జయజయహే తెలంగాణ పాట రాసి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిని అందించడంతో పాటు ప్రతి తెలంగాణ గుండెకు అందెశ్రీ దగ్గరయ్యారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం జయజయహే తెలంగాణ పాటను రాష్ట్ర అధికార గీతంగా అందరూ భావించారు. కానీ, ఆనాటి పాలకులు దాన్ని అమలు చేయలేదన్నారు. దీంతో పదేళ్లు జయజయహే తెలంగాణ పాట మూగబోయిందని, అధికారం శాశ్వతం అని వారు భావించడం వారి మూర్ఖత్వం అని సిఎం అన్నారు. రాచరికం, ఆధిపత్యం హద్దు మీరినప్పుడు కవులు, కళాకారులు తమ గొంగడి దుమ్ము దులిపి పోరాటంలోకి దూకారని, నిజాంకు వ్యతిరేకంగా బండి యాదగిరి బండెనక బండి కట్టి అని గళం విప్పితే సర్కార్ పీఠం కదిలిందని చెప్పారు. తెలంగాణ విముక్తి కోసం సమైక్యవాదులకు వ్యతిరేకంగా గద్దర్, గూడా అంజన్న, అందెశ్రీ, గొరెటి వెంకన్న మలిదశ ఉద్యమానికి పునాదులు వేశారని గుర్తుచేశారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం నా బాధ్యత అని, తెలంగాణలో ప్రజా పాలన రావాలని గద్దర్, అందె శ్రీ కోరుకున్నారని తెలిపారు. అందెశ్రీకి నివాళిగా వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు అందెశ్రీ స్మృతి వనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆయన రచించిన నిప్పుల వాగు అనే పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో ఉండేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలో వర్గీకరణ అమలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని, వర్గీకరణ అమలు వల్ల దళితుల్లో అత్యంత వెనుకబడిన వాళ్లు డాక్టర్లు అవుతున్నారని తెలిపారు. ప్రస్తుత మంత్రి వర్గంలో నలుగురు దళిత మంత్రులతో పాటు దళిత స్పీకర్ కూడా ఉన్నారని, దళితుల అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు సి.దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, టిజెఎస్ పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కొదండరామ్, మాజీ ఎంపి వి.హనుమంత రావు, మోత్కుపల్లి నర్సింహులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు. అందెశ్రీ సంస్మరణ సభ సందర్భంగా 33 జిల్లాల నుంచి తరలి వచ్చిన కళాకారుల ఆట, పాట, డప్పు దరువులతో రవీంద్రభారతి ప్రాంగణం మారుమ్రోగింది.

## భారీ ఏర్పాట్లు (మొదటి పేజీ తరువాయి)

పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలని, ఇందుకు పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలని సిఎం అన్నారు. అదే విధంగా 9వ తేదీ రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన 'తెలంగాణ రైజింగ్–2047 డాక్యుమెంట్'ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పే విధంగా రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్నింటినీ కళ్లకు కట్టించే ఆడియో వీడియో ప్రదర్శనలు, ప్రజంటేషన్లు తయారు చేసుకోవాలని సిఎం సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని, వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని, ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంలో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్‌లో కీలకంగా పాలుపంచుకోవాలని సిఎం ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్‌లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సిఎం అప్రమత్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సిఎం తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేండ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో వివిధ విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రజల అభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదృష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందన్నారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షలలో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్‌కు తుదిరూపం ఇస్తామని సిఎం వెల్లడించారు.

## జారీ (మొదటి పేజీ తరువాయి)

కేటాయించారో, వాటిని పరిగణనలోకి తీసుకుని తాజా రొటేషన్ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని పేర్కొంది. మహిళల రిజర్వేషన్ అన్ని కేటగిరిలలో ప్రత్యేకంగా లెక్కించి అమలు చేయాలి. గ్రామ పంచాయతీ, వార్డుల సంఖ్య తక్కువైతే, మొదట మహిళా ప్రాధాన్యత ఆ తరువాత లాటరీ పద్ధతి పాటించాలి. ఇక వార్డు మెంబర్లకు 2024 కుల సర్వే ఆధారంగా, సర్పంచులకు 2011 సెన్సస్ ఆధారంగా( బిసి సర్పంచ్ అభ్యర్థులకు 2024 కుల సర్వే) రిజర్వేషన్లు కల్పించింది. వార్డు రిజర్వేషన్‌ల నిర్ణయం ఎంపిడిఓ, సర్పంచ్ రిజర్వేషన్ ఆర్‌డిఓ ఆధ్వర్యంలో జరగాలి. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎలక్షన్ అథారిటిలను చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

## రంగంలోకి సిఐడి (మొదటి పేజీ తరువాయి)

సిద్ధమైంది. ఈ క్రమంలో నిందితుడు రవికి సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను కోరింది. మరోవైపు సైబర్ క్రైమ్ పోలీసులు రవిని మూడో రోజు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇవాళ కూడా విచారణ కొనసాగనుంది. నిన్న దాదాపు ఆరు గంటల పాటు సాగిన విచారణలో పలు కీలక వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. ఐబొమ్మకు కొత్త సినిమాలను ఎవరు సరఫరా చేస్తున్నారు? అతనికి సహకరిస్తున్న ఏజెంట్లు ఎవరు? గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో రవికి ఉన్న సంబంధాలు ఏమిటి? అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసుల విచారణ కొనసాగుతుండగా, ఇప్పుడు సీఐడీ కూడా రంగంలోకి దిగడంతో ఈ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. రెండు ఏజెన్సీల దర్యాప్తుతో రవికి సహకరించిన వారికి ఉచ్చు మరింత బిగుసుకున్నట్లయింది.

## అమెరికా బహిష్కరణ మధ్య దక్షిణాఫ్రికాలో జి–20 సదస్సు ప్రారంభం

**జోహన్నెస్‌బర్గ్:** దీర్ఘకాలంగా పేద దేశాలకు ఉన్న సమస్యలు పరిష్కారం కావాలనే గొప్ప ఆశయంతో దక్షిణాఫ్రికా నగరం జోహన్నెస్‌బర్గ్ సమీప సొవేటో టౌన్‌షిప్‌లో చరిత్రాత్మకమైన జి–20 సదస్సు శనివారం ప్రారంభమైంది. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇటలీ ప్రధానమంత్రి జార్జియో మెలోనీ, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ సహా పలువురు నాయకులు మొదటిరోజు సమావేశంలో పాల్గొన్నారు. ప్రాంగణం వద్ద వారికి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా ఘనంగా స్వాగతం పలికారు. పేద, ధనిక దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. జాతీయ ప్రయోజనాలు, ఆఫ్రికన్ ఎజెండా, పేద దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలమధ్య సహకారం, బహుళధ్రువ ప్రపంచం అనే నాలుగు అంశాల ప్రాతిపదికపై దక్షిణాఫ్రికా ఈ సదస్సు నిర్వహిస్తున్నది. అభివృద్ధి ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళడమే లక్ష్యంగా ''సంఘీభావం, సమానత్వం, స్థిరత్వం'' అనే మూడు అంశాలను ఈసారి ఇతివృత్తంగా తీసుకన్నారు. జి–20 సదస్సు నిర్వహణకుగాను దక్షిణాఫ్రికా ప్రభుత్వం 38.7 మిలియన్ డాలర్లు పెట్టుబడులుగా సమకూర్చింది. పేద దేశాలకు మరింత సహాయం చేసేందుకు ధనిక దేశాలు అంగీకరించాలని, ప్రకృతి వైపరీత్యాల నివారణకు, వాటి నుండి కోలుకునేందుకు నిధులు ఇవ్వాలని,గ్రీన్ ఎనర్జీవైపు మళ్ళేందుకు సహకరించాలని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా కోరుతున్నారు. ఒక ఆఫ్రికాదేశంలో మొట్టమొదటిసారి జరుగుతున్న ఈ సదస్సులో 42 దేశాలకు చెందిన అనేక సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ పాలనాధిపతులు ఈ సమావేశంలో పాల్గొనాల్సి ఉంది. రెండు రోజుల ఈ సదస్సు ఆదివారం సాయంత్రానికి ముగుస్తుంది.



జి–20 సభ్యదేశాలు ప్రపంచంలో 85 శాతం ఆర్థిక వ్యవస్థకు. 75 శాతం ప్రపంచ వాణిజ్యానికి, సగానికిపైగా జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. శ్వేతజాతీయులపట్ల తీవ్ర వివక్ష పాటిస్తూ, వారి భూములు లాక్కుంటూ, వారిపై పన్నుల భారాలు విధిస్తున్నందుకు నిరసనగా జి–20 సదస్సును అమెరికా బహిష్కరించింది. దక్షిణాఫ్రికా ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చి నాయకత్వం వహించడాన్ని ట్రంప్ వ్యతిరేకించారు. శ్వేతజాతీయుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని, వారికి తగిన నష్టపరిహారం ఇవ్వకుండా వారిని మోసం చేస్తున్నారనీ, అందుకే ఈ సదస్సు నిర్వహణకు దక్షిణాఫ్రికాకు ఎలాంటి నైతికహక్కు లేదని ట్రంప్ విమర్శిస్తున్నారు. జి–20 వ్యవస్థాపక సభ్యదేశమైన అమెరికా వాస్తవానికి ఈ ఏడాది ప్రిటోరియా నుండి ఈ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించాల్సి ఉంది. కానీ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా మాట్లాడుతూ, అవసరమైతే తాను సింబాలిక్‌గా ఖాళీ కుర్చీకే బాధ్యత అప్పగిస్తానన్నారు. గడచిన గురువారం రామఫోసా మాట్లాడుతూ, అమెరికా ఆఖరి నిమిషంలో ఏదో ఒక రకమైన భాగస్వామ్యానికి అంగీకరించిదని, కానీ అదేమిటో వివరించలేదని అన్నారు. ఐతే దీనిపై వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి కరోలినా లెవిట్ స్పందిస్తూ, రామఫోసా నోరు విప్పుతున్నారనీ, కానీ ఆయన వ్యాఖ్యలను ట్రంప్‌గానీ, ఆయన అనుచరవర్గం గానీ అభినందించలేదన్నారు. కానీ జి–20 అధ్యక్ష బాధ్యతలను తీసుకోవడానికి మాత్రం ఒక ప్రతినిధిని అమెరికా పంపుతుందని మాత్రం చెప్పారు.

## ప్రకృతి దోపిడీ (మొదటి పేజీ తరువాయి)

మానవతావాద సూత్రాన్ని, మానవ జీవన గమనంలో కొత్త మార్పులు తెచ్చే చొరవలను ప్రతిపాదించారు. ఉగ్రవాదులకు–మాదక ద్రవ్యాల రవాణాకు మధ్య ఉన్న సంబంధాలను ప్రతిఘటించేందుకు, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతిస్పందన బృందాన్ని, ప్రపంచ సంప్రదాయ విజ్ఞాన భాండాగారాన్ని ఏర్పాటు చేసేందుకు, ఆఫ్రికా నైపుణ్యాలను ద్విగుణం,బహుగుణం చేసేందుకు జి–20 సదస్సు చొరవ తీసుకోవాలని కోరారు. జి–20 పెట్టుబడుల ద్వారా ప్రపంచవ్యాప్తంగా శిక్షణ ఇచ్చే వారికి శిక్షణ ఇవ్వడం ద్వారా ఆఫ్రికా నైపుణ్యాలు బహుగుణాలను పొందుపరచుకుంటుందన్నారు. ఈ విధంగా రాబోయే పది సంవత్సరాలలో ఆఫ్రికాలో 10 లక్షలమంది సర్టిఫైడ్ ట్రైనర్లు తయారవుతారని, వీరంతా లక్షలమంది యువకులు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగపడతారని అన్నారు. జోహన్నెస్‌బర్గ్ సమీపం సోవేటో టౌన్‌షిప్‌లో శనివారం జరిగిన జి–20 నాయకుల సమావేశంలో మోదీ మాట్లాడుతూ, పూర్వకాలంనాటి సంప్రదాయ విజ్ఞానశాస్త్రంలో ప్రకృతిని, పర్యావరణాన్ని మానవ జీవనాన్ని సమతుల్యం చేసే విధానాలు ఉన్నాయని, సాంస్కృతికంగా ఎంతో సంపద్వంతమైన విలువలు, సామాజికంగా ఇరుగుపొరుగు ఎంతో చక్కగా కలిసి జీవించే విధానాలు ఉన్నాయని, వీటన్నింటినీ కలగలిప సంప్రదాయ విజ్ఞాన భాండాగారాన్ని ఏర్పాటు చేసేందుకు జి–20 చొరవ తీసుకోవాలని, ఈ భాండాగారం ప్రపంచ అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు.''మనకు ఇదే సరైన సమయం, మన అభివృద్ధి నమూనాలను పునఃపరిశీలించుకోవాలి, అందరినీ సమ్మిళితం చేసుకోవడానికి, స్థిరత్వం సాధించడానికి వీలుగా వృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలి, భారతదేశ నాగరిక విలువలు, ప్రత్యేకించి సమగ్ర మానవతావాద దృక్పథ జీవనాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు ఉపయోగపడతాయి'' అని మోదీ చెప్పారు. సర్వసమ్మిళిత తత్వాన్ని, స్థిరమైన ఆర్థికవృద్ధిని సాధించడంలో ఏ ఒక్కరూ వెనుకబడకూడదన్నారు. ప్రపంచాభివృద్ధిని, పెట్టుబడులను జి–20 దీర్ఘకాలంగా తీర్చిదిద్దుతూ వస్తోందని కానీ భారీగా ప్రపంచం అంతటా విస్తరించిన జనాభా వనరులకు ప్రస్తుతం ఉన్న నమూనాల ద్వారా అభివృద్ధి ఫలితాలు చేరడంలేదని, వారు పేదలుగానే ఉండిపోతున్నారని అన్నారు. ఈ నమూనాలను పునఃపరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నో జాతులు ప్రకృతిని పరిరక్షిస్తున్నాయని, సమతుల్యాన్ని రక్షిస్తున్నాయని, ఈ విజ్ఞాన భాండాగారాన్ని కాపాడాలన్నారు. భారతదేశ పురాతన విజ్ఞానశాస్త్రం దీనికి మౌలిక వేదికగా దోహదం చేస్తుందని చెప్పారు. మాదక ద్రవ్యాలను ప్రపంచవ్యాప్తంగా రవాణా చేసే పెద్ద సవాలును అధిగమించడానికి, ప్రత్యేకించి ఫెంటానల్ వంటి ప్రమాదాన్ని నిర్మూలించడమే ప్రధానాంశంగా భావించాలని కోరారు. ఈ ఫెంటనాల్ వల్ల ప్రజల ఆరోగ్యానికి, ప్రపంచ భద్రతకు తీవ్ర హాని కలుగుతుందన్నారు. ఉగ్రవాదులకు మాదకద్రవ్యాలకు మధ్య ఉన్న సంబంధాన్ని తెగ్గొట్టాలని, ఉగ్రవాదానికి ప్రధానంగా నిధులు సమకూర్చేవారిని బల హీనపరచాలని మోదీ అన్నారు. దక్షిణ ఆఫ్రికాలో మొదటిసారి జి–20 సమావేశాలు జరుగుతున్నాయి. తొలుత ఈ సమావేశంలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా స్వాగతోపన్యాసం చేశారు. నరేంద్రమోదీకి ''నమస్తే'' అంటూ ఆహ్వానం పలికారు.

## కుటుంబం ఆత్మహత్య
### (మొదటి పేజీ తరువాయి)

మరో పెద్ద కూతురు ఉంది. ఇటీవలే పెద్ద కూతురు ఆత్మహత్యకు పాల్పడింది. ఆ తరువాత శ్రీనివాస్ తన కుటుంబాన్ని రామ్‌నగర్ నుంచి అంబర్‌పేటలోని రామకృష్ణానగర్‌కు మార్చాడు. అద్దె ఇంట్లో శ్రీనివాస్, విజయలక్ష్మి తో పాటు కూతురు శ్రావ్య ఉంటున్నారు. దేవుడు పిలుస్తున్నాడని.. మేము కూడా పెద్ద కూతురు దగ్గరికే వెళ్తామని చుట్టుపక్కల వాళ్లతో వీళ్లు చెప్పుకునేవారు. ఈ క్రమంలోనే ఈ ముగ్గురు శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముగ్గురూ ఆత్మహత్య చేసుకోవడంతో కాలనీవాసులు షాక్‌కుగురయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబర్‌పేట్ పోలీసులు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. మూఢ నమ్మకంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## సమూల మార్పు
### (మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కూకట్ పల్లిలోని జెఎన్‌టియు హెచ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'జెఎన్‌టియు హెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్ 2025'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను అగ్రగామిగా నిలిపేలా 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'ఏఐ'లో బెంచ్ మార్క్ ను సెట్ చేసేలా అంతర్జాతీయ నిపుణుల భాగస్వామ్యంతో త్వరలోనే 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్'ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మనం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరిచిపోవద్దని, సమాజానికి తిరిగి ఇవ్వడం కృతజ్ఞతతో కూడిన బాధ్యత అని అన్నారు. మనం మన విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ప్రశ్నించే అవకాశాన్ని పొందగలమన్నారు. జేఎన్టీయూహెచ్ లో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, ఇన్నోవేషన్ అండ రీసెర్చ్ ఫండింగ్, రీసెర్చ్ క్లస్టర్స్, ఇంటర్నేషనల్ మెంటార్ షిప్ నెట్ వర్క్స్, గ్లోబల్ అల్యూమ్ని కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని పూర్వ విద్యార్థులను కోరారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యువ ఇంజనీర్ల ఆలోచన విధానం మారాలని, ఉద్యోగార్థిగా కాకుండా పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని మార్గనిర్దేశం చేశారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా ప్రాక్టికల్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, జెఎన్‌టియు హెచ్ విసి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర రావు, రెక్టార్ డా.కె.విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లొంగుబాటు (మొదటి పేజీ తరువాయి)

రూ.లక్ష చొప్పున నగదు బహుమతి ఇచ్చామన్నారు. కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయుధాలు అప్పగించిన మావోయిస్టులకు అదనంగా రూ.4లక్షల నుంచి ఒక లక్ష వరకు మొత్తం రూ. 1,41,0 5,000 డిమాండ్ డ్రాఫ్ట్‌ను అందించామని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు సిపిఐ (మావోయిస్టు) ఉద్యమంపై తెలంగాణ పోలీసులు అవలంభించిన సమగ్ర వ్యూహానికి ఒక నైతిక విజయంగా డిజిపి పేర్కొన్నారు. ఈ ఏడాది 465 మంది మావోయిస్టులు లొంగి పోగా అందులో ఇద్దరు కేంద్ర కమిటి సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటి సభ్యులు, ఇద్దరు డివిజనల్ కమిటి కార్యదర్శు లు, 11 మంది డివిజనల్ కమిటి సభ్యులు, 44 మంది ఏరియా కమిటి సభ్యులు ఉన్నారు. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం తెలంగాణకు చెందిన 59 మంది అజ్ఞాతంలో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర కమిటిలో ఉన్న ఎనిమిది మందిలో ఐదుగురు తెలంగాణ వారే ఉన్నారన్నారు. ఆయుధాలను..అజ్ఞాతాన్ని వీడండిజన జీవన స్రవంతిలో కలవండి, మీ ఊరికి తిరిగి రండి.. అజ్ఞాత మావోయిస్టులకు డిజిపి హృదయపూర్వక ఆహ్వానం మరోసారి పలికారు.

### వారి భద్రత మా బాధ్యత: డిజిపి శివధర్‌రెడ్డి

తమపై నమ్మకం ఉంచి లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసిన ప్రతి మావోయిస్టులకు భద్రత కల్పించడం తమ బాధ్యత అని డిజిపి శివధర్‌రెడ్డి హామి ఇ చ్చారు. లొంగిపోయిన వారికి ఎలాంటి ప్రాణహాని కలుగకుండా చూసుకుంటామని, అలాగే వారి జీవన ఉపాధి కోసం వారు కోరుకున్న కోర్సులను నేర్పిస్తామన్నారు.ఛతీస్‌ఘడ్ ప్రభుత్వంతో కూడా మాట్లాడి వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.లొంగిపోయిన మావోయిస్టులలో చాలామంది మహిళలు 21 సంవత్సరాలలోపు వారే ఉన్నారని..వారికి ఉపాధితో పాటు భద్రతపై తెలంగాణ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించామని స్పష్టం చేశారు.

### మారుతున్న పరిస్థితిలో లొంగిపోయాం: ఆజాద్

సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తాము కూడా మారాలనుకున్నామని అందుకే జన జీవన స్రవంతిలోకి కలిశామన్నారు. పార్టీ నేతలకు సమాచారం ఇచ్చిన తరువాతనే పోలీసుల ముందు లొంగిపోయామన్నారు.

## ప్లాన్‌కు ఒప్పుకోవాల్సిందే
### (మొదటి పేజీ తరువాయి)

ఇదే తుది ఒప్పందం అవుతుందన్నారు. కానీ అమెరికా చట్టసభల సభ్యులు ఈ ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా, జెలెన్స్కీ తమ అధీనంలో ఉన్న భూభాగాలను రష్యాకు ఇచ్చేందుకు ఇప్పటికే డజన్లసార్లు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఈ ప్రణాళికపై ఇంకా సుదీర్ఘ చర్చలు జరగాల్సి ఉందన్నారు. ఈ ఒప్పందాన్ని అంగీకరిస్తే ఉక్రేన్ తన గౌరవ మర్యాదలను, స్వేచ్ఛను కోల్పోతుందని, అంగీకరించకపోతే అమెరికాతో మైత్రిని తమదేశం కోల్పోతుందని హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో ఆయన అందరితో కలిసి ఈ ప్రణాళికపై తీవ్ర మథనం చేస్తున్నారు. ఉక్రేన్‌కు నష్టం కలగకుండా చూసేందుక జి–20 సదస్సకు హాజరవుతున్న యూరప్ దేశాల కూటమి మిత్రులతో కలిసి ఈ ప్రణాళికలో మార్పులు,చేర్పుల చర్చలకు జెలెన్స్కీ సిద్ధపడుతున్నారు. ప్రణాళికను అంగీకరించకపోతే తమవైపు నుండి గూఢచర్యం, ఆయుధాలు సహా ఎలాంటి సహాయం లభించదని ట్రంప్ హెచ్చరికలు చేసినట్లు వచ్చిన వార్తలను ఆయన యంత్రాంగం తిరస్కరించింది. ఈ పరిణామాలమధ్య అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఉక్రేన్‌ను బుజ్జగించే పనిలో పడ్డారు. ఉక్రేన్ తన సైన్యాలను తగ్గించుకున్నాగానీ, సైనిక వ్యవస్థను నిలబెట్టుకునే హక్కులు, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునే హక్కులు ఉండాలన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన ఈ ఒప్పందాన్ని మరింత పటిష్టంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, జి–20 సదస్సుకు వెళుతున్నందున అక్కడే తాము విడిగా దీనిపై చర్చిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ చెప్పారు. రష్యాకు మేలుచేసే 28 అంశాల ప్రణాళికను సమ్మతించాలని చాలా తీవ్రమైన ఒత్తిడి వస్తోందని, మునుపు ఎన్నడూ ఇలాంటి సంక్లిష్టపరిస్థితి ఉక్రేన్‌కు చరిత్రలో ఎదురుకాలేదని జెలెన్స్కీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన తర్వాత జి–3 మిత్రులు (మేక్రాన్, మెర్జ్, స్టార్‌మర్)లు జి–20లో కలిసిన సందర్భంగా దీనిపై చర్చించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఉక్రేన్ తన సైన్యాన్ని నిలబెట్టుకోవాలని, సైనిక అధికారం,సార్వభౌమాధికారం ఉండాలని మేక్రాన్ అన్నారు. ఉక్రేన్ ఆక్రమణలో ఉన్న రష్యా భూభాగాలను తిరిగి ఇచ్చేయాలని, ఉక్రేన్ తన సైన్యాన్ని సగానికిపైగా తగ్గించుకోవాలన్నవి ఈ ప్రణాళికలో ప్రధానాంశాలుగా పైకి వచ్చాయి. అమెరికా ఆర్మీ సెక్రటరీ డాన్ డ్రిస్కోల్ – జెలెన్స్కీ గడచిన గురువారం (నవంబరు 20) ఉక్రేన్‌లో మొదటిసారి ఈ ప్రణాళికపై సంభాషణలు జరిపారు. ఉక్రేన్–రష్యాలమధ్య దీర్ఘకాలం నిలిచి ఉండే మన్నికైన శాంతి ఒప్పందం సాధించాలంటే కొన్ని రాయితీలు తప్పవని అమెరికా రక్షణమంత్రి మార్కో రుబియో చెబుతుండగా తమ జోక్యం అనివార్యంగా ఉండాలని ఉక్రేన్ అనుకూల యూరోపియన్ యూనియన్ నాయకులు పట్టుపడుతున్నారు.

### ట్రంప్ ప్రణాళికలో ముఖ్యాంశాలివే

''ఉక్రేన్ సార్వభౌమాధికారానికి ఢోకా ఉండదు, ఉక్రేన్‌కు చెల్లుబాటైన భద్రతా హామీలు లభిస్తాయి, ఉక్రేన్ సైన్యాన్ని 6,00,000 లోపు ఉండేలా కుదించుకోవాలి. ఉక్రేన్ పునర్నిర్మాణానికి ఒకశక్తిమంతమైన గ్లోబల్ ప్యాకేజీ అమలు చేస్తారు, నాటోలో చేరేది లేదు అనే అంశాన్ని ఉక్రేన్ తన రాజ్యాంగంలో చేర్చుకోవాలి, ఉక్రేన్‌ను భవిష్యత్తులో ఎప్పుడూ నాటో కూలమిలో చేర్చుకునేది లేదంటూ ఒక నిబంధనను నాటో కూటమి రూపొందించాలి, ఉక్రేన్‌లో నాటో సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేయకూడదు, పోలెండ్‌లో యూరోపియన్ ఫైటర్ జెట్స్ కేంద్రం ఉండకూడదు, రష్యా, ఉక్రేన్,యూరప్ మధ్య సమగ్ర దురాక్రమణేతర ఒప్పందం జరుగుతుంది, గడచిన 30 సంవత్సరాలుగా ఉన్న సందేహాలన్నీ పరిష్కారమైనట్లు పరిగణిస్తారు, పొరుగు దేశాలపై రష్యా దాడి చేయదు, నాటో కూటమి తదుపరి విస్తరణ చర్యలకు పాల్పడదు, భద్రతా సమస్యల పరిష్కారానికి అమెరికా మధ్యవర్తిత్వంలో రష్యా–నాటో మధ్య సంభాషణలు జరుగుతాయి, సహకారాన్ని, తదుపరి ఆర్థిక అభివృద్ధిని విస్తరించుకోవడానికి, అవకాశాలను విస్తరించుకోవడానికి, ప్రపంచ భద్రతకు వీలుగా సైన్యాలను వెనక్కు రప్పించుకుంటారు, ఒకవేళ ఉక్రేన్‌పై రష్యా దాడి చేస్తే అంక్షలు అమలులోకి వస్తాయి, ఒకవేళ రష్యాపై ఉక్రేన్ దాడి చేస్తే దానికి అమెరికా ఇచ్చిన భద్రతా హామీలను పోగొట్టుకుంటుంది'' వంటివి ట్రంప్ ప్రణాళికలో కొన్ని ముఖ్యాంశాలు.



# జనరల్
STATE & REGIONAL NEWS



ప్రజాపక్షం/హైదరాబాద్: సిపిఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి తమ్మారెడ్డి సత్యనారాయణకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి నివాళులు అర్పించింది. తమ్మారెడ్డి సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవింద్, బోయ శ్రీరాములు, బోడ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## జిఒ 46ను వెనక్కి తీసుకోండి

లేనిపక్షంలో తీవ్ర ఆందోళనలు

బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలను దగా చేసే జిఒ 46ను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రెండురోజుల్లో అన్ని సంఘాలతో సమావేశమై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను కలిపి 50శాతంలోపు రిజర్వేషన్లు కొనసాగిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి మార్గదర్శకాలను విడుదల చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికలు వాయిదా వేసి,కోర్టులో తీర్పు వచ్చేంతవరకు ఆగాలని సూచించారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బిసిల రిజర్వేషన్లపై ఒకవైపు హైకోర్టులో వాదనలు కొనసాగించడానికి గడువు ఉన్నప్పటికీ ఆ దిశగా నిబద్ధతతో చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ముందుగానే చేతులు ఎత్తేసి జిఒ ఎందుకు విడుదల చేసినట్టు అని ప్రశ్నించారు. ఈ నెల 20న డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చిందంటూ, దాని ఆధారంగానే జిఒ 46 విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. ఇంతకాలం బిసి రిజర్వేషన్లపై ప్రధాని మోదీని అఖిలపక్షంతో కలిసి చర్చిస్తే, సమస్య పరిష్కారమయ్యేదన్నారు. ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు పోతే బిసిల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బిసి కుల సంఘాల నేతలు కొండా దేవయ్య, పగిళ్ల సతీశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

ప్రజాస్వామ్య గొంతుక నులిమేస్తున్నారు : సిపిఐ జిల్లా స్థాయి సమావేశంలో కూనంనేని




**ప్రజాపక్షం/ఖమ్మం :** బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని వీటిపై న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శాంతిచర్చలు జరిపే అవకాశం ఉన్న కేంద్ర ప్రభుత్వం అందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదని నిరాయుధులుగా దొరికిన మావోయిస్టులను పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కౌన్సిల్ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. కొండపర్తి గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ కార్పొరేట్లకు ప్రకృతి సంపదను కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగానే మావోయిస్టు పార్టీ నిర్మూలన శపథం చేశారని ఆయన తెలిపారు. రాజ్యం పరిధిలో విచారణ జరిపే హక్కు ఉన్న జరపడం లేదని పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆయన తెలిపారు. మావోయిస్టులు ప్రజల కోసం పని చేస్తున్నారని ఈ దేశంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించాలంటే మావోయిస్టులు ఏ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారో ఆ సమస్యలను పరిష్కరించాలి తప్ప మావోయిస్టు పార్టీ నాయకులను కాల్చి చంపడం కాదని ఆయన తెలిపారు. దండకారణ్యంతో పాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఉన్న ప్రకృతి సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు మోడీ సర్కార్ యథాశక్తి ప్రయత్నిస్తుందని ఆయన తెలిపారు. మతం పేరుతో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్న బిజెపి అదే సందర్భంలో సంపన్నులకు ఈ దేశాన్ని తాకట్టు పెడుతుందన్నారు. కేవలం మతం పేరుతో ప్రజలను వంచించే ప్రయత్నం చేస్తున్న ఎన్డిఏ ప్రభుత్వం మరో పక్క ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రజలను సమీకరించి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ దేశం మోడీ పాలనలో తిరోగమనం వైపు పయనిస్తుందన్నారు.

**చరిత్రలో నిలిచిపోయేలా సభ :**
చరిత్రలో నిలిచిపోయేలా సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు సాంబశివరావు తెలిపారు. డిసెంబర్ 26 నాటికి భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా 40 దేశాల నుంచి ప్రతినిధులు సౌహార్ధ సందేశాలు ఇచ్చేందుకు వస్తున్నారన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను సామ్రాజ్యవాద, భూస్వామ్య పెత్తందారి వర్గాలపై పోరాటం, సాధించిన హక్కులు, విజయాలను నేటి తరానికి తెలియజేప్పేందుకే రాష్ట్ర వ్యాప్తంగా జాతాలను నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహాసభల ఉద్యమ సందేశాన్ని ఇంటింటికి అందజేయడం జరుగుతుందన్నారు. ఖమ్మంలో జరిగే ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిని సమీకరించనున్నామని ఆయన తెలిపారు. చారిత్రిక సభ తర్వాత కమ్యూనిస్టు పార్టీ పురోగమనం తథ్యమని కూనంనేని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మ ద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చెరుకు రైతుల సమస్యలపై ఉన్నతాధికారుల కమిటీ

ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారాలు సూచించేందుకు ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. సచివాలయంలో శనివారం ఆయన చెరుకు రైతులు, పరిశ్రమల ప్రతినిధులు, చెరుకు అభివృద్ధి మండళ్ల (సిడిసి) ఛైర్మన్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణాలో ఏటా చెరుకు సాగు విస్తీర్ణం తగ్గుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని చక్కెర పరిశ్రమల సమస్యలు కూడా పరిష్కరించాలన్న సంకల్పంతో సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని శ్రీధర్‌బాబు తెలిపారు. సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన ప్రధాన అంశాలపై అందరితో చర్చించి నివేదిక రూపొందించేందుకు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఇందులో సంబంధిత శాఖల అధికారులు, చక్కెర పరిశ్రమల ప్రతినిధులు కూడా ఉంటారని చెప్పారు. ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లో చెరుకు రైతులకు అందుతున్న ప్రయోజనాలు, రాయితీలపై అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరలో నివేదిక అందిస్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రతి క్వింటాలు సన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్‌ను చెరుకు పంటకు కూడా వర్తింపచేయాలని రైతులు కోరుతున్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణా పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, చక్కెర పరిశ్రమల డైరెక్టర్ నర్సిరెడ్డి, అధికారులు, ప్రతినిధులు, సిడిసి ఛైర్మన్లు, రైతులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ లూటింగ్ పాలసీ




మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ అయినటువంటి కాంగ్రెస్ పార్టీ కొత్త స్కామ్‌కు తెరలేపిందని మాజీ మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ కాదు, హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ లూటింగ్ పాలసీ అని అభివర్ణించారు. బిఆర్‌ఎస్ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడల్లోని దాదాపు పది వేల ఎకరాల భూమిని పప్పు బెల్లాల్లా అమ్ముకునే కుట్రకు రేవంత్ ప్రభుత్వం తెరలేపిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూడా అడ్డగోలు దోపిడీ మీదనే రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టారన్నారు. లగచర్ల కావొచ్చు, హెచ్‌సియూ భూములు కావొచ్చు. ఇలా ఏది చూసినా దోపిడీనే అని అన్నారు. మాది నమ్మకాన్ని పెంచిన ప్రభుత్వం అయితే, కాంగ్రెస్ అమ్మకాన్ని పెంచిన ప్రభుత్వం అని ఆరోపించారు.

**హౌజింగ్ బోర్డులో ఉన్న ఆరు గజాలు, ఎనిమిది గజాలు కూడా అమ్ముతున్నడు రేవంత్ రెడ్డి**
గతంలో ఇదే రేవంత్ రెడ్డి భూములు అమ్ముకుంటూ పోతే ఎలా, ఆసుపత్రులు, విద్యాలయాలు చివరకు స్మశానాలు ఏర్పాటు చేయడానికి కూడా భూములు మిగలవని తెలిపారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెప్పిన మాటలు అక్షరసత్యం అని ఈ విషయాన్ని మంత్రి శ్రీధర్ బాబు గారు కూడా కొన్ని ఒప్పుకున్నారన్నారు. 9292 ఎకరాల భూమిని 30శాతం రిజిస్ట్రేషన్ ద్వారా కట్టబెడితే 5వేల కోట్లు వస్తుందని శ్రీధర్ బాబు గారే చెప్పారని గుర్తు చేశారు. 9292 ఎకరాల భూముల విలువ 5లక్షల కోట్లు అని, 5లక్షల కోట్లు విలువైన భూమిని 5వేల కోట్లకే ఎందుకు కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. మిగతా నాలుగు లక్షల 95వేల కోట్లు స్కాం కాదా? ఎందుకు కట్టబెడుతున్నారు. దీని వెనుక ఉన్న మత్లబ్ ఏమిటి? అని అన్నారు. 9292లో మొత్తం భూమి కాదు, ఇందులో రోడ్లు, మోరీ పోగా 4740ఎకరాలే ఉంటదని మంత్రి బుకాయించారు నేను అథారిటీగా చెబుతున్నాను. రెవెన్యూ రీసోర్సు మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా చెబుతున్నా. నాతో పాటు కేటీఆర్ గారు, ప్రశాంత్ గారు ఇతర మంత్రులు ఉన్నారు. ఆరోజు కూడా ఈ ప్రతిపాదన వచ్చిందన్నారు. శ్రీధర్‌బాబుకు నేను సవాల్ చేస్తున్నా.. నిజంగా 4740 ఎకరాలే ప్రభుత్వం పెట్టిందా? దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా? సగానికి సగం తగ్గించి చూపే ప్రయత్నం చేస్తున్నారని, భూ కుంభకోణం పరిధి తగ్గించే ప్రయత్నం చేసారని ఆరోపించారు. కోర్టు ఆర్డర్ ఉన్నందున ఆనాడు మేము ఆజామాబాద్ భూముల విషయంలో నిర్ణయం తీసుకున్నాం. ఎస్‌ఆర్‌వో కింద 200 శాతం తీసుకున్నం. ఈనాడు కాంగ్రెస్ మాత్రం 30శాతం కడితే చాలు అంటున్నది అన్నారు.

### దమ్ముంటే ఆధారాలతో నిరూపించు..
## లేదంటే క్షమాపణ చెప్పు

హరీష్ రావు 'అవాస్తవాల'పై మంత్రి శ్రీధర్ బాబు స్ట్రాంగ్ కౌంటర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఆరోపణలు చేయడం, అబద్ధాలు ప్రచారం చేయడం బిఆర్‌ఎస్ నాయకులు కెటిఆర్, హరీష్‌రావుకు వెన్నతో పెట్టిన విద్య' అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. తిమ్మిని బమ్మిని చేయడంలో వారిని మించిన వారు మరొకరు లేరని మరోసారి నిరూపించుకున్నారంటూ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎద్దేశా చేశారు. వారు పదేపదే ప్రస్తావిస్తున్న రూ.5 లక్షల కోట్ల స్కాం ఆరోపణ పూర్తిగా నిరాధారం, అవాస్తవమని మరోసారి స్పష్టం చేశారు. దమ్ముంటే ఆధారాలను బయటపెట్టి మాట్లాడాలని సవాలు విసిరారు. లేదంటే.. మీరు పదే పదే చేస్తున్న ప్రచారం కేవలం పచ్చి అబద్ధం, రాజకీయ దురుద్దేశం అని ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'మీరు అధికారం కోల్పోయారనే బాధతో రూ. 5 లక్షల కోట్ల స్కాం అంటూ పాత రికార్డును పదే పదే వాయించే బదులు... మీరు ఆగస్టు 2023లో తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోల (19, 20, 21) వెనుక ఉన్న 'రూ. లక్షల కోట్ల మతలబు' గురించి ముందు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి' అని ఆయన డిమాండ్ చేశారు. గతంలో మంత్రిగా సుదీర్ఘ అనుభవమున్న హరీష్ రావు తమ ప్రభుత్వంపై ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పారదర్శకంగా రాష్ట్ర ఖజానాకు రూ.4వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు తాము ప్రయత్నిస్తుంటే... స్కాంలు చేసి చేసి అలవాటైన బీఆర్‌ఎస్ నేతలకు మాత్రం ఇది మింగుడు పడటం లేదన్నారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రభుత్వ లీజ్ ల్యాండ్స్ కు ఫ్రీహోల్డ్ రైట్స్ ఇచ్చి, 100 శాతం, 200 శాతం ఛార్జీలు విధించి మీరు వసూలు చేద్దామనుకున్న రూ.లక్షల కోట్ల సంగతేంటంటూ ప్రశ్నించారు. అసలు ప్రభుత్వంతో సంబంధం లేని సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు నమ్ముతారనే భ్రమ నుంచి బయటకు రావాలని బీఆర్‌ఎస్ నేతలకు సూచించారు. వాస్తవాలను దాచిపెట్టి తమ ప్రభుత్వం 9292 ఎకరాలు అమ్మకానికి పెట్టిందంటూ తమపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ భూముల్లో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసిన ఏరియా లేదా ఫ్రీ హోల్డ్ ప్రాపర్టీస్ కేవలం 4,740 ఎకరాలేనని, ఇవి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూములని స్పష్టం చేశారు. మిగిలిన భూములు రోడ్లు, డ్రెయినేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా నిజనిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

## ఎనిమిది మంది నాన్‌క్యాడర్ ఎస్‌పిల బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎనిమిది మంది నాన్‌క్యాడర్ ఎస్‌పిలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన ఎస్‌పిల వివరాలు ఇలా ఉన్నాయి.

| అధికారి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీస్థానం |
|---|---|---|
| పి.కరుణాకర్ | పెద్దపల్లి డిసిపి | ఇంటెలిజెన్స్ ఎస్‌పి |
| వై.వి.ఎస్.సుదీన్ద్ర | టాస్క్‌ఫోర్స్ డిసిపి | సైబరాబాద్ ఎస్‌బి డిసిపి |
| బి.సాయిశ్రీ | సైబరాబాద్ ఎస్‌బి డిసిపి | సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్‌పి |
| ఆర్.జగదీశ్వర్‌రెడ్డి | ట్రాన్స్‌కో ఎస్‌పి | ఇంటెలిజెన్స్ ఎస్‌పి |
| వి.అరవింద్‌బాబు | రాచకొండ క్రైమ్ డిసిపి | హైదరాబాద్ సైబర్‌క్రైమ్ డిసిపి |
| దారా కవిత | సైబర్‌క్రైమ్ డిసిపి | సెంట్రల్‌జోన్ డిసిపి |
| ఎం.రవిందర్‌రెడ్డి | ఇంటెలిజెన్స్ ఎస్‌పి | గ్రేహౌండ్స్ ఎస్‌పి |
| ఎన్.అశోక్‌కుమార్ | హైడ్రా అదనపు కమిషనర్ | సిఐడి ఎస్‌పి |

## రాష్ట్రపతికి వీడ్కోలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ పర్యటన ముగించుకుని పుట్టపర్తికి వెళ్ళారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆమెకు వీడ్కోలు పలికారు. వారి వెంట మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, డిజిపి బి.శివధర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

## లైబ్రరీకి వెళ్లి పుస్తకం చదివితే మనసుకు ఆనందం

సిఆర్ ఫౌండేషన్‌లో చిల్డ్రన్స్ లైబ్రరీ ప్రారంభం

మనసు ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ మన్నం వెంకట రాయుడు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రస్తుతం గూగుల్ లేదా ఇంటర్నెట్ ద్వారా ఎంత సమాచారం కావాలంటే అంత పొందగలుగుతున్నప్పటికీ, లైబ్రరీకి వెళ్లి పుస్తకం చదివితేనే మనస్సుకు ఆనందం కలుగుతుందని మనసు ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ మన్నం వెంకట రాయుడు అన్నారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్‌లో గల నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఆర్‌ఆర్‌సి)లో శనివారం చిల్డ్రన్స్ లైబ్రరీని ముఖ్యఅతిధిగా హాజరైన మన్నం రాయుడు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఆర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ టి.సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథిగా ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు, సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర రావు, సభ్యులు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, కె.అజయ్ కుమార్, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్న కేశవ్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మన్నం రాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం లైబ్రరీలకు అంత ప్రాధాన్యం లేకపోయినా, 50 ఏళ్ల కింద లైబ్రరీలే మనుషుల విశ్రాంతి స్థలం, జ్ఞాన కేంద్రాలుగా ఉండేవన్నారు. ఇప్పటి వరకు తాము దాదాపు మూడు కోట్లపైగా పుస్తకాలను డిజిటలైజేషన్ చేశామని వెల్లడించారు. డాక్టర్ వాసిరెడ్డి రమేశ్ బాబు మాట్లాడుతూ కొత్తగూడెంలో ఒకప్పుడు ఎంతో సంప్రదాయంగా బాలోత్సవం నిర్వహించేవాళ్లమన్నారు. 25 ఏళ్ల కింద ప్రతి ఏటా సుమారు 15 వేల మంది పిల్లలు పాల్గొనే ఈ వేడుకకు ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల నుండి కూడా తెలుగు పిల్లలు వచ్చేవారని గుర్తు చేశారు. 1950, 1960 దశకాలలో గ్రామాల్లో లైబ్రరీలు ప్రజల జ్ఞాన కేంద్రాలుగా ఉండేవన్నారు. జ్ఞానం అంత పుస్తకాల్లోనే ఉంటుందని చెప్పారు. మనిషిగా, మానవునిగా ఎదగాలంటే పుస్తకాలు చదవాలని డాక్టర్ సురేష్ బాబు సూచించారు. ముప్పాళ్ల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ బాలల వికాసానికి లైబ్రరీలు తోడ్పాటును అందిస్తాయన్నారు. ఖగోళం నుంచి భూగోళం వరకు విజ్ఞానం లైబ్రరీలలో ఉంటుందన్నారు. పుస్తక పఠనం తగ్గిపోవడంతో ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు తగ్గిపోయాయని, ప్రేమాభిమానాలు సన్నగిల్లాయన్నారు. పుస్తక పఠనం ద్వారా అంతరించిపోతున్న మానవ విలువలను కాపాడవచ్చు అన్నారు. సిఆర్ ఫౌండేషన్‌ను ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. డాక్టర్ బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఆర్ రీసెర్చ్ సెంటర్‌లో ఇప్పటికే లైబ్రరీ భవనం ఏర్పాటు చేశామన్నారు. లైబ్రరీలో వ్యవసాయం, ఆర్థిక, రాజకీయ, వాణిజ్యం తదితర సమాచారం ఉంటుందని తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన విషయ పరిజ్ఞానాన్ని పొందారని గుర్తు చేశారు. పుస్తకాలు చదవడంతో పాటు రాయడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు ఆమె సూచించారు. డైరి రాయడం కూడా పిల్లలు అలవాటు చేసుకోవాలన్నారు.

## ఉదయ్‌ను వెంటనే విడుదల చేయాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటి విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకుడు ఉప్పల ఉదయ్‌కుమార్‌ను వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఒయు అధికారులు నియంతృత్వంగా వ్యవహరిస్తూ డిప్యూటి రిజిస్ట్రార్ శారద ఫిర్యాదు మేరకు అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయడాన్ని ఎఐఎస్‌ఎఫ్ ఉస్మానియా రాష్ట్ర సమితి తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రశ్నించే విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న ఉస్మానియా అధికారుల తీరుపై పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యం, హక్కుల రక్షణకు భంగం కలిగించకుండా 8వ గ్యారంటీ అమలు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సమస్యలపై గళం విప్పుతున్న విద్యార్థి సంఘాల నాయకులపై కుట్రలు పన్నుతూ.. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ కేసులతో వేధిస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## మహిళా అసిస్టెంట్ పైలట్‌పై అత్యాచారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా అసిస్టెంట్ పైలట్‌పై పైలట్ అత్యాచారం చేసిన ఉదంతం ఇది. ఈ మేరకు బాధిత అసిస్టెంట్ పైలట్ శనివారం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెంగుళూరులోని ఒక హోటల్‌లో పైలట్ తనపై అత్యాచారానికి ఒడిగట్టాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. బేగంపేట నుంచి పుట్టపర్తి, చెన్నై, బెంగళూరుకు బిజినెస్ ఫ్లైట్‌కు వెళ్లింది. ఈ నెల 20న తనపై అక్కడ ఉన్న ఇద్దరు పైలట్‌లలో ఒకరు ఈ అఘాయిత్యం జరిపారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బేగంపేట పోలీసులు జిరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. బాధితురాలి నుంచి వాంగ్మూలం రికార్డు చేశారు. నమోదు చేసిన జిరో ఎఫ్‌ఐఆర్‌తో పాటు బాధితురాలి వాంగ్మూలం రికార్డులను బేగంపేట పోలీసులు ఘటన జరిగిన బెంగళూరులోని హలాసురు పోలీసు స్టేషన్ అందిస్తామని తెలిపారు.

## తెలంగాణ–నార్త్ ఈస్ట్ రాష్ట్రాల సాంస్కృతిక సంగమం

తెలంగాణ–నార్త్ ఈస్ట్ కనెక్ట్, టెక్నో-కల్చరల్ ఫెస్టివల్

మూడు రోజుల పాటు నగర ప్రజలను అలరించిన భిన్న కార్యక్రమాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణాకు ఈశాన్య రాష్ట్రాలకు మధ్య పటిష్టమైన సాంస్కృతిక సామీప్యత, చారిత్రకంగా, సామాజిక సామీప్యత చాలా ఉంది. ప్రధానంగా తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, నాగాలాండ్ మిజోరాం, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలలో వైవిధ్యమైన సాంస్కృతిక ఆచారాలు, ఉత్సవాలు, నృత్య రీతులు, భాషల మధ్య అత్యంత సాన్నిహిత్యం కనిపిస్తుంది. ప్రధానంగా తెలంగాణా రాష్ట్ర సాధనకై జరిగిన సుదీర్ఘ పోరాటంతో 2014లో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటైనది. అదేవిధంగా, స్వయంపాలన, సంస్కృతి పరిరక్షణ, ఆత్మగౌరవ పాలనకై ఈశాన్య రాష్ట్రాలు కూడా ఉద్యమాలు చేశాయి. ఫలితంగా నాగాలాండ్ 1963లోనూ, మేఘాలయ 1972లో ఏర్పాటయ్యాయి. ఇక్కడి జానపదాల కళలు, చేనేతలకు మధ్య కూడా దగ్గరి సామీప్యత ఉంది. ఈశాన్య రాష్ట్రాలలో దేశంలోనే అత్యధిక గిరిజన జనాభా ఉండగా తెలంగాణలోనూ ఆదివాసీ, లంబాడీ, గోండు, యానాది తదితర గిరిజన తెగలున్నాయి. అయితే, ఈ ఇరు ప్రాంతాల మధ్య కళా, సాంస్కృతిక, చారిత్రక, క్రీడా, వ్యవసాయ సాంస్కృతిక బంధం మరింత పటిష్ట అయ్యే విధంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్, టెక్నోకల్చరల్ ఫెస్టివల్‌కు రూపకల్పన చేయడమే కాకుండా, ప్రభుత్వ సహకారంతో అద్భుతంగా నిర్వహించారు. నవంబర్ 20, 21, 22 తేదీల మధ్య జరిగిన ఈ తెలంగాణ నార్త్ ఈస్ట్ ఫెస్టివల్ నభూతో, నా భవిష్యత్ మాదిరిగా జరిగింది. కర్త, కర్మ, క్రియ అన్నీ తానుగా పర్యవేక్షించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ ఫెస్టివల్ విజయానికి పరోక్ష కారకులయ్యారు. తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు పాల్గొన్న ప్రారంభ సమావేశంతో మొదలైన ఈ మూడు రోజుల కళా, సాంస్కృతిక, క్రీడా, సామాజిక ఉత్సవం 22వ తేదీన ముగిసింది. ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, లిటరేచర్, విమెన్ ఎంపవర్‌మెంట్, ఫిలిం ఫెస్టివల్, స్పోర్ట్స్ రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య ఉన్న బంధాన్ని తెలియచేసేవిధంగా అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం హైటెక్స్‌లో జరిగిన ముగింపు సమావేశంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మలు పాల్గొనడంతో ఈ మూడు రోజుల కార్యక్రమాలు అద్భుతంగా ముగిశాయి. తిరిగి, రెండవ విడత కార్యక్రమాలు నవంబర్ 25 నుండి 27 వరకు హైదరాబాద్‌లో జరుగనున్నాయి.




hmda Growing Global
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

బహిరంగ ప్రకటన HMDA చట్టం 2008 యొక్క U/S 15 (4) ప్రకారం
(G.O.Ms. No. 243 MA & UD డిపార్ట్‌మెంట్ తేదీ 15.11.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (2008 చట్టం నెం.8) లోని సెక్షన్ 15లోని సబ్‌సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్-2031 ప్రకారం ఊహించిన భూవినియోగానికి ప్రభుత్వం ఇందుమూలంగా ఈ క్రింది మార్పును చేస్తోంది. G.O.Ms. No. 33 MA & UD తేదీ 24.01.2013, చెప్పబడిన ఆ సెక్షన్ యొక్క సబ్‌సెక్షన్ (1) ప్రకారం అవసరం.

సంగారెడ్డి జిల్లా, రామచంద్రాపురం మండలం, ఎదులనాగులపల్లె (గ్రామం) వద్ద 11753.23 చదరపు మీటర్లు లేదా 2.90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సర్వేనెంబర్ 15/A2 లోని స్థలం ప్రస్తుతం రవాణా వినియోగ జోన్ (T5) రవాణా వినియోగానికి కేటాయించబడింది. ఇది ప్రభుత్వం G.O.Ms.No. 33 MA & UD డిపార్ట్‌మెంట్ తేదీ:24.01.2013 ద్వారా నోటిఫై చేయబడిన MDP-2031 కోసం నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పుడు నివాస వినియోగ జోన్‌గా గుర్తించబడింది.

పైన పేర్కొన్న వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయి.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (PR)
DIPR R.O. No. : 11201-PP/CL/ADVT/1/2025-26, Date: 22-11-2025 HMDA



# జనరల్
STATE & REGIONAL NEWS

## కెటిఆర్ చేసిన ఆరోపణలపై ప్రజాకోర్టులో చర్చకు సిద్ధమా?

గజ్జెల కాంతం కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన ఆరోపణపై ప్రజాకోర్టులో చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గజ్జెల కాంతం డిమాండ్ చేశారు. ఈ మేరకు గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కెటిఆర్ ఏమైనా స్వతంత్ర్య సమరయోధుడా? కెటిఆర్ ఒక ఉగ్రవాది అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్న దొంగలు కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు అని తెలిపారు. రూ. 55 కోట్లు దోచుకు న్న కెటిఆర్ దొంగ అని అభివర్ణించారు. 2014 ముందు కెటిఆర్ ఆస్తులు ఎన్ని? 2014 ముందు కెటిఆర్‌కి ఇల్లు, కార్ ఉందా? 2014 ముందు కెసిఆర్,కెటిఆర్, కవిత ఒకే ఇంట్లో ఉండే వాళ్ళు అని తెలిపారు. కెసిఆర్ కుటుంబానికి హైదరాబాద్‌లో ఒక్క ఎకరం భూమి కూడా లేకుండే అని ఇప్పుడు వేలాది కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

## డిసిసి అధ్యక్షులు నియామకం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులను కాంగ్రెస్ అధిష్టానం శనివారం ప్రటించింది. 33 జిల్లాలతో పాటు పలు మున్సిపల్ కార్పొరేషన్ల కమిటీలకు కూడా డిసిసి అధ్యక్షులను నియమించింది. పలు జిల్లాలకు ఎమ్మెల్యేలను డిసిసి అధ్యక్షులుగా ప్రకటించింది. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఖలీఫ్ సైదుల్లా, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా దీపక్ జాన్‌ను ఎఐసిసి ప్రకటించింది ఆదిలాబాద్‌– నరేష్ జాదవ్, ఆసిఫాబాద్‌– ఆత్రం సుగుణ, భద్రాద్రి కొత్తగూడెం – తోట దేవీ ప్రసన్న, భువనగిరి– బీర్ల అయిలయ్య, గద్వాల – ఎం. రాజీవ్ రెడ్డి, హన్మకొండ– వెంకటరాం రెడ్డి, హైదరాబాద్ – సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా, జగిత్యాల – నందయ్య, జనగాం – లఖావత్ ధనావతి, భూపాలపల్లి–కరుణాకర్, కామారెడ్డి– మల్లిఖార్జున్, కరీంనగర్ – మేడిపల్లి సత్యం, కరీంనగర్ కార్పొరేషన్ – వీ. అంజన్ కుమార్, ఖైరతాబాద్ – రోహిత్ ముదిరాజ్, ఖమ్మం –నూతి సత్యనారాయణ, ఖమ్మం కార్పొరేషన్– దీపక్ చౌదరి, మహబూబాబాద్ – భూక్య ఉమా, మహబూబ్నగర్ – సంజీవ్ ముదిరాజ్, మంచిర్యాల – రఘునాథ్ రెడ్డి, మెదక్ – శివన్నగిరి ఆంజనేయులు గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి – తోటకూర వజ్రేష్ యాదవ్, ములుగు – పైడాకుల అశోక్, నాగర్ కర్నూలు – డాక్టర్ చిక్కు డు వంశీకృష్ణ, నల్గొండ – కైలాశ్ నేత, నారాయణ్ పేట్ – కొల్లుకుదురు ప్రశాంత్ రెడ్డి, నిర్మల్ – వెడ్మ బొజ్జు, నిజామాబాద్ – నగేశ్ రెడ్డి, నిజామాబాద్ కార్పొరేషన్ –బొబ్బిలి రామకృష్ణ, పెద్దపల్లి – ఎంఎస్ రాజ్ ఠాకూ ర్, రాజన్న సిరిసిల్ల – సంగీతం శ్రీనివాస్, సికింద్రాబాద్ – దీపక్ జాన్, సిద్దిపేట్ – ఆంక్షా రెడ్డి, సూర్యాపేట్ – గుడిపాటి నర్సయ్య, వికారాబాద్ – ధారాసింగ్ జాదవ్, వనపర్తి – శివసేనా రెడ్డి, వరంగల్ – మహ్మద్ అయ్యుబ్.

# మహిళల అభ్యున్నతే మా ప్రభుత్వ లక్ష్యం

మంత్రి జూపల్లికృష్ణారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళల కోసం ఎన్నో సంక్షేమపథకాలు అమలుచేస్తున్నామని, మహిళలు స్వశక్తితో ఎదిగి, వారికాళ్ల మీద వారు నిలబడేలా పథకాలు తెస్తున్నామని మహిళలు ఈ అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా రాణించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖలమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ, కల్యాణలక్ష్మి , షాదిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్‌తోకలిసి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖమంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తుందని, ఆడబిడ్డలశ్రేయస్సుకోసం ఫ్రీబస్సుసౌకర్యం కల్పించిందన్నారు. వడ్డిలేని రుణాలు, ఆర్‌టిసిబస్సుల్లో ఉచిత ప్రయాణమేకాకుండా వాటికి యజమానులను చేయడం, అమ్మ ఆదర్శపాఠశాల నిర్వహణను అప్పగించడం, మహిళాసంఘాలకు పెట్రోల్‌బంకులు, సోలార్‌విద్యుత్ ప్లాంట్లు అప్పగించడం వంటి కార్యక్రమాలద్వారా వారిని ఆర్థికంగా ముందుకు తీసుకెళుతున్నామన్నారు. రూ. 500లకే వంటగ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ క్యాంటీన్లు, మీసేవ కేంద్రాలు బలోపేతం, బస్సులకొనుగోలుకు లోన్లు, సోలార్‌కేంద్రాల ఏర్పాటు, వడ్లకొనుగోలు సెంటర్లఅప్పగింత, ఇందిరమ్మ ఇండ్లు, మహిళాసభ్యులకు లోన్లువంటి ఎన్నో పథకాలను మహిళల అభ్యున్నతికోసం ప్రభుత్వం మహిళలకు ఫ్రీబస్సు ద్వారా రూ.8వేలకోట్ల రూపాయలను మిగిల్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం రాష్ట్రంలో కోటిమంది ఆడబిడ్డలకు కోటిచీరలు పంపిణీ చేయాలని నిర్ణయించి , ఇందిరగాంధీ జయంతిరోజున గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. డిసెంబర్ 9వరకు 18ఏళ్లునిండిన ఇందిరమ్మ చీరలను మహిళలందరికి చీరలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందని, మహిళలు వ్యాపారాల్లో రాణించే అవకాశాలను రాష్ట్రప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే చీరలను మహిళలు గౌరవంగా భావించి ఆర్థిక అభ్యున్నతికి రాణించేలా వ్యాపారాల్లో రాణించాలన్నారు. రాష్ట్రప్రభుత్వం మహిళలకు అండగా ఉంటుందని వారికోసం రుణాలు అందిస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఒక ఇంట్లో ఒక మహిళ ఆర్థికంగా అభివృద్ధిచెందితే ఆకుటుంబం ఎంతో ఆనందంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. పెద్దకొత్తపల్లి మండలానికి సంబంధించిన 67మంది లబ్దిదారులకు షాదిముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఒకలక్షా 16వేల చొప్పున చెక్కులను లబ్దిదారులకు మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిడి డిడిఆర్‌డిఎ చిన్న ఓబులేసు, కొల్లాపూర్ ఆర్‌డిఓ భన్సీలాల్, పెద్దకొత్తపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో కార్మికులంతా ఐక్యమై కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ హెచ్చరించారు. జూబ్లి బస్టాండ్ వద్ద శనివారం సికింద్రాబాద్ కంటొన్మెంట్ బోర్డు కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాడి 44 కార్మిక చట్టాలను సాధించుకోవడం జరిగిందని, అందులో 29 కార్మిక చట్టాలను పూర్తిగా రద్దుచేసి యజమానులకు, పారిశ్రామిక వ్యక్తులకు పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే విధంగా మోడి ప్రభుత్వం లేబర్ కొడ్‌లను తీసుకురావడం జరిగిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈనెల 26న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి కార్మిక వర్గం తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చట్టబద్ధతతో కూడిన 42% బిసి రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

బిసి రిజర్వేషన్ సాధన సమితి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్టీ పరంగా ఇచ్చే రిజర్వేషన్లు కాకుండా పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లను ఇచ్చిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ‘42 శాతం బిసి రిజర్వేషన్ సాధన సమితి’ ఆధ్వర్యంలో శనివారం గన్‌పార్క్ వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బిసి రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ.. కామారెడ్డి వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసి రిజర్వేషన్లపై ఇచ్చిన హామిని విస్మరించి, ఇప్పుడు స్థానిక సంస్థలకు వెళ్తామని చెప్పడం బిసి కులాలను మోసం చేసినట్టు అవుతుందని మండిపడ్డారు. వెంటనే అఖిలపక్షంతో ఢిల్లికి వెళ్లి పార్లమెంట్‌ను స్థంభింప చేయాలని, క్యాబినెట్‌లో తీర్మానించిన విధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా సర్పంచ్ ఎన్నికలకు వెళ్తే రాష్ట్రం అగ్నిగుండంలా మారుతుందని హెచ్చరించారు. రూ. 3 వేల కోట్ల కోసం 3 కోట్ల జనాభా కలిగిన బిసి కులాలను మోసం చేయడం తగదన్నారు. కాంగ్రెస్, బిజెపి పార్టీల్లో ఉన్న బిసి నేతలందరు రాజీనామా చేసి బిసి రిజర్వేషన్ పోరాటల్లో పాల్గొనాలని, లేకపోతే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి వాళ్ల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబాల నారాయణగౌడ్, అయిలి వెంకన్నగౌడ్, దుర్గయ్య గౌడ్, బైరి శేఖర్, బోయ గోపి, విజయ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బడా బాబులకు పారిశ్రామిక భూములు

- కట్టబెట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్రలు
- 10 వేల ఎకరాల భూములు లాక్కుంటున్నారు
- బిజెపి ఎంపి, ఒబిసి మోర్చ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో పారిశ్రామిక భూములను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడా బాబులకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఓబిసి మోర్చ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. దాదాపు 10 వేల ఎకరాల పారిశ్రామిక భూములను లాక్కుంటున్నారని విమర్శించారు. న్యూఢిల్లీలోని కానిస్ట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అదర్ బ్యాక్‌వర్డ్ క్లాస్ ఆఫీసర్, అవార్డు స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక మహాసభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఢిల్లీకి కప్పం కట్టేందుకు సిఎం రేవంత్ రెడ్డి ఈ స్కాంకు పాల్పడుతున్నారని అన్నారు. నాడు కెసిఆర్ కూడా ఇందిరా పార్క్, ఎన్‌టిఆర్ స్టేడియం భూములను లాక్కునే ప్రయత్నం చేస్తే అడ్డుకున్నామని చెప్పారు. పారిశ్రామిక భూములను ప్రజా ప్రయోజనాల కోసమే కేటాయించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక భూములను లాక్కునే పాలసీని క్యాబినెట్ ఉపసంహరించుకోవాలన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఎన్నికలు ఖాయమన్నారు. అందులో బిజెపి గెలుస్తుందని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో పారిశ్రామిక భూములు కాపాడుతామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, అందుకు అవసరమైన గణాంకాలు సిద్ధం చేయకపోవడం కాంగ్రెస్ వైఫల్యమని, కోర్టు తీర్పులు కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. పార్టీల వారీ రిజర్వేషన్లు ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రకటన ప్రజల్లో నవ్వులపాలు అవుతోందని విమర్శించారు. నెహ్రూ కాలం నుంచి కాకా కలేల్కర్ కమిషన్, మండల కమిషన్ నివేదికలను కాంగ్రెస్ పట్టించుకోకపోవడం, బిసిల పట్ల ఆ పార్టీ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు.

## కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రొఫెసర్ హరగోపాల్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** వివిధ యూనివర్సిటీల్లో 25 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సామాజిక విశ్లేషకులు, ప్రొఫెసర్ హరగోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ జెఎసి–తెలంగాణ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా హరగోపాల్‌తోపాటు తెలంగాణ విద్యాకమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, ట్రైకార్ చైర్మన్ డాక్టర్ బెలయ్య నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ గత పదేళ్లలో విశ్వవిద్యాలయాల పరిస్థితి శోచనీయంగా మారిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తూ విద్యా వ్యవస్థ పునరుద్ధరణకు ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభుత్వం బాధ్యత అని పేర్కొన్నారు. పి.ఎల్.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలపై ఉన్నత విద్యాశాఖకు విద్యాకమిషన్ నివేదికిచ్చిందన్నారు. ఇందులో బేసిక్ పే, డిఎ, 3శాతం ఇంక్రిమెంట్ ఇతర సేవా సౌకర్యాలు కల్పించేలా సిఫారసులు చేసినట్టు తెలిపారు. రియాజ్ మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్లు న్యాయబద్ధమైనవని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిందేనన్నారు. డాక్టర్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టంచేశారు. సమావేశంలో జెఎసి కన్వీనర్ డాక్టర్ పరశురాం, కో–కన్వీనర్ డాక్టర్ పాండయ్య, నేతలు రాందాస్ నాయక్, డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కవిత షిందే తదితరులు పాల్గొన్నారు.

## స్పిరిట్ ఆఫ్ ద గేమ్స్: కనెక్టింగ్ తెలంగాణ అండ్ నార్త్ ఈస్ట్ చర్చాగోష్టి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ–నార్త్ ఈస్ట్ కనెక్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం స్పిరిట్ ఆఫ్ ద గేమ్స్ – కనెక్టింగ్ తెలంగాణ అండ్ నార్త్ ఈస్ట్ అనే అంశంపై విశిష్ట చర్చాగోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాల నుంచి ప్రముఖ క్రీడాకారులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మిజోరం రాష్ట్ర యువజన సేవలు, క్రీడల శాఖ మంత్రి లాల్లింగ్ లోవా హ్మార్ మిజోరం ఫ్యూచర్ స్పోర్ట్స్ పవర్ హౌస్ అంశంపై మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాలలోని క్రీడా ప్రతిభను జాతీయ వేదికకు తీసుకెళ్లే అవకాశాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తెలంగాణలో క్రీడల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సంక్షిప్తంగా వివరించారు. బ్యాడ్మింటన్ స్టార్ పుల్లెల గోపీచంద్ తన అకాడమీ నిర్వహణ, ప్రతిభా వికాస విధానాలపై మాట్లాడారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఫుట్‌బాల్ స్టార్ బయ్ చింగ్ భూటియా క్రీడా సంఘాలు, ప్రజల భాగస్వామ్యంపై ప్రాధాన్యతను వివరించారు. మణిపూర్ వెయిట్‌లిఫ్టింగ్ స్టార్, పద్మశ్రీ మీరాబాయి చాను క్రీడల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను అంచనా వేసి, వాటి పరిష్కార దిశలో సూచనలు చేశారు. అర్జున అవార్డు గ్రహీత బాక్సర్, ఎల్. సరితాదేవి క్రీడాకారుల తీర్చిదిద్దడంలో కోచ్‌ల కీలకపాత్రను విశదీకరించారు. త్రిపురకు చెందిన అర్జున అవార్డు గ్రహీత మంతు దేవనాద్ జిమ్నాస్టిక్స్ క్రీడాకారుల అభివృద్ధిలో అకాడమీల ప్రాధాన్యాన్ని వివరించారు. క్రీడా జర్నలిస్టు ఇంద్రనీల్ దాస్ ఈశాన్య రాష్ట్రాల్లో క్రీడల వల్ల సంభవించిన సామాజిక మార్పులను వివరించారు. మణిపూర్ వెటరన్ జర్నలిస్టు ప్రదీప్ ఫాంజోభం చర్చాగోష్టి సమన్వయకర్తగా వ్యవహరించారు. వక్తలు తెలంగాణ–ఈశాన్య రాష్ట్రాలకు క్రీడా రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను గుర్తిస్తూ, ప్రభుత్వాలు, క్రీడా సంఘాలు, ప్రజలు కలిసి పనిచేసే అవసరాన్ని హైలైట్ చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ డా. సోనీ బాలాదేవి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన పలువురు అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు, క్రీడా సంఘాలు, ఫెడరేషన్ ప్రతినిధులు, స్పోరట్స్ అథారిటీ కోచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక కోడ్‌లపై ప్రచారపటాటోపం

కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ ధ్వజం

కార్మికులకు న్యాయం విషయంలో కర్ణాటక, రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాల నుంచి నేర్చుకోండని హితవు

**న్యూఢిల్లీ :** విస్తృత ప్రచారం చేయబడిన కొత్త కార్మిక కోడ్‌ల కింద ‘శ్రామిక్ న్యాయ్ ఒక వాస్తవంగా మార్చడానికి పట్టణ ప్రాంతాలలోని భారతీయ కార్మికులకు జాతీయ కనీస వేతనం రూ.400, రూ.25లక్షల సార్వత్రిక ఆరోగ్య కవరేజ్, ఉపాధి హామీ చట్టం నిర్ధారించాలని కాంగ్రెస్ పార్టీ మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.2020 నుండి పెండింగ్‌లో ఉన్న నాలుగు కార్మిక కోడ్‌లు కేంద్రం నోటిఫై చేసిన ఒక రోజు తర్వాత, అనేకమంది కార్మికులకు అనుకూలమైన చర్యలతో కార్మికులకు న్యాయం చేసే విషయంలో వాటి ప్రభావాన్ని ప్రధాన ప్రతిపక్షపార్టీ కాంగ్రెస్ మోదీ సర్కారును ప్రశ్నించింది. కర్ణాటక, రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాల నుంచి నేర్చుకోవాలని హితవు పలికింది. శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నటువంటి 29 కార్మిక సంబంధిత చట్టాలను కోడ్‌లలోకి తిరిగి ప్యాక్‌చేశారని, రూల్స్ ఇంకా నోటిఫైడ్ చేయకుండానే వాటిని మోదీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలుగా మార్కెట్ చేసుకుంటోందని జైరామ్ రమేశ్ ఆరోపించారు. కానీ ఈ సంకేతాలు భారతీయ కార్మికుల శ్రామిక్ న్యాయ్ వాస్తవంగా మార్చడం కోసం కార్మికుల ఈ 5ముఖ్యమైన డిమాండ్లను నిజం చేస్తాయా అని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రశ్నించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎ)తో సహా రోజుకు రూ.400 జాతీయ కనీస వేతనం, రూ,25లక్షల సార్వత్రిక ఆరోగ్య కవరేజ్‌ను అందించే ఆరోగ్య హక్కుచట్టం, పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ చట్టం, జీవిత బీమా, ప్రమాద బీమా సహా అసంఘటిత కార్మికులకు అందరికీ సమగ్ర సామాజిక భద్రత, ప్రధాన ప్రభుత్వ విధుల్లో ఉపాధిని కాంట్రాక్టీకరణ చేయడాన్ని ఆపడానిక నిబద్ధత అవసరమని జైరామ్ రమేశ్ తన ‘ఎక్స్’ పోస్ట్‌లో వ్యాఖ్యానించారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు గోపాల్

**ప్రజాపక్షం /బొంరాస్‌పేట్ :** కొడంగల్ నియోజకరవ్గంలోని బొంరాస్‌పేట్ మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మండల విద్యాశాఖ అధికారి హరిలాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడూతు ఒకటి నుండి పది విద్యార్థులు ఉన్నా పాఠశాలలకు స్కూల్ గ్రాండ్స్ అందించాలన్నారు. ఏకోపాధ్యా పాఠశాలలతో పాటు అవసరం ఉన్న యుపిఎస్ పాఠశాలలో విద్యావాలంటీర్లును నియమించాలని తెలిపారు. ప్రతి పాఠశాలకు రెండు జాతల ఎకరూప దుస్తులు అందించాలని అన్నారు మండల్లో ఉన్న అన్ని పాఠశాలలకు పార్ట్2 పాఠ్యపుస్తకల కొరతను తీర్చాలని వేసవి సెలవులలో శిక్షణకు హాజరైన ఆర్పిలకు గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాక్షులు రమేష్ , జిల్లా కార్యదర్శి శివరాజ్ ,ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు వ్యక్తుల చేతికి పౌర అణు ఇంధనం

డిసెంబరు 1 నుండి పార్లమెంటు సమావేశాలు


ఉన్నత విద్యా కమిషన్ సహా తెరమీదకు 10 బిల్లులు

**న్యూఢిల్లీ:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు ఒకటో తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. 19వ తేదీ వరకూ జరిగే ఈసారి సమావేశాల్లో పౌర అణు రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ఉద్దేశించిన ‘‘కీలకమైన అణు ఇంధన బిల్లు–2025’ సహా మొత్తం పది బిల్లులను ఆమోదించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. దేశ అణు ఇంధన నియంత్రణ, వినియోగ పాలనాధికారం అంతా ఈ బిల్లు ఆమోదం ద్వారా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళుతుంది. దీంతోపాటు భారత ఉన్న విద్యా కమిషన్ బిల్లు కూడా ప్రధాన ఎజెండాగా పార్లమెంటు ముందుకు రానున్నది. ప్రతిపాదిత చట్టం ద్వారా దేశంలో ఒక ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తారు. విశ్వవిద్యాలయాలు, ఇతర స్వయంప్రతిపత్తి విద్యా సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించేందుకు ఈ కమిషన్ వీలు కల్పిస్తుంది. అదేవిధంగా ఒక బలమైన, దాపరికంలేని అక్రెడిటేషన్,ఆటానమీ వ్యవస్థ ద్వారా నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ఈ కమిషన్ ఉపయోగపడుతుంది. దీర్ఘకాలంగా ఈ ఉన్నత విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసే విషయం కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉంది. జాతీయ రహదారుల (సవరణ)బిల్లు కూడా ఈ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెడతారు. జాతీయ రహదారుల నిర్మాణాలకు వీలుగా జాప్యం లేకుండా, రహస్యాలు లేకుండా భూములు సేకరించడానికి ఈ సవరణ బిల్లు ఉపయోగపడుతుంది. అదేవిధంగా కార్పొరేట్ చట్టాల (సవరణ)బిల్లు–2025 కూడా ఈసారి సమావేశాల జాబితాలో ఉంది. ఎల్‌ఎల్‌పి చట్టం–2008, కంపెనీల చట్టం–2013ను మరింత మెరుగుపరచడం కోసం ఈ సవరణ ఉపయోగిస్తుంది. అదేవిధంగా సెబీ–1992 నాటి చట్టం, డిపాజిటర్స్ చట్టం–1996, సెక్యూరిటీస్ కాంట్రాక్టు (నియంత్రణ)చట్టం–1956లను మెరుగు పరచి హేతుబద్ధమైన ఏకీకృత సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)–2025ను ఏర్పాటు చేసేందుకు ఈ కొత్త బిల్లు తెస్తున్నారు. మధ్యవర్తిత్వం, రాజీచట్టంలో కూడా మార్పులు తెచ్చేందుకు కేంద్రం ఆలోచనలు చేస్తోంది. కంపెనీ డైరెక్టర్లకు సంబందించి సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యల కారణంగా కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను ఒక కమిటీకి పంపించింది. కమిటీ చేసిన సిఫార్సు మేరకు కేంద్రం ఇప్పుడు కంపెనీ చట్టంలోని సెక్షన్ 34లో సవరణకు ప్రతిపాదించిందని న్యాయ మంత్రిత్వశాఖ అధికారులు చెప్పారు. అదేవిధంగా గత పార్లమెంటు సమావేశాల్లో ఆమోదం పొందకుండా మిగిలిపోయిన మరో రెండు బిల్లులను కూడా ఈసారి మళ్ళీ సభ ముందుకు తెస్తున్నారు. ఈ ఏడాదికి మొదటిసారి అనుబంధ బడ్జెట్ కూడా ఎజెండాలో ఉంది. పార్లమెంటు మొత్తం 15 సార్లు సమావేశాలు జరుపుతుంది.

## ఘనంగా పివిఎన్ఆర్‌టి వియు 11వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పివి నరసింహా రావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం 11 వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్థక,పాడి అభివృద్ధి,మత్స్య,రవాణా శాఖ కార్యదర్శి డాక్టర్ కె. ఇళంబర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వేడుకలో భాగంగా, ఐసిఎఆర్,షెడ్యూల్డ్ కుల ఉప ప్రణాళిక నిధుల కింద మంజూరు చేసిన ఇరిసోర్సెస్ (పుస్తకాలు జర్నల్స్) ను ఆయన ప్రారంభించారు,వీటిని పశువైద్య,డెయిరీ టెక్నాలజీ, ఫిషరీస్ విభాగలలోని ఎస్‌సి,ఎస్‌టి,బిసి విద్యార్థులందరూ పొందవచ్చునని తెలిపారు. వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా ఆయన పరిశీలించారు.పాడి రైతులకి,పెంపుడు జంతువుల యజమానులకు అందించే ఉత్తమ క్లినికల్ సేవల పట్ల sa ప్రశంసించారు.అనంతరం విశ్వవిద్యాలయం 11వ వార్షిక నివేదికను విడుదల చేసి,''అలుమ్నికనెక్ట్'' ను వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యుడిగా ఆయన ప్రజారోగ్యం పరంగా ఈ రంగం ప్రాముఖ్యతను,రాష్ట్ర జిఎస్డిపికి,ఈ రంగం సహకారాన్ని పునరుద్ఘాటించారు.పాలు,గుడ్డు,మాంసం ఉత్పత్తుల ద్వారా చౌకైన ప్రోటీన్ను అందించడం గురించి నొక్కి చెప్పారు. ఈ రంగం లోటుపాటుల స్థాయి నుండి మిగులుకు మారడాన్ని గుర్తు చేసుకున్నారు.దశాబ్ద కాలంలో విశ్వవిద్యాలయం సాధించిన పురోగతికి ఆయన అభినందించారు.ఈ సందర్భంగా మరో ముఖ్య అతిథిగా హాజరైన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ రాజీ రెడ్డి,ఈ పదేళ్లలో పరిమితుల మధ్య విశ్వవిద్యాలయంలో సాధించిన పురోగతి గురించి ప్రశంసించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలోని మమ్నూర్ వెటర్నరీ కళాశాల,పెబ్బేర్‌లో ఫిషరీస్ కళాశాల,ఎఐసిఆర్పిపౌల్ట్రీ మమ్నూర్‌లో ,కోరుట్లలో ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్ ల్యాబ్, డయాగ్నొస్టిక్ ల్యాబ్, ఫీడ్ టెస్టింగ్ లాబొరేటరీ,హైదరాబాద్‌లో నాబిల్ గుర్తింపు పొందిన ల్యాబ్ తోపాటు కొడంగల్‌లో రాబోయే వెటర్నరీ కళాశాలల పురోగతి గురించి వివరించారు. విశ్వవిద్యాలయం సరైన దిశలో పురోగమించడానికి కొన్ని అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి బడ్జెట్ను మంజూరు చేయడంలో ప్రభుత్వం,కార్యదర్శిపై వైస్‌ఛాన్సలర్, పివిఎన్ఆర్టివియు విశ్వాసం వ్యక్తం చేశారు.పివిఎన్ఆర్ టివియు రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.శరత్చంద్ర, విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన సందేశంలో అధ్యాపకులు చేసిన కృషిని, సహకారాన్ని ప్రశంసించారు.గత పదేళ్లలో విశ్వవిద్యాలయం సాధించిన వివిధ మైలురాళ్లను గుర్తు చేసుకున్నారు. వైస్ ఛాన్సలర్, ప్రొఫెషర్.ఎం జ్ఞాన ప్రకాష్ ముఖ్య అతిథి,డాక్టర్ కె.ఇళంబర్తి,గౌరవ అతిథిగా విచ్చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫసర్ రాజారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫసర్ డి మాధురి,అసోసియేట్ డీన్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, రాజేంద్రనగర్ బోధన,బోధనేతర అధ్యాపకులు పి వి విగ్రహానికి పుష్ప గుచ్ఛములు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నమో భారత్ రైళ్లలో ప్రైవేట్ వేడుకలు

**న్యూఢిల్లీ:** ఇక నుంచి నమో భారత్ రైళ్లు ప్రైవేట్ వేడుకలకు వేదికలుగా మారనున్నాయి. పుట్టినరోజులు, పెళ్లిరోజులు, పెళ్లిళ్లకు ముందు చేసే ఫొటోషూట్‌లు, ఇత ప్రైవేట్ కార్యక్రమాలకు రైలు బోగీలను అద్దెకు ఇచ్చేలా 'నేషనల్ క్యా పిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్' కీలక నిర్ణయం తీసుకుంది. వ్య క్తులు, ఈవెంట్ ఆర్గనైజర్‌లు, ఫొటోగ్రఫీ సంస్థలు ఈ సౌకర్యాన్ని వినియోగి ంచుకోవచ్చు. స్టేషన్లలో నిలిపి ఉంచిన బోగీలనుగానీ, లేదంటే కదులుతున్న నమో భారత్ రైలు బోగీలనుగానీ వినియోగదారులు అద్దెకు తీసుకోవచ్చు. వే డుకల కోసం దుహాయ్ డిపో వద్ద ఒక నమూనా బోగీని అలంకరించి ఎప్పు డూ అందుబాటులో ఉంచుతారు. బోగీలకు బుకింగ్ చార్జీలను గంటకు రూ .5,000గా నిర్ణయించారు. వేడుకకు అవసరమైన డెకరేషన్ సామాగ్రి సెట్ చే సుకునేందుకు మరో 30 నిమిషాల సమయం అదనంగా ఇస్తారు. అయితే ఉ దయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల మధ్య మాత్రమే వేడుకలకు అనుమతి ఉంటుంది. వేడుకలు జరుపుకునే వారు సాధారణ రైలు కార్యకలాపాల కు ఎలాంటి అంతరాయం కలిగించకుంచూసుకోవాల్సి ఉంటుంది.

## భాష ఆధారంగా ప్రజలను విభజించేందుకు బిజెపి యత్నం



శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే విమర్శ

**ముంబయి:** మహారాష్ట్రలో అధికార బిజెపిపై శివసేన (యుబిటి) తీవ్రంగా మండిపడింది. భాష ఆధారంగా ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తోందని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే ఆరోపించారు. శనివారం ఆయన ముంబయిలో పార్టీల కార్యకర్తలనుద్దేశంచి మాట్లాడుతూ బిజెపిని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడే పార్టీగా అభివర్ణించారు. వారి హిందూత్వ బెలూన్ పగిలిపోయిందని ఎద్దేవా చేశారు. బిజెపి భాషాపరమైన విభజనకు పాల్పడుతూ భాష ఆధారంగా ప్రజలను చంపాలనే ఉద్దేశం తమది కాదని చిలకపలుకులు పలుకుతోందని విమర్శించారు. మరాఠీలో మాట్లాడకూడదనే వాదనతో స్థానిక రైలులో ఒక అల్లరి మూక తనపై దాడి చేసిన తర్వాత థానే జిల్లాలో 19 ఏళ్ల విద్యార్థి అర్నవ్ ఖైరే ఆత్మహత్య చేసుకున్న ఘటనను ఆయన ప్రస్తావించారు. మొదటి సంవత్సరం సైన్స్ విద్యార్థి మంగళవారం సాయంత్రం కళ్యాణ్ తూర్పులోని తన అపార్ట్‌మెంట్‌లో ఉరి వేసుకున్నాడని, ఏ భాష కూడా మరొక భాషకు అన్యాయం చేయకూడదని థాక్రే హితవు పలికారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విషాన్ని వ్యాపింపజేస్తున్నాయని, పదే పదే తమను నిందిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

## 'పూర్తి సంతృప్తి'తో...వెళుతున్నా

### 52వ భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్

పదవీవిరమణకు ముందురోజైన శనివారం సిజెఐకి ఘనవీడ్కోలు

రేపు కొత్త సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం



**న్యూఢిల్లీ :** భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బి.ఆర్.గవాయ్ తన ఆరునెలల పదవీకాల సమయంలో దేశంలోని వివిధ హైకోర్టులకు షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎస్‌టి) కేటగిరీకి చెందిన 10మంది న్యాయమూర్తులు, 11మంది వెనకబడిన తరగతుల(బిసి)కు మరియు వెనకబడిన తరగతులకు చెందిన జడ్జిలు నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ఆదివారం (నవంబరు 23న) పదవీవిరమణ చేయనున్నారు. ఆయన వారసుడు జస్టిస్ సూరకాంత్ నవంబరు 24న నూతన భారత ప్రధాన న్యాయమూర్తిగా...53వ సిజెఐగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. భారత న్యాయవ్యవస్థకు అధిపతిగా కె.జి.బాలకృష్ణన్ తర్వాత రెండవ దళిత సిజెఐగా విధులు నిర్వర్తిస్తున్న బి.ఆర్.గవాయ్‌కు నేటి (శనివారం) చివరిపనిదినంతో ఆయన పదవీకాలం ముగిసింది. కాగా, చివరి పనిదినమైన శనివారం భారత ప్రధాన న్యాయమూర్తిగా పదవీవిరమణ చేస్తున్న బి.ఆర్.గవాయ్‌కు అత్యున్నత న్యాయస్థానానికి చెందిన పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలకడంతో ఆయన సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ సందర్భంగా బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ 'ఒక న్యాయ విద్యార్థి'గా, ఒక 'న్యాయవాది'గా, ఒక 'జడ్జి'గా నాలుగు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో పూర్తి సంతృప్తి...సంతృప్తి భావనతో తాను అత్యున్నత న్యాయస్థానాన్ని విడిచి వెళుతున్నాను' అని గద్గద స్వరంతో అన్నారు.జస్టిస్ గవాయ్ దేశానికి చెందిన మొదటి బౌద్ధ, రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తిగా ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియంకు నేతృత్వం వహించారు. ప్రభుత్వానికి నియామకం కోసం సిఫారసు చేసిన 129 పేర్లలో 93పేర్లను ఆమోదించడంతో వారి నియామకాలు జరిగాయి. ఆయన పదవీకాలంలో ఐదుగురు జడ్జిలు...జస్టిస్ ఎన్.వి.అంజారియా, విజయ్ బిష్ణోయ్, ఎ.ఎస్.చందుర్కర్, అలోక్ అరాధే, విపుల్ మనుభాయ్ పంచోలి అత్యున్నత న్యాయస్థానానికి నియమితులయ్యారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో మే 14నుంచి నియామకమైన జడ్జిల వివరాలు అప్‌లోడ్ అయి న ప్రకారం... సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బి.ఆర్.గవాయ్ నియమితులైనప్పటి నుండి ప్రభుత్వం హైకోర్టుకు ఆమోదించిన 93 మంది పేర్లలో మైనారిటీ కమ్యు నిటీల నుంచి 13 మ ంది జడ్జిలు సహా 15మంది మహిళా న్యాయమూర్తులు కూడా వారిలో ఉన్నారు. వాటిలో 5 మాజీ లేదా ప్రస్తుతం పనిచేస్తున్న 45మంది జడ్జిలు బా ర్ నుంచి నియమించబడగా, మిగిలినవా రుస ర్వీస్ కేడర్ నుంచి నియమించబడ్డారు. 5 2 వ భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గ వాయ్ తన ఆరునెలల పదవీకాలంలో అద్భుతమై న తీర్పులు ఇచ్చారు. వాటిలో వక్ఫ్ చ ట్టంలోని కీ లక నిబంధనలు, ట్రిబ్యునల్ సంస్కరణల నుకొ ట్టివేయడం,ప్రాజెక్ట్‌లకు పోస్ట్ ఫాక్టో గ్రీన్ నోడ్స్ మంజూరు చేయడానికి కేంద్రాన్ని అనుమతించింది.



## డిఎంకెతో సీట్ల పంపకాలపై చర్చలకు ఐదుగురు సభ్యులతో కమిటీ

కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై ప్రకటన

**చెన్నై:** ఇటీవల బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎ న్నికల్లో కాంగ్రెస్ అత్యంత పేలవ ప్రదర్శన ను కనబరిచిన విషయం తెలిసిందే. అయితే నామినేషన్ల గడువు ముంచుకొచ్చి నా సీట్ల పంపకాలపై తేలకపోవడంతో ప్రచారం సరిగా నిర్వహించలేకపోయార ని, కొన్ని చోట్ల మహాగట్బంధన్ కూటమిలోనే భాగస్వామ్య పక్షాలే ఫ్రెండ్లీ పోటీ చేయడం కాంగ్రెస్ ఇతర పార్టీలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాదిలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఇప్పటి నుంచే క సరత్తు ప్రారంభించింది. అధికార డిఎంకెతో సీట్ల పంపకాలపై చర్చలు జరపడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చే శారని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై శనివారం తెలిపారు. అధికార పార్టీతో చర్చలు జరపడానికి నియమించబడిన కాంగ్రెస్ బృ ందానికి తమిళనాడు, పుదుచ్చేరి పార్టీ ఇన్‌చార్జ్ నేతృత్వం వహిస్తారని టిఎన్‌సిసి అగ్ర నాయకుడు గిరీష్ చోడంకర్ తెలిపారు. సెల్వపెరుంతగై, శాసనసభా పక్ష నాయకుడు ఎస్. రాజేష్‌కుమార్ ఈ ప్యానెల్‌లో సభ్యులుగా ఉంటారు. కాగా, క మిటీ నియామకంపై పార్టీ అధిష్టానాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి. చి దంబరం స్వాగతించారు. ఇది ఇండియా కూటమి ఐక్యతను బలోపేతం చేస్తుందని అన్నారు. ఈ ప్రకటన పొత్తుకు సంబంధించిన కొన్ని వాదనలకు ముగింపు పలుకుతుందని తాను విశ్వసిస్తున్నానని పేర్కొన్నాడు. 2026 అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ డిఎంకెను విడిచిపెట్టి, నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టివికె)తో చేతులు కలపవచ్చని అప్పుడప్పుడూ వాదనలు వినిపిస్తున్నందున చిదంబరం ప్రకటన ప్రాముఖ్యతను సంతరించుకుంది. తమ పార్టీ టివికెతో చేతులు కలపడంపై వస్తున్న ఊహాగానాలను చిదంబరం తోసిపుచ్చినట్లు తెలుస్తోంది.

## అంతర్జాతీయ ఆయుధ స్మగ్లింగ్ రాకెట్ గుట్టురట్టు

పాక్ నుంచి డ్రోన్‌ల సాయంతో అత్యాధునిక తుపాకులను భారత్‌లోకి తీసుకొస్తున్న నలుగురి అరెస్టు

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్న అంతర్జాతీయ ఆయుధ స్మగ్లింగ్ రాకెట్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. పాక్ నుంచి డ్రోన్‌ల సాయంతో అత్యాధునిక తుపాకులను భారత్‌లోకి తీసుకొస్తున్న నలుగురిని ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, ఢిల్లీలోని కొంతమంది భారీగా అక్రమ ఆయుధాలు తరలిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి క్రైమ్ బ్రాంచ్‌కు సమాచారం అందించింది. దీంతో డిసిపి సంజీవ్ కుమార్ యాదవ్ నేతృత్వంలోని బృందం ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. పలు ప్రాంతాల్లో నిఘా పెట్టారు. రోహిణిలో ఈ ఆయుధ మాడ్యూల్ గుట్టు బయటబపడింది. నిందితులు డ్రోన్‌లను ఉపయోగించి పాకిస్థాన్ నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. తుర్కియే, చైనాకు చెందిన అత్యాధునిక తుపాకులను పాకిస్థాన్ మీదుగా భారత్‌కు ఈ ముఠా తరలిస్తోంది. నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను అజయ్, మన్దీప్, దల్వీందర్ , రోహన్‌గా ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. వీరిలో ఇద్దరు పంజాబ్‌కు చెందిన వారు ఉన్నారు. వారి నుంచి విదేశాల్లో తయారైన 10 అత్యాధునిక తుపాకులు, 92 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆయుధాలను ఢిల్లీ, సమీపంలోని రాష్ట్రాల్లో గ్యాంగ్‌స్టర్లకు, నేరస్థులకు వీరు ఆయుధాలు విక్రయించినట్టు పోలీసులు తెలిపారు. అయితే ఈ ఆయుధాలను లారెన్స్ బిష్ణోయ్, బాంబిహా, గోగి వంటి గ్యాంగ్ సభ్యులకు ఇవ్వాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ అంతర్జాతీయ ఆయుధ ముఠా, పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధం ఉన్న వ్యక్తుల ఆదేశాల మేరకు పని చేస్తోందని ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ డిసిపి సంజీవ్ కుమారు తెలిపారు. 'ఈ ముఠా పని విధానం భిన్నంగా ఉంది. ఆయుధాలు పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో పడేసేవారు. అక్కడి నుంచి నిందితులు ఆయుధాలను సేకరించి, ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతం, సమీప రాష్ట్రాల గ్యాంగ్‌స్టర్‌లకు భారీ ధరలకు విక్రయించేవారు. ఇందులో ఐఎస్ఐ పాత్ర ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. అక్రమ ఆయుధాల సరఫరా అనేది దేశ భద్రతకు పెద్ద ముప్పు. ఢిల్లీ సరిహద్దుల్లో ఆయుధ స్మగ్లింగ్‌ను అరికట్టడంలో ఇదొక పెద్ద విజయం' అని సంజీవ్ కుమారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నెట్‌వర్క్‌పై ఢిల్లీ పోలీసులు



దర్యాప్తు చేపట్టారు. నిందితుల సెల్‌ఫోన్లు, బ్యాంకు లావాదేవీలు, సామాజిక మాధ్యమాల అకౌంట్లను పరిశీలిస్తున్నారు. ఎవరెవరికి, ఎన్నిఆయుధాలు విక్రయించారనే విషయమై విచారణ చేస్తున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నారు. రాకెట్ గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు రిమాండ్ కోరనున్నట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీలో ఎర్రకోట వద్ద బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ రాకెట్ గురించి బయటపడటం గమనార్హం.

## శ్రీనగర్‌లో మరో అనుమానితుడి అరెస్టు

**న్యూఢిల్లీ:** శ్రీనగర్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ పేలుడు ఘటన లో దర్యాప్తు బృందాల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. జైషే ఉగ్రవాద స ంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కేసుకు సంబంధించి శ్రీ నగర్ నివాసి ఒకరిని జమ్మూకశ్మీర్ పోలీస్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ శనివారంనాడు అరెస్టు చేసింది. బతమలూ ఏరియాకు చెందిన ఇతనిని తుఫైల్ ని యాజ్ భట్‌గా గుర్తించారు. గత అక్టోబర్‌లో నౌగామ్‌లోని బన్‌పోరలో పోలీసులు, భద్రతా సిబ్బందిని బెదిరిస్తూ పోస్టర్లు వెలిసాయి. దీనిపై శ్రీనగర్ పో లీసులు దర్యాప్తు ప్రారంభించడంతో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ వెలుగు చూసింది. ఇర్ఫాన్ అమ్మద్ అనే మరో వ్యక్తిని పట్టుకున్నారు.

## కేరళలో వేగవంతమైన 'సర్'పై రాజకీయ పార్టీల ఆందోళన

ఇది తొందరపాటు చర్య అని అధికార సిపిఐ(ఎం), ఇతర పార్టీలు మండిపాటు



**తిరువనంతపురం :** కేరళ ప్రధాన ఎన్నికల అధికారి రతన్ యు కేల్కర్ శనివారం రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై బిజెపి మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇది తొందరపాటు చర్య అని ఆరోపించాయి. ప్రజల సమస్యలను పరిష్కరించకుండానే సవరణ ప్రక్రియ జరుగుతోందని అధికార సిపిఐ(ఎం) తీవ్రంగా విమర్శించింది. సమావేశంలో పాల్గొన్న సిపిఐ(ఎం) నాయకుడు ఎం. విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఒక బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) ఆత్మహత్య చేసుకుని మరణించగా, మరో ఐదుగురు కుప్పకూలిపోయారని చెప్పారు. ఎంతో ఓపికగా, సక్రమంగా పూర్తి చేయగల ప్రక్రియను ఇంత తొందరపాటుతో నిర్వహించడం విచారకరమని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చట్టబద్ధత అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు ముందు ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ పరిస్థితిలో కూడా ఎటువంటి సడలింపు ఇవ్వలేదని, మానవీయ పరిశీలన లేకుండా దీనిని విధిస్తున్నారని, దీనిని తాము అంగీకరించమని స్పష్టం చేశారు. కమిషన్ వైఖరిని పార్టీ ఖండిస్తున్నదని, ప్రజల ఇబ్బందులను విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్)కు ప్రాతినిధ్యం వహిస్తున్న ముహమ్మద్ షా కూడా వేగంగా జరుపుతున్న ఓటరు జాబితా సవరణపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ నింపిన గణన ఫారాలను ఈనెల 23 లోపు తిరిగి ఇవ్వాలని, డిజిటల్ ప్రాసెసింగ్ 24, 25 తేదీలలో జరగాలని ఆదేశించిందన్నారు. డిసెంబర్ 4 వరకు సమయం ఉన్నప్పుడు భయాందోళనలు సృష్టించడం ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికే గడువు నిర్ణయించబడితే దానిని పొడిగించే అధికారం ఎవరికీ లేదా అని నిలదీశారు. భారత ఎన్నికల కమిషన్ స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాలు తీసుకోలేదన్నారు. సమయ వ్యవధిని పొడిగించే బదులు, షెడ్యూల్‌ను కుదించారని ఆయన ఆరోపించారు. కొత్త తేదీలు నవంబర్ 26న జరిగే సుప్రీంకోర్టు విచారణకు ముడిపడి ఉన్నాయని తాము అనుమానిస్తున్నామన్నారు. 80 శాతం కుటుంబాలు నవంబర్ 25 నాటికి ఫారాలను తిరిగి ఇచ్చాయని చూపించడానికి ఒత్తిడి ఉండవచ్చు అని ఆయన అన్నారు. కొంతమంది బిఎల్ఓ లను వీలైనంత త్వరగా గణన వివరాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారని ఆయన అన్నారు. 'మీరు ప్రజల పౌరసత్వంతో ఆడుకుంటున్నారు. చాలా మంది 2002 సర్ డేటాలో భాగం కాకపోవచ్చు. దీన్ని తొందరపెట్టకూడదు' అని ఆయన అన్నారు. సవరణ సమయంలో 1.19 లక్షల మందిని గుర్తించలేమని కూడా ఆయన పేర్కొన్నారు. 'దీని అర్థం ఈ వ్యక్తులను మినహాయించాలని కాదు. ఒక కుటుంబంలో ఎవరైనా పౌరులు కాదని చెప్పినప్పుడు, ప్రజలు దాని తీవ్రతను అర్థం చేసుకుంటారు' అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పార్టీ తరపున పాల్గొన్న బిజెపి నాయకుడు జె.ఆర్. పద్మకుమార్, కేరళలో 'ప్రక్రియను దెబ్బతీసేందుకు' యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ ఉద్యోగుల కార్మిక సంఘాలను కలుపుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా తిప్పికొట్టడం సముచితం కాదని, ఇది ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చన్నారు.

## మరణ మృదంగం మోగిస్తున్న 'సర్'

**న్యూఢిల్లీ:**ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు, యుటి ల్లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) మరణ మృదంగం మోగిస్తుంది. ఆయా రాష్ట్రాల్లో పని ఒత్తిడి కారణంగానే బిఎల్‌ఒలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల ఒత్తిడికి తట్టుకోలేక కుప్పకూలిపోతున్నారు. గుజరాత్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, కేరళలో ఆత్మహత్య బాధితులు రోజు రోజుకు పెరుగుతున్నారు. తాజాగా గుజరాత్, బెంగాల్‌లో ఒకరు చొప్పున, మధ్యప్రదేశ్‌లో ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. శనివారం వడోదరలోని ఒక పాఠశాలలో ఒక మహిళా బిఎల్‌ఒ అసిస్టెంట్ డ్యూటీలో ఉండగా కుప్పకూలి మరణించారు. సర్ పనిభారం ఒత్తిడి పెరుగుతుండటంపై పదునైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా గుజరాత్ అంతటా నాలుగు రోజుల్లో నలుగురు బిఎల్‌ఒ సిబ్బంది మరణించారు. వారిలో ఇద్దరు ఆకస్మిక గుండెపోటు తర్వాత, ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. బిఎల్‌ఒ అసిస్టెంట్ ఉషాబెన్ ఇంద్రసింహ్ సోలంకి కడక్ బజార్‌లోని ప్రతాప్ స్కూల్‌లో కుప్పకూలి మరణించారు. గోర్వా మహిళా ఐటిఐలో పనిచేసిన ఉషాబెన్ ఆరోగ్యం బాగాలేకపోయినా బిఎల్‌ఒ డ్యూటీ వేశారని పోలీసులు తెలిపారు. ఆమె భర్త ఇంద్రసింహ్ సోలంకి కుటుంబం అధికారులను ముందే హెచ్చరించిందని వెల్లడించారు. ఫీల్డ్ వర్క్ చేస్తున్నప్పుడు ఆమె సూపర్‌వైజర్ కోసం వేచి ఉండగా, ఉషాబెన్ అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఇంద్రసింహ బాధాకరమైన స్పష్టతతో చివరి క్షణాలను వివరించారు. ఆమె అకస్మాత్తుగా మూర్ఛపోయిందని,



హార్ట్ ఎటాక్ వచ్చినట్లు తెలుస్తోందని ఆమెను సయాజీ ఆసుపత్రికి తరలించాము, కానీ వైద్యుడు ఆమె మరణించినట్లు ప్రకటించినట్లు ఇంద్రసింహ్ వివరించారు. గుజరాత్ అంతటా గత నాలుగు రోజుల్లో మరో ముగ్గురు బిఎల్‌ఒ, సర్ సిబ్బంది మరణాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. కోడినార్‌లో అరవింద్‌భాయ్ వాధేర్ పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. తాపిలో, బిఎల్‌ఒ డ్యూటీలో ఉన్న కల్పనా బెన్ పటేల్ గుండెపోటుతో మరణించారు. ఖేడాలోని ఒక బిఎల్‌ఒ కూడా ఈ వారం ప్రారంభంలో డ్యూటీ సమయంలో కుప్పకూలి మరణించారు.

### పశ్చిమ బెంగాల్‌లో....

పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలో బూత్ లెవల్ ఆఫీసర్ గా పనిచేస్తున్న ఒక మహిళ శనివారం ఉదయం తన నివాసంలో ఉరివేసుకుని మరణించిందని, సర్ పని సంబంధిత ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకుందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఆత్మహత్య విషయాన్ని పోలీసులు కూడా ధృవీకరించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బిఎల్‌ఒ మరణం పట్ల తన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సర్ ఇప్పుడు ఆందోళనకరంగా మారిందన్నారు. 'ఈరోజు కృష్ణనగర్‌లో ఆ త్మహత్య చేసుకున్న మరో బిఎల్‌ఒ, లేడీ పారాటీచర్ మరణం గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఎసి 82 చాప్రాలోని పార్ట్ నంబర్ 201 బిఎల్‌ఒ రింకు తరాఫ్దార్ ఈరోజు తన నివాసంలో ఆత్మహత్య చేసుకునే ముందు తన సూసైడ్ నోట్‌లో ఇసిని నిందించారు (కాపీని దీనితో జత చేయబడింది) సర్ కోసం ఇంకా ఎంతమంది చనిపోవాలి. ఈ ప్రక్రియ కోసం మనం ఇంకా ఎన్ని మృ తదేహాలను చూడాలి? ఇది ఇప్పుడు నిజంగా ఆ ందోళనకరంగా మారింది' అని ఆవేదన వ్యక్తం చే శారు. 52 ఏళ్ల రింకు తరాఫ్దార్ గా గుర్తించబడిన బిఎల్‌ఒ, కృష్ణానగర్‌లోని చాప్రాలోని బంగల్జి ప్రా ంతంలోని తన నివాసంలో తన గది పైకప్పుకు వే లాడుతూ కనిపించిందని ఒక అధికారి తెలిపారు. ఆమె ఎస్‌ఐఆర్ పనిభారం కారణంగా ఆమె తీవ్ర ఒత్తిడికి గురవుతోందని కుటుంబం చెబుతోంది. ఆమె గది నుండి ఒక నోట్‌ను స్వాధీనం చేసుకున్నాము. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపాము. అవసరమైన దర్యాప్తు జరుగుతోంది' అని అధికారి తెలిపారు. బుధవారం, జల్‌పైగురి జిల్లాలోని ఒక బూత్ స్థాయి అధికారి ఉరి వేసుకుని కనిపించారు. ఆమె కుటుంబ సభ్యులు భరించలేని ఎస్‌ఐఆర్ పని ఒత్తిడి' ఆమె మరణానికి కారణమని పేర్కొన్నారు.

### మధ్యప్రదేశ్‌లో...

మధ్యప్రదేశ్‌లోని రైసెన్, దామో జిల్లాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కోసం ఓటరు జాబితా సర్వే నిర్వహించే ఇద్దరు టీచర్స్ కమ్ బూత్ లెవల్ ఆఫీసర్లు శుక్రవారం అనారోగ్యంతో మరణించారని అధికారులు తెలిపారు. అయితే, మరణించిన టీచర్స్ కమ్ బిఎల్‌ఒల బంధువులు, స్నేహితులు అధిక పనిభారం, గణన లక్ష్యాలను చేరుకోవడానికి ఒత్తిడి కారణంగా మరణాలు సంభవించాయని ఆరోపించారు. కాగా, రైసెన్ జిల్లాలో గత ఆరు రోజులుగా ఒక బిఎల్ కనిపించకుండా పోయారని, అతనిని కనుగొనడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి మరణించిన ఇద్దరు బిఎల్‌ఒలను రామకాంత్ పాండే, సీతారాం గోండ్ (50) గా గుర్తించారు. 'సత్లాపూర్ ప్రాంతానికి చెందిన రామకాంత్ పాండే అనే ఉపాధ్యాయుడు మందిదీప్‌లో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి అనారోగ్యం కారణంగా ఆయన మరణించారు' అని భోజ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం సబ్‌డివిజనల్ అధికారి (ఎస్‌డిఓ), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి చంద్రశేఖర్ శ్రీవాస్తవ శనివారం పిటిఐకి తెలిపారు. తప్పిపోయిన బిఎల్‌ఒను భవ్య నగరంలో నివసిస్తున్న ఉపాధ్యాయుడు నారాయణ్ దాస్ సోనిగా గుర్తించామని శ్రీవాస్తవ తెలిపారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుండి బయలుదేరిన ఆయన ఆరు రోజులుగా కనిపించడం లేదు. పోలీసులు, సోని కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతుకుతున్నారని అధికారి తెలిపారు.

## బిజెపి, ఇసి కలిసి ఓట్లు తొలగించాయ్

గత సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి, ఎస్‌పి గెలిచిన స్థానాల్లో ఓటు చోరీ కుట్ర


**లక్నో :** ఎన్నికల కమిషన్‌పై పలు రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలు విరుచుకుపడుతున్నాయి. ఓట్ల దొంగతనం చేస్తూ అధికార బిజెపికి సహకరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ గత సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ, ఇండియా కూటమి బాగా రాణించిన ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ నుండి 50,000 మందికి పైగా ఓటర్లను తొలగించడానికి బిజెపి ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుట్ర పన్నాయని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, ఇతర 11 రాష్ట్రాలు, యుటిల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో తన తండ్రి ములాయం సింగ్ యాదవ్ జయంతి సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లోఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కై పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తోందని తమకు సమాచారం అందిందన్నారు. వివాహాల సమయంలో ఎస్ఐఆర్ నిర్వహించవద్దని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అభిప్రాయపడ్డారు, ఉత్తరప్రదేశ్‌లో ఓటరు జాబితా శుభ్రపరిచేందుకు పోల్ ప్యానెల్ కాలపరిమితిని పొడిగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల డేటాను ఉటంకిస్తూ, 2022 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 255 సీట్లు గెలుచుకున్న బిజెపి... 2024 లోక్‌సభ ఎన్నికల్లో 162 అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే ఆధిక్యంలో ఉందని ఆయన అన్నారు. మరో వైపు, 2022లో 111 అసెంబ్లీ సీట్లు గెలుచుకున్న ఎస్‌పి.. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో 183 సెగ్మెంట్లలో ఆధిక్యంలో ఉందన్నారు.



2022లో కేవలం రెండు అసెంబ్లీ సీట్లు మాత్రమే గెలుచుకున్న కాంగ్రెస్, సార్వత్రిక ఎన్నికల్లో 40 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యంలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఆ డేటాను ఎత్తి చూపుతూ బిజెపి ఓటమి పాలైన తర్వాత కుట్రగా చేస్తూ 'సర్'ను తీసుకువచ్చిందని యాదవ్ ఆరోపించారు. తాము పోల్ ప్యానెల్ నుండి నిష్పాక్షికతను ఆశించామని, కానీ ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికలలో దాని పాత్ర ఆందోళనలను రేకెత్తించిందని పేర్కొన్నారు. తాము అనేక ఫిర్యాదులు దాఖలు చేసినప్పటికీ ఎటువంటి చర్య తీసుకోలేదన్నారు. ఎస్‌పి లేదా ఇండియా బ్లాక్ గెలిచిన ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 50,000 మందికి పైగా ఓటర్లను తొలగించడానికి బిజెపి ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ సన్నాహాలు చేస్తున్నాయని, 'సర్'ను ఒక సాకుగా ఉపయోగించుకుంటున్నాయని అఖిలేశ్ విమర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత బిజెపి, ఎన్నికల కమిషన్ ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌పై ప్రధానంగా దృష్టి సారించాయని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ పేర్కొన్నారు. పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలు ఓటర్ల జాబితాలను నిశితంగా ధృవీకరించాలని, బూత్ స్థాయి అధికారులను కలవాలని, అర్హత కలిగిన ఓటర్లు చేర్చబడ్డారని నిర్ధారించుకోవాలని, ఏవైనా అవకతవకలు జరిగితే వెంటనే పార్టీ ప్రధాన కార్యాలయానికి నివేదించాలని ఆయన కోరారు. సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్‌తో సహా ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణ ఆడియో రికార్డింగ్‌ను యాదవ్ కూడా ప్లే చేశారు. సర్ ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక సమస్యలను చర్చిస్తున్నారని, తన సొంత నియోజకవర్గం కన్నౌజ్‌ను ఉదాహరణగా ఉటంకిస్తూ, అది కూడా 'లక్ష్యం'గా మారిందని ఆయన అన్నారు. ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియ కోసం రాజకీయ పార్టీలకు స్పష్టమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని జారీ చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎక్కువ సమయం ఇవ్వాలని అఖిలేశ్ విజ్ఞప్తి చేశారు.



## కూతురు కోసం..



తండ్రీకూతుళ్ల అనుబంధం గురించి చైనా లో జరిగిన ఓ సంఘటన వివరిస్తుంది. తండ్రి త్యాగాన్ని ఎంతో భావోద్వేగంగా చెబుతుంది. బార్బెక్యూ రెస్టారెంట్‌లో పని చేస్తున్న లీ తన కుమార్తె బింగ్జిని జిలిన్ నార్మల్ యూనివర్సిటీలో చేర్పించాడు. అక్కడి క్యాంటీన్‌లో ఆహారం పరిశుభ్రంగా లేదని, రుచికూడా నాసిరకమేనని ఆమె తన తండ్రికి చెప్పింది. ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే తండ్రి ఆమె కోసం 900 కిలోమీటర్లు ప్రయాణించి తియాన్‌జిన్ చేరుకున్నాడు. కుమార్తె చదువుతున్న యూనివర్సిటీ ప్రాంతంలోనే ఒక ఫ్రైడ్‌రైస్ స్టాల్ పెట్టాడు. మొదటి రోజు కేవలం ఏడుగురు కస్టమర్లు మాత్రమే వచ్చారు. అయినప్పటికీ లీ పట్టుదలతో స్టాల్‌ను నడిపించాడు. తనపై ప్రేమతో ఉద్యోగాన్ని త్యాగం చేసి, స్టాల్ పెట్టిన తన తండ్రిని గురించి బింగ్జి సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్ట్ వైరల్ అయింది. ఆ స్టాల్ విపరీతమైన ప్రజాదరణ పొందింది. సమీప నగరాల నుండి ప్రజలు అతనికి మద్దతుగా నిలవడానికి ముందుకొచ్చారు. ఇది కథకాదు. వాస్తవం. తండ్రి ప్రేమ, త్యాగానికి శక్తివంతమైన ఉదాహరణ. భార్య లుకేమియాతో మృతి చెందిన తర్వాత కుమార్తెను ముద్దుగా పెంచుకున్న తండ్రికి సోషల్ మీడియాలో లక్షలాది మంది జేజేలు పలుకుతున్నారు. మానవ సంబంధాలు కరువవుతున్న నేటి కాలంలో ఇలాంటి ఘటనలు మానవత్వపు విలువలను చాటిచెప్తాయి.

## ఎఐ సృష్టించిన కట్టుకథ



కృత్రిమ మేధస్సు (ఎఐ) విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు, అందిస్తున్న సమాచారం ఎంత వరకూ నిజమన్నది తెలియకుండా పోతున్నది. ఈ వికృత రూపానికి పరాకాష్టగా 91 ఏళ్ల వృద్ధురాలు సంకెళ్లతో కోర్టు ముందుకు వచ్చిందంటూ కనిపించిన పోస్టును చెప్పుకోవాలి. అందులోని వివరాల ప్రకారం ఆ వృద్ధురాలి పేరు హెలెన్ మిర్రర్. ఆమె భర్త జార్జికి తీవ్రమైన గుండె సమస్యలు ఉన్నాయి. వారి ఇన్సూరెన్స్ ముగిసిపోయింది. మరోవైపు మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. 50 డాలర్ల విలువైన మందులు 950 డాలర్లకు చేరుకోవడంతో, వాటిని కొనలేక, భర్తను చంపుకోలేక హెలెన్ ఒక దుకాణం నుంచి మందులను దొంగిలించింది. సిసి కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డు కావడంతో, పోలీసులు ఆమెను అరెస్టు చేసి కోర్టు ముందు నిలబెట్టారు. న్యాయమూర్తి తీవ్ర భావోద్వేగానికి గురై, వెంటనే సంకెళ్లు తీసేయాల్సిందిగా ఆజ్ఞాపిస్తాడు. ఆమె నేరస్తురాలు కాదని, ఆమెకు సాయం చేయడంలో వ్యవస్థే విఫలమైందని వ్యాఖ్యానించి, నిర్దోషిగా వదిలేస్తాడు. పైగా ఆమెకు అవసరమైన సాయం అందించాలని అధికారులను ఆదేశిస్తాడు. కథనంగా చూస్తే, ఇది నేరుగా గుండెలకు హత్తుకుపోతుంది. సమాజ పరిస్థితులను కళ్లకు కడుతుంది. కానీ, ఇదంతా ఒక కట్టుకథగా 'ఫ్యాక్ట్ చెక్'లో తేలింది. అంతా ఎఐ సృష్టించిన కథగా స్పష్టమైంది. ఈ కథనాన్ని చూసి ఎంతో మంది తీవ్రంగా స్పందించడమేకాదు, సాయం చేస్తామని ముందుకు వచ్చారు కూడా. ఇదింతా కట్టుకథ అని తెలిసిన తర్వాత వారి పరిస్థితి ఏమిటో!

## కేసులు గెలిచిన నకిలీ లాయర్!




కెన్యా హైకోర్టులో బ్రియాన్ వెన్డా అనే పేరుతో ఒక వ్యక్తి లాయర్‌గా ప్రాక్టీస్ చేశాడు. 26 కేసులు గెలిచాడు. కెన్యా పోలీసులు అరెస్టు చేసే వరకూ, అతనికి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసే లైసెన్స్ లేదని గానీ, అసలు న్యాయ శాస్త్రమే చదవలేదనిగానీ ఎవరికీ అనుమానం కూడా రాలేదు. మరో వ్యక్తి పేరుతో అతను లాయర్‌గా చెలామణి అయ్యాడని అసలే ఊహించలేక పోయారు. ఒక వ్యక్తి తప్పుడు ధ్రువ పత్రాలతో, ఎలాంటి జంకుగొంకు లేకుండా ఏకంగా హైకోర్టులోనే లాయర్‌గా కొన్ని సంవత్సరాలు ప్రాక్టీస్ చేయడం ఇప్పుడు కెన్యా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వెన్డా 'లా సొసైటీ ఆఫ్ కెన్యా' అనే సంస్థ పోర్టల్‌ను హాక్ చేసి, ఒరిజినల్ లాయర్ అయిన బ్రియాన్ మ్వెండా అనే వ్యక్తి ఖాతాలో ఈ నకిలీ లాయర్ తన ఫొటోను అప్‌లోడ్ చేశాడు. తర్వాత న్యాయస్థానాల ముందు తనను లాయర్‌గా పరిచయం చేసుకున్నాడు. న్యాయమూర్తులను, క్లయింట్లను మోసం చేశాడు. అసలు లాయర్ అనారోగ్య కారణంగా తన ఖాతాను లాగిన్ చేయకపోవడం ఈ నకిలీ లాయర్‌కు కలిసొచ్చింది. నిజమైన లాయర్ బ్రియాన్ కోలుకొని, తన ఖాతాకు లాగిన్ అయ్యేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీనితో అతను లా సొసైటీ ఆఫ్ కెన్యాకు ఫిర్యాదు చేశా డు. దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. నకిలీ లాయర్‌ను అరెస్టు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. గోప్యతా కారణాల వల్ల అతని పేరును ప్రకటించలేదు. ఏదిఏమైనా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన వెంటనే, న్యాయ వ్యవస్థ పరిరక్షణకు కఠినమైన చర్యలు తీసుకునే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

## అనుభూతులు కలిగించే 'క్వాలియా'!



కొన్ని సంఘటనలు లేదా వస్తువులను తలచుకుంటే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. మరికొన్నింటి విషయంలో కోపం లేదా అసహ్య భావం ఏర్పడవచ్చు. వాస్తవానికి ఆ పరిస్థితి భౌతికంగా లేకపోయినా, మనసులో ఊహించుకొని, ఒక రకమైన భావోద్వేగానికి గురికావడాన్ని 'క్వాలియా'గా పేర్కొంటారు. శాస్త్రవేత్తల అధ్యయనాలను అనుసరించి మన వ్యక్తిగత లేదా అనుభూతి ఆధారిత మెళకువలు లేదా లక్షణాలు వేరువేరు అంశాల్లో వేరువేరుగా ఉంటాయి. మానవ మస్తిష్కంలో సదరు భావనలు తటస్థంగా ఉన్నప్పటికీ, ఆయా వస్తువను తలచుకున్నప్పుడు కొన్నిరకాల అనుభూతులు కలుగుతాయి. ఉదాహరణకు, ఎరుపు రంగును తలచుకున్నప్పుడు తలనొప్పి రావడం, చాక్లెట్‌ను ఊహించుకున్నప్పుడు సానుకూల అనుభూతిని పొందడం. అలాంటి అనుభూతులను ఎందుకు పొందుతున్నామనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. అంతేగాక, ఎందుకు భావోద్వేగాలకు గురవుతానే ప్రశ్నకు సమాధానం లేదు. ఈ సందిగ్ధ భావనను 'ఎక్స్‌ప్లనేటరీ గ్యాప్' (వివరణ వ్యవధి)గా పిలుస్తారు. అంటే, మన మెదడులో జరిగే శాస్త్రీయ ప్రక్రియలు ఎంతటి అధికంగా వివరించినా, వాటి ద్వారా మనకు రాగల అనుభూతులు ఎలా వస్తాయో, అవి అలాగే ఎందుకు అనిపిస్తాయో ఇప్పటికీ పూర్తిగా చెప్పలేకపోతున్నారు. దీనిపై లోతైన అధ్యయనం అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

## 'టైమ్ మిర్రర్' నిజమే!



గతాన్ని లేదా భవిష్యత్తును ఒక 'మాయా దర్పణం'లో చూపించడాన్ని కథల్లో చదివి ఉంటాం.. కానీ, ఇలాంటి 'టైమ్ మిర్రర్' (కాల దర్పణం) సాధ్యమేనని అంటున్నారు శాస్త్రవేత్తలు. భౌతికి సిద్ధాంతాలు.. గణిత సూత్రాల ఆధారంగా ఇది సాధ్యమేకావచ్చుగానీ, వాస్తవంలో అసాధ్యమన్నది శాస్త్రవేత్తల నిశ్చితాభిప్రాయం. అయితే, అమెరికాలోని 'సిటీ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్' (సియుఎన్‌వై)కి చెందిన అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ పరిశోధకులు 'టైమ్ మిర్రర్' నిజమేనని 2023లో ప్రకటించారు. వారు ఒక ప్రత్యేక పదార్థంలో విద్యుదయస్కాంత తరంగాలను మార్చడం ద్వారా సమయ ప్రతిబింబాన్ని ప్రదర్శించారు. దీనివల్ల అవి కాలంలో వెనుకకు ప్రతిబింబిస్తాయి. ఈ పురోగతి 60 ఏళ్ల నాటి సిద్ధాంతంపై ఆధారపడింది. ఇది నిజమైన భౌతిక శాస్త్ర అద్భుతం. అయితే, ఇది గతానికి కాలానికి ప్రయాణాన్ని అనుమతించదు. కాగా, కాల దర్పణం ప్రయోగంలో తరంగాలను అంతరిక్షం ద్వారా కాకుండా, కాలం ద్వారా ప్రతిబింబపచేస్తారు. ఫలితంగా తరంగ పురోగతి తిరగబడుతుంది. అంటే, తరంగ ముగింపు తొలుత కనిపిస్తుంది. ఈ తిరోగమన విధానాన్ని సృష్టించడానికి శాస్త్రవేత్తలు తరంగాలు ప్రయాణించే మాధ్యమం లక్షణాలను మార్చడానికి మెటామెటీరియల్, అల్ట్రాఫాస్ట్ స్విచ్‌లను ఉపయోగించారు, ఇది కాలంలో వెనుకకు తరంగాలను ప్రతిబింబించే 'టైమ్ ఇంటర్‌ఫేస్'ను సృష్టించింది. మొత్తంమీద ఈ ప్రయోగం దశాబ్దాల నాటి 'టైమ్ మిర్రర్' ఆలోచనను, ఊహాజనిత సంభావ్యతను నిర్ధారిస్తున్నది. అధునాతన సెన్సార్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, సమయం యొక్క ప్రాథమిక స్వభావాన్ని అధ్యయనం చేయడం వంటి రంగాలలో ఇది సంభావ్య అనువర్తనాలను కలిగి ఉంది. ఇలా వుంటే, ఇది తరంగ ప్రవర్తనకు సంబంధించిన మార్పు మాత్రమేనని గుర్తించాలి. అంటే, గతానికి ప్రయాణించే మార్గం కాదు. గతంలోకి వెళ్లి... వాస్తవికతను మార్చవచ్చని అర్థం చేసుకోకూడదు. అంతేకాదు, 'టైమ్ మిర్రర్'పై మరింత లోతైన అధ్యయనం జరుగుతున్నది. ప్రస్తుతానికి ఇది సాధ్యమేని ప్రయోగాత్మకంగా రుజువైంది. ఫలితాలు, మార్పులు తెలియాల్సి ఉంది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# శ్రామికశక్తిపై మోదీ పిడుగు
## అనివార్యమైన ఐక్య ప్రతిఘటన

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నియంతలాగా ఏకపక్షంగా శుక్రవారం నుంచి అమలులోకి తెచ్చిన నాలుగు కార్మిక స్మృతులు(కోడ్‌లు) అది చెప్పుకుంటున్నట్లు సంఘటిత, అసంఘటిత కార్మికులకు శ్రేయస్సు–సంక్షేమం–భద్రత చేకూర్చకపోగా ఆచరణలో అవి వారిపాలిట సంకెళ్లు అవుతాయి; సంపద సృష్టికర్తలైన శ్రామికులను పెట్టుబడికి బానిసలుగా మార్చుతాయి. ఆశ్రిత పెట్టుబడిదారులకు లాభాలు కురిపించటమే ప్రభుత్వ లక్ష్యం. ''వ్యాపారాలు చేసుకోవడాన్ని సులభతరం చేయటం''ఈ కోడ్‌ల ధ్యేయంగా ప్రభుత్వం దాపరికంలేకుండా చెప్పింది. అంటే వ్యాపారులపై ప్రభుత్వ ఆంక్షలు తొలగించటం, కార్మికుల హక్కులు హరించి వారిని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టటమేనని ఎవరికైనా సులభంగా అర్థమవుతుంది. ఈ దేశ కార్మిక వర్గం స్వాతంత్ర్యం ముందు – ఆ తర్వాత అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ హక్కులు – పనిభద్రత, బేరసారాల హక్కు, సమ్మె హక్కు, ఆరోగ్యం, సంక్షేమం, రిటైర్మెంట్ భద్రతవగైరాలతోకూడిన 29 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం గంగలో కలిపి, మేలి ముసుగులతో, భ్రమలు కల్పించే హామీలతో ఈ కోడ్‌లు రూపొందించి ఆదరాబాదరా–లోతైన చర్చ, పరిశీలన లేకుండానే పార్లమెంటునుంచి ఆమోదముద్ర వేయించుకుంది. తొలుత 2019 లో వేతనాలపై కోడ్‌ను ఆమోదించింది. ఆ వెంటనే కేంద్ర కార్మిక సంఘాలు (బిఎంఎస్‌మినహా) నిరసన ఆందోళనలు చేబట్టి అంతిమంగా 2020 జనవరిలో సార్వత్రిక సమ్మెతో హెచ్చరిక చేశాయి. మిగతా మూడు పారిశ్రామిక సంబంధాల కోడ్; సామాజిక భద్రత కోడ్; వృత్తి సంబంధ భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లను 2020 సెప్టెంబర్‌లో ఆమోదించిన వెంటనే 10 కేంద్ర ట్రేడ్ యూనియన్‌ల(సిటియులు) ఐక్యవేదిక నవంబర్ 26న విజయవంతంగా సార్వత్రిక సమ్మె నిర్వహించింది. అదేరోజు సంయుక్త కిసాన్ మోర్చా చరిత్రాత్మక ఢిల్లీ మార్చ్ చేబట్టింది. కార్మిక–కర్షక ఐక్యపోరాటానికి అది నాంది పలికింది. తదుపరి పలుసార్లు ఆందోళనలు నిర్వహించింది. 2025 జులై 9న 25కోట్లమంది శ్రమజీవులు పాల్గొన్న అపూర్వమైన సార్వత్రిక సమ్మె ఈ నిరసన పోరాటాల క్రమంలో చివరిది. శ్రమశక్తినీతి, 2025పై నవంబర్ 13న కార్మికమంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర టియుల సంయుక్త వేదిక, 2015 నుంచి పిలవని ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎల్‌సి)ని తక్షణం సమావేశ పరచాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరాయి. రెండ్రోజులక్రితం – నవంబర్ 22న ఆర్థికమంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన బడ్జెట్‌పూర్వ సంప్రదింపుల సమావేశంలో కూడా సిటియులు అవే డిమాండ్‌లు పునరుద్ఘాటించాయి.

ప్రజాపక్షం
23-11-2025, ఆదివారం

ఇంత తీవ్రమైన ప్రతిఘటన ఉన్నప్పటికీ ఖాతరు చేయకుండా ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి కేంద్రప్రభుత్వం మొండిగా, ఏకపక్షంగా నాలుగు కోడ్‌లు అమలులోకి తేవటం దుర్మార్గం, అప్రజాస్వామికం. మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు తెచ్చి రైతుల పట్టువిడవని ప్రతిఘటనతో భంగపడిన ప్రధాని నరేంద్రమోదీకి రైతులు – కార్మికుల ఐక్య పోరాటాలు గుణపాఠం నేర్పకపోవు. శ్రమజీవులపై చావుదెబ్బ తీసిన మోదీ ప్రభుత్వ చర్య అత్యంత తీవ్రమైన ప్రతిఘటనకు గురవుతుందని సిటియులు హెచ్చరించాయి. ''శ్రమజీవులపై బానిసత్వం విధించజూస్తున్న కోడ్‌లను కార్మికుల జీవితాలు, జీవనోపాధులపై హత్యాసదృశ దాడిగా'' అభివర్ణించిన సిటియులు అవి కార్మికుల ప్రతి ఒక్క హక్కును, సదుపాయాలను లాగేసుకుంటాయని పేర్కొన్నది. వాటిని అమలు చేస్తే రానున్న తరాల ఆశలు, విశ్వాసం, ఆకాంక్షలు అంతర్ధానమవుతాయని తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేసింది. ఈ బాధ, ఆవేదన, పలుమార్లు చేసిన సార్వత్రిక సమ్మెలు ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం కలుగజేయలేదంటే అది జాతీయ, అంతర్జాతీయ గుత్తపెట్టుబడికి ఎంతగా గులాంగా మారిందో ఊహించుకోవచ్చు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, శ్రమశక్తినీతి ముసాయిదా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26న తమ తీవ్రమైన ఆగ్రహాన్ని, ధిక్కారాన్ని వ్యక్తం చేస్తూ, దేశవ్యాప్తంగా సంయుక్త ఆందోళన చేబట్టాలని అన్ని రంగాలలోని శ్రామికులకు సిటియుల సంయుక్త వేదిక, స్వతంత్ర పారిశ్రామిక యూనియన్‌లు పిలుపు ఇచ్చాయి. అదేరోజున రైతాంగ నిరసన ప్రదర్శనలకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు ఇచ్చింది.

కార్మికుల అంశం కేంద్రం–రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉన్నందున లేబర్ కోడ్‌ల అమలుకు చట్టాలు, రూల్సు రూపొందించే బాధ్యతను కేంద్రం రాష్ట్రాలకు అప్పగించింది. కొన్నేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నం బిజెపియేతర పార్టీల పాలన ఉన్న రాష్ట్రాల్లో ముందుకు సాగలేదు. అందువల్ల కోడ్‌ల అమలు వాయిదాపడుతూ వచ్చింది. బిహార్ ఎన్నికల ఫలితాల విజయగర్వంతో మోదీప్రభుత్వం ఇప్పుడు ఆకస్మికంగా ప్రకటన చేసింది. కోట్లాది మంది శ్రమజీవుల గోస ను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వానికి ముప్పు తప్పదు.

# సిపిఐ చరిత్రలో కీర్తి కిరీటం
# తెలంగాణ సాయుధ పోరాటం




కందిమళ్ళ ప్రతాపరెడ్డి

హైదరాబాద్ సంస్థానం నిజాం నవాబు రాజరిక పాలనలో ఉంది. ఆసఫ్‌జాహీ వంశం 225 సంవత్సరాలుగా రాజ్యపాలన చేస్తున్నది. 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో ప్రజాస్వామ్య హక్కుల్లేవు. రాజకీయాలు నిషేధం. ఉర్దూను రాజభాష చేశారు. 80% ఉన్న తెలుగు, మరాఠీ, కన్నడిగుల మాతృభాషలు నిషేధం.

దేశం స్వాతంత్ర్యం కోసం పోరాడుతుంటే – 1931లో హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు భాష మాట్లాడేవారు తమ మాతృభాషకు స్వేచ్ఛకావాలని కోరుకున్నారు.

1931న భాషా ఉద్యమంగా కొద్దిమంది వ్యక్తులతో, రాజకీయేతర సంస్థగా ప్రారంభమైన ఆంధ్రమహాసభ క్రమంగా, సాంఘిక ఉద్యమంగా ప్రజా సమస్యలకై ఉద్యమంగా మారింది. అంటరానితనం, వెట్టిచాకిరి, దొరలు, జమీందార్లు, జాగీర్దార్ల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేక సాంఘిక ఉద్యమంగా మారింది. అయ్య నీ బాంచన్, నీగులాపోన్నంటూ వెట్టిచాకిరీ, సాంఘిక దురాచారాలలో నలిగిపోతున్న జనానికి ఆంధ్రమహాసభ రాజకీయ చైతన్యం కలిగించింది. వెట్టిచాకిరి వద్దు, దోపిడీ, దౌర్జన్యాలు రద్దు అని గ్రామగ్రామాన ఉద్యమం సాగింది. అనతి కాలంలోనే ఉద్యమం తెలంగాణమంతటా విస్తరించింది. గ్రామగ్రామాన గ్రామ కమిటీలు, రక్షక దళాలు ఏర్పడ్డాయి.

ఉద్యమాన్ని అణచడానికి నిజాం ప్రభుత్వం 1946లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించింది.



1946–బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించనున్నట్లు వైస్రాయ్ మౌంట్ బాటెన్ అవార్డు పేరుతో ప్రకటన వచ్చింది. జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వమేర్పడింది. మౌంట్ బాటన్ స్వాతంత్ర్యానికి ముందు భారత్ – పాకిస్తాన్ విభజన జరగాలన్నాడు. దేశంలోని సంస్థానాధీశులు భారతదేశంలో లేదా పాకిస్తాన్‌లో చేరడానికి, లేదా స్వతంత్రంగా వుండటానికి స్వేచ్ఛ వుంటుందన్నారు.

నిజాం నవాబు గత చరిత్రను తడివి, బ్రిటిష్ పాలకులతో తనకున్న సంబంధాలు, చేసుకున్న ఒడంబడికలు బహిర్గతం చేస్తూ తనది స్వతంత్ర దేశమన్నాడు. తన రాజ్యాన్ని, రాజరిక వ్యవస్థను కాపాడుకోవడానికి బ్రిటిష్ ప్రభుత్వంతో రాయబారాలు జరిపాడు. ముస్లిం రాజు పాలనను నిలబెట్టడానికి ముస్లింలందరూ ఏకం కావాలని ఇత్తెహాదుల్ ముస్లిం నాయకుడు ఖాసిం రజ్వీ మతోన్మాదంతో యువకులను రెచ్చగొట్టాడు. రజాకార్ల(వలంటీర్లు) సాయుధ బలగాన్ని నిర్మించాడు.

హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిజాం నవాబు ఛత్రఛాయల్లో బాధ్యతాయుత ప్రభుత్వం కావాలన్నది, నిజాం ప్రభుత్వం భారతదేశంలో భాగంగా ఉండాలన్నది, కమ్యూనిస్టు పార్టీ దానిని వ్యతిరేకిస్తూ, నిజాం నిరంకుశ రాజరిక పాలన అంతం, హైదరాబాద్ స్టేట్ భారతదేశంలో విలీనం జరగాలన్నది. దున్నేవానికే భూమి, విశాలాంధ్రలో ప్రజారాజ్యం నినాదంతో ప్రజా చైతన్యాన్ని రగిలించింది.

భారతదేశం 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. కానీ, నిజాం నవాబు భారతదేశంలో విలీనానికి నిరాకరించాడు. భారత ప్రభుత్వం నిజాం నవాబు రాజరిక వ్యవస్థను కొనసాగించడానికి, భారతదేశంలో భాగంగా ఉండాలని రాజీ సంప్రదింపులు, రాయబారా లు జరిపింది. కానీ, నిజాం లొంగలేదు. నిజాం మిలటరీ, పోలీసు బలగాలకు తోడుగా ఖాసింరజ్వీ రజాకర్లు 90,000మంది తోడయ్యారు.

కమ్యూనిస్టు పార్టీని నాశనం చేయడానికి గ్రామాలపై ఆకస్మిక దాడులు చేశారు. స్త్రీల మానాలు దోచారు. దొరికిన వారిని చిత్రహింసలకు గురి చేశారు. అక్రమ కేసులు పెట్టి జైళ్లల్లో పెట్టారు. మరోవైపున భారత ప్రభుత్వం నిజాం నవాబుతో రాజీ ప్రయత్నాలు చేస్తున్నది. నిజాం నిరంకుశ పాలన అంతమై సంస్థానం భారతదేశంలో విలీనం జరగాలంటే సాయుధ పోరాటం తప్ప మరో మార్గం లేదని ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు గ్రహించాయి.

1947 సెప్టెంబర్ 11న ఉద్యమ నాయకులు రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు.

అయ్య నీ బాంచనన్నోళ్లే బందూకులు పట్టారు. కారం, రోకలి, కర్రలు, గుత్పలు, వడిశల అందిందల్లా ఆయుధమయ్యింది. అనతికాలంలోనే 10,000మంది గెరిల్లా దళ సభ్యులయ్యారు. వేలాదిమందితో గ్రామ రక్షక దళాలేర్పడ్డాయి. స్త్రీలు, పురుషులు, బాలలు నిజాం సేనలను, రజాకార్లను తరిమికొట్టారు.

3000 గ్రామాల నుండి దొరలు, దేశముఖులు, జాగీర్దార్లు, జమీందార్లను తరిమికొట్టి గ్రామ రాజ్యాలు ఏర్పాటు చేశారు. వారి ఆక్రమణలోని 10,00,000 ఎకరాల భూమి పేదలకు పంచారు. ఖాసింరజ్వీ నిషా దిగింది. నిజాం నవాబు కోరలు పీకినట్టయింది. భారత ప్రభుత్వంతో రాజీపడటమే మంచిదనుకున్నాడు. లేకుంటే తమ రాజ్యం కమ్యూనిస్టులు ఆక్రమిస్తారని భయపడ్డాడు. చివరకు 1948, సెప్టెంబర్ 13న భారత సైన్యాలు ప్రవేశించాయి. నవాబు తన రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేస్తున్నట్టు ప్రకటించాడు. కొద్ది రోజులకు నిజాం నవాబు రాజప్రముఖుడుగా కొత్త అవతారమెత్తా రు.





### కమ్యూనిస్టు పార్టీ ద్వితీయ మహాసభ

1948 ఫిబ్రవరి 28 నుండి మార్చి 6వరకు కలకత్తాలో జరిగిన రెండవ పార్టీ మహాసభ నిర్ణయాలు అతివాద దుందుడుకువాదంతో వాస్తవ పరిస్థితులకు భిన్నంగా జరిగాయి. పార్టీ తీవ్రంగా నష్టపోయింది.

భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం రాలేదని, ప్రభుత్వం చేతులు మారిందని, నిజమైన స్వాతంత్ర్యం సాధించడానికి దేశవ్యాపిత సాయుధ సమరం సాగించాలని, దానికి తెలంగాణ పోరాట కేంద్రం కావాలన్నది. దాన్ని ప్రజలు హర్షించలేదు. పార్టీ అభిమానులు, కొంతమంది కార్యకర్తలు పార్టీకి దూరమయ్యారు. ప్రజా సంఘాలు బలహీనపడ్డాయి.

1947 నుండి 1951 వరకు జరిగిన తెలంగాణ పోరాటంతో, తెలంగాణ ప్రాంతంలో 4000 మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అమరులైనారు. ఆంధ్ర ప్రాంతంలో దాదాపు 500 మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు కాల్చివేయబడ్డారు. కాటూరు–ఎలమర్రులో మానవత్వం మరిచిన సంఘటనలు జరిగాయి.

తెలంగాణ సాయుధ పోరాటం దేశ, విదేశాలలో ఖ్యాతిగాంచింది. కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టకు, వీరుల విప్లవ దీక్షకు, త్యాగాలకు ప్రతీక అయ్యింది. తెలంగాణమంతటా ప్రతి పల్లె, ప్రతి చెట్టూ, గుట్టా పోరాట చరిత్రను ప్రతిధ్వనించింది.

ఎన్నో వీరగాథలు నేటికి యువతను ప్రభావితం చేస్తున్నాయి.

1951 అక్టోబరు 21 సాయుధ పోరాట విరమణ జరిగింది.ఆ పోరాట ఫలితంగా వేలాది ఎకరాల భూమి కౌలుదార్లకు దక్కింది. జాగీర్లు, జమీందారీ విధానం రద్దయ్యింది. దేశంలో భూసమస్య ప్రధాన సమస్యగా వెలుగులోనికొచ్చింది.

కొద్దికాలం క్రితమే నిషేధం నుంచి బయటకు వచ్చిన సిపిఐ, 1952 ప్రథమ సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంటు, శాసనసభలకు పరిమితంగానే అభ్యర్థులను నిలిపినా మంచి ఫలితాలు సాధించి పార్లమెంటులో, కొన్ని శాసనసభల్లో ప్రధాన ప్రతిపక్షమయ్యింది.

* విదేశీ పాలన నుండి గోవా, పుదుచ్చేరి ప్రాంతాల విముక్తికి జరిగిన పోరాటాల్లో ముందున్నది.
* రైతు కూలీ, కార్మిక హక్కుల కోసం ఇతర ప్రజా సమస్యలపై అనేక ఆందోళనలు, ఉద్యమాలు సాగించింది.
* బ్యాంకులు, ఇన్సూరెన్సు జాతీయాకరణ, రాజభరణాల రద్దు, 18 సంవత్సరాలకు ఓటింగు హక్కు సాధించింది. ఇదంతా ఘనమైన గత చరిత్ర – త్యాగాల చరిత్ర– చరిత్రలో చెరగని సువర్ణాధ్యాయాలు. పార్టీలో చీలిక అనంతరం వివిధ పేర్లతో పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీలు వారి పద్ధతుల్లో ప్రజలపక్షాన ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నాయి. కానీ...

***

ఆ చరిత్ర ఏమయ్యింది? ఆ త్యాగాలు ఏమైనాయి?

ఎందుకు రోజు రోజుకూ కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడుతున్నారు.

ఈనాటి స్థితికి 1964లో పార్టీలో చీలిక – తర్వాత చీలికలు పేలికలుగా మారడం కారణమా? సిద్ధాంతానికి కాలం చెల్లిందా? ఆచరణలో అవగాహన లోపించిందా?

పార్టీ చీలడానికి కారణాలున్నాయి! కానీ, ఇప్పుడు ఐక్యం కాకపోవడానికి అవరోధాలేమిటి?ఇది సామాన్య కమ్యూనిస్టు అభిమానులు, శ్రేయోభిలాషులు అడుగుతున్న ప్రశ్న. కార్యకర్తల మనసుల్లోని ఆవేదన. కమ్యూనిస్టు పార్టీలు నిర్మాణ రీత్యా బలహీనపడ్డాయి. కానీ, ప్రజాదరణ కోల్పోలేదు.

అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రగతిశీలురు, కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయంగా ఎదగాలని కోరుకుంటున్నారు.

దేశం పరిస్థితి ఎలా ఉన్నా!

దేశంలో విప్లవోద్యమానికి పేరుగాంచిన చారిత్రాత్మక తెలంగాణ సాయుధ సమరాన్ని సాగించి, 4500 వీరుల ఆత్మబలిదానంతో ఎరుపెక్కిన తెలుగు నేలపై – ఆంధ్ర – తెలంగాణలో ఏ పల్లె కెళ్ళినా – ఏ పుట్టా – చెట్టూనడిగినా ఆనాటి పోరాటాన్ని, వీరుల త్యాగాలను, వీర కృత్యాలను గుర్తు చేస్తాయి. ఎటు చూసినా అమరవీరుల స్మారక స్థూపాలు దర్శనమిస్తాయి. వేలాది వీరుల రుధిరంలో ఎరుపెక్కిన ఎర్రజెండాలు కనిపిస్తాయి.

భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలు కమ్యూనిస్టుల్లో–వారు ఏ పేరుతో ఉన్నా – పునరాలోచనకు, ఐక్య కార్యాచరణ, ఐక్యతకు ప్రేరణ కావాలి. అట్టి ఐక్యత శ్రమజీవులకు భరోసా ఇస్తుంది – పునరుత్తేజం నింపుతుంది.

(ముగిసింది)

### కాంగ్రెస్‌లోనుంచి బయటకు...

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత కాంగ్రెస్ నాయకులందరూ విడుదలయ్యారు. 1945 సెప్టెంబరు 21న కాంగ్రెస్ పార్టీ తరపున కార్యదర్శి జె.బి.కృపలాని, ఎ.ఐ.సి.సి. సభ్యులైన 12మంది కమ్యూనిస్టులకు షోకాజ్ నోటీసు పంపారు.

1. ఎఐసిసి పాలసీకి విరుద్ధంగా 1942 నుండి ప్రజాయుద్ధం ప్రచారం చేశారు.
2. కాంగ్రెస్ పాలన తమ పాలసీ కాదని ప్రకటించారు.
3. కాంగ్రెస్ పాలసీని విమర్శిస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమటీపై అనేక ఆరోపణలు, వ్యాఖ్యానాలు చేశారు. అందువల్ల మీమీద క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో సమాధానం చెప్పాలన్నారు. విచారణ కమిటీ సభ్యులుగా జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, గోవింద్ వల్లభ్‌పంత్ నియమితులయ్యారు. కమటీ సభ్యులను విలేకరులు అడిగిన ప్రశ్నకు

''ఒకవేళ సమాధానాలు సంతృప్తికరంగా లేకపోతే, ఏమి చర్య తీసుకుంటామన్న దానికి సమాధానం చెప్పడం తొందర పాటు అవుతుంది. కానీ, ఒక విషయం స్పష్టం చేయ దలచాము. కమ్యూనిస్టులకు కాంగ్రెస్ ద్వారాలు మూసివేయ బడలేదు. విధానాలను వ్యతిరేకించిన వారిని కాంగ్రెస్ కార్య నిర్వహణ పదవుల్లో కొనసాగించడం సబబా అన్నది పరిశీలించవలసి వుంది'' అన్నారు.

షోకాజ్ నోటీసుకు విడివిడిగా సమాధానం కాకుండా, కార్యదర్శి పి.సి.జోషి సమాధానం చెప్పడం మంచిదనుకున్నారు. పార్టీ తరపున పి.సి.జోషి, కాంగ్రెస్ తరపున మహాత్మాగాంధీ మధ్య ఈ అంశంపై సుదీర్ఘమైన ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయి.

చివరకు బూర్జువా పార్టీలో ఉండి పనిచేయడం కంటే, బయటకు వచ్చి విప్లవ పార్టీగా స్వతంత్రంగా పనిచేయాలని పార్టీ నిర్ణయించుకున్నది. కాంగ్రెస్ నుండి కమ్యూనిస్టులు బయటకు వచ్చారు.

అన్ని పార్టీలు వేరైన తర్వాత 1946లో కాంగ్రెస్ సంస్థ ఒక రాజకీయ పార్టీగా మారింది.

కొద్ది రోజుల్లో స్వాతంత్ర్యం సిద్ధించబోతుంది. స్వాతంత్ర్యం తర్వాత జాతీయ కాంగ్రెస్‌ను రద్దు చేయాలని, ఎవరికి వారు స్వంత పార్టీలు పెట్టుకోవాలన్న మహాత్మాగాంధీ ప్రతిపాదనను కాంగ్రెస్ నాయకులు తిరస్కరించారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ చరిత్రను, ప్రతిష్ఠను వదలుకుని వేరే పార్టీ ఎందుకు! కాంగ్రెస్‌ను తమ సొంతం చేసుకోవాలనుకున్నారు. 1946లో జాతీయ ఉద్యమ వేదికగా ఉన్న కాంగ్రెస్, భారత జాతీయ కాంగ్రెస్ పేరుతో రాజకీయ పార్టీగా మారింది.

## గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్ల ప్రక్రియ ప్రారంభం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలోని 594 గ్రామపంచాయతీలకు రిజర్వేషన్లు ప్రక్రియ కు అనుగుణంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా సీట్లను కేటాయించడం జరిగింది. తాండూర్ డివిజన్‌లో 8మండలాల్లో 262 గ్రామ పంచాయతీలకు కేటాయింపులు చేయగా, వికారాబాద్ డివిజన్‌కు సంబంధించి12మండలాల్లో 332 గ్రామ పంచాయతీలకు లాటరీ ద్వారా సీట్లు కేటాయించడం జరిగింది అని అన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియకు అనుగుణంగా జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ హర్స్ చౌదరి, ఆర్‌డిఒ వాసుచంద్ర, డిపిఒ జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సొంతింటి కలను నిజం చేస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పేద కుటుంబీకుల సొంతింటి కలను నిజం చేసేందుకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తోందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ తెలిపారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసర ప్రాంతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటినుండి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ మాజీ ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ ఇందిరా మహిళా చీరలు

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాక్షం/నవాబ్‌పేట్ :** ఇందిరా మహిళా శక్తి పథకం కింద రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట డ్వాక్రా సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను ఎమ్మెల్యే కాలే యాదయ్య పంపిణీ చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, వెలుగు ప్రార్థనను ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి కింద రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ పోలీస్ రాంరెడ్డి, ఎఎంసి చైర్మన్ రాథోడ్ గీతాసింగ్, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, ఖదీర్, రాజశేఖర్ రెడ్డి, వెంకటేశం గౌడ్, అధికారులు ఎంపిడిఓ అనురాధ, డిప్యూటీ ఎమ్మార్వో వినయ్, మహిళా సంఘం అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, ప్రభాకర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




## క్యాన్సర్ బారిన పడకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** క్యాన్సర్ బారిన పడకుండా క్యాన్సర్ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని డాక్టర్ పోశాల ప్రజ్ఞ, డాక్టర్ కీర్తి అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రధాన చౌరస్తాలో ఆర్‌విఎం లక్ష్మ క్క పల్లి మెడికల్ కళాశాల వంటిమామిడి ఆధ్వర్యంలో దక్ష జూనియర్ కళాశాలలో సర్వైకల్ క్యాన్సర్‌పై విద్యార్థులకు డాక్టర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ భారతదేశంలో సగటున ప్రతి వంద మందిలో 10 మందికి క్యాన్సర్ వ్యాధి సోకి ఇబ్బంది పడుతున్నారన్నారు. క్యాన్సర్ మహమ్మారి సోకకుండా 9 నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలు రెండు డోసులు వ్యాక్సిన్ తీసుకోవాలని దీంతో క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చని చెప్పారు. 15 సంవత్సరాలు పైబడిన వారు కూడా వ్యాక్సిన్ వేసుకోవడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో దక్షా జూనియర్ కళాశాల చైర్మన్ శివశంకర్, డైరక్టర్ మల్లేష్, మార్కెటింగ్ మేనేజర్ మంచినీళ్ల లక్ష్మ ణ్, హేమాశ్రీ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు శేరి సతీష్‌రెడ్డి తెలిపారు. శనివారం బాలాజీ నగర్ డివిజన్‌లోని బాలాజీ ఎన్‌క్లేవ్‌లో డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ పి.శిరీష, బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బాబురావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సుమారు రూ.20లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టినట్టు తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. పనుల కారణంగా స్థానికులకు ఇబ్బంది కలగకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు దశలవారీగా శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వైష్ణవి, వాటర్ వర్క్స్ సిబ్బంది, బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** కాంగ్రెస్ నేత దివంగత నరేష్ జయంతి సందర్భంగా వైవి ఎంఎల్ అమృతధార ట్రస్ట్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ ట్రస్ట్ కొనసాగిస్తున్న వివిధ సేవలు అభినందనీయమన్నారు. సంస్థ వైస్ చైర్మన్ మనోహర్, ఎమ్మార్పీఎస్ జాతీయ నేత తిప్పారపు లక్ష్మ ణ్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు కేశపాగ రాంచందర్, రామకృష్ణ, జ్యోతి కుమార్, కిరణ్, కాంగ్రెస్ మల్కాజిగిరి మీడియా ఇన్‌చార్జి నిరంజన్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రు.



## కాంగ్రెస్, బిజెపి మోసాలపై బిసి సమాజం మేల్కొనాలి

### రాష్ట్రవ్యాప్తంగా నేడు జిఒ నెంబర్ 46 ప్రతుల దగ్ధం
### జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల అంశంపై స్పష్టమైన హామీ రాకముందే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్, బిజెపి పార్టీల మోసాలపై బిసి సమాజం మేల్కొవాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే సర్పంచ్ ఎన్నికలలో బిసి, ఎస్సి, ఎస్టి సామాజిక రిజర్వేషన్ల పరిమితి 50 శాతం మించకూడదని రాష్ట్ర ప్రభుత్వం జివొ నెంబర్ 46 విడుదల చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బిజెపిల మోసం ఫలితంగానే జివొ నెంబర్ 46 విడుదల అయిందని తెలిపారు. జివొ నెంబర్ 44 విడుదలను వ్యతిరేకిస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా జివొ ప్రతులను దగ్ధం చేసి, బిసి సమాజం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ నిరసనను తెలపాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బిసిల జనాభా 60 శాతంగా ఉంటే, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం జివొ నెంబర్ 9 ఇటీవల విడుదల చేసిందని, ఇప్పుడు 9 జివొను రద్దు చేసి 46 జివొ తీసుకొచ్చి బిసిల రాజకీయ అణచివేతకు పాల్పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో రెడ్లను ఎక్కువ మంది సర్పంచులుగా చేసి, సర్పంచ్ నుండి ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా ఉన్న వారి ప్రయోజనాల కోసమే జివొ నెంబర్ 46 ఉపయోగపడుతుందని, ఈ జివొ బిసిలకు రాజకీయ ఉరితాడు లాంటిదని ఆయన మండిపడ్డారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో మద్దతు పలికారని, రాష్ట్ర బంద్‌లో భాగస్వామ్యం అయ్యారని, ఇదే స్ఫూర్తితో జాతీయ పార్టీలు అయిన వీరు పార్లమెంటులో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదింప చేయడానికి ప్రయత్నం చేసి ఉంటే రాజ్యాంగ సవరణ ద్వారా బిసిలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు అమలు జరిగే అవకాశం ఉండేదని, కానీ ప్రయత్నించకుండానే రిజర్వేషన్ల విషయంలో రెండు పార్టీలు కలిసి బిసిలను బలి పశువు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. జివొ నెంబర్ 46 ను తక్షణమే రద్దు చేసి, జివొ నెంబర్ 9ను మాత్రమే అమలు చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

## క్షేత్ర స్థాయిలో భూ సమస్యలు పరిష్కారం

### కలెక్టర్ మనుచౌదరి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** జిల్లాలో తపా లా, రైల్వే శాఖలకు సంబంధించి భూసమస్యలను క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తూ త్వరితగతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో డిప్యూటి కలెక్టర్లు మోక్షిత, బరీరా ఫరీద్, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాష్‌లతో ఆయన జిల్లాలోని తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ తపాల, రైల్వే శాకలకు సంబంధించి భూ సమస్యలు, నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులనను సమన్వయం చేసుకొంటూ పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న తపాల శాఖ, రైల్వే శాఖ ఇంజనీరింగ్ విభాగ అధికారులు భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భూభారతి, సాదా బైనామా,రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ధరఖాస్తులన్నిటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారున. కోర్టు కేసులకు సంబంధించి పిటిషన్లు వేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖకు సబ్‌స్టేషన్ నిర్మించటానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూస్తూ ఏవైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకొని రావాలన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేస్తాం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తిచేసి ఇళ్లులేని ప్రతి నిరుపేదకు ఇళ్లు మంజూరు చేస్తామని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్‌లు అన్నారు. శనివారం తూంకుంట మున్సిపాలిటీ హకింపేటలో ఉల్లి మంజుల శ్రావణ్‌కుమార్‌ల ఇందిరమ్మ నూతన గృహ ప్రవేశానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఇళ్లులేని ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు మేడ్చల్ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే కొన్ని ఇండ్లు నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేశామని మిగిలినవి వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే మూడుచింతలపల్లి మున్సిపాలిటి పొన్నాల్‌లో వీరన్నగారి సుజాత జహంగీర్‌ల ఇందిరమ్మ నూతన గృహ ప్రవేశంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్ రిబ్బన్ కట్‌చేసి గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమం లో హౌసింగ్ డిఇ అశోక్, ఎఇ కమలాకర్, మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## బికెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్ పల్లి డబల్ బెడ్ రూమ్ సమీపంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా నాయకులు కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పేద మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు.



ఫౌండేషన్ ఆధ్వర్యంలో మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ వైద్య బృందంచే శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్ పల్లి డబుల్ బెడ్ రూమ్ సమీపంలో ఉచిత వైద్య శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ శిబిరంలో అనేకమంది పేద మధ్యతరగతి ప్రజలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలందించే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నట్లు తెలిపారు. నేటి సమాజానికి మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ లాంటి సంస్థలు ఎంతో ఉపయోగకరమని సూచించారు. వైద్య శిబిరాల్లో ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం వల్ల సకాలంలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందని, తద్వారా సకాలంలో చికిత్స పొందవచ్చని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యక్తం చేశారు. అదే విధంగా నియోజకవర్గ ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేటట్లు తన వంతు కృషి చేస్తున్నానని తెలియజేశారు.

అనంతరం ఉచిత వైద్య సేవలు అందించిన మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ వైద్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ సర్పంచ్ బండ నరసింహ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏ ఆర్ సాదు యాద వ్, దుండిగల్ మాజీ సర్పంచ్ కావాలి గణేష్ వేణు, దుద్దు నర్సింగ్ రావు, కాలనీ వాసులు గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ డిసిసి అధ్యక్షుడిగా ధారాసింగ్

**ప్రజాపక్షం/తాండూరు:** వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పెద్దేముల్ మండలానికి చెందిన మాజీ జడ్‌పిటిసి ధారాసింగ్ జాదవ్‌ను నియమించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి (టిపిసిసి)పరిధిలోని జిల్లా కాంగ్రెస్ కమిటీలకు(డిసిసి) నూతన అధ్యక్షులను నియమిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ జాబితాను విడుదల చేశారు. మండల కేంద్రమైన పెద్దేముల్ తాండకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీటిసి, టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ధారాసింగ్ జాదవ్‌ను వికారాబాద్ జిల్లా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ అధిష్టానం జాబితాను ప్రకటించింది. పెద్దేముల్ మండలానికి రెండు పర్యాయాలు ఎంపిపిగా, రెండు పర్యాలు జడ్పీటిసిగా పని చేసిన ధారాసింగ్ జాదవ్ కాంగ్రెస్ పార్టీకి నిక్కచ్చి కార్యకర్తగా సేవలు అందజేశారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యకులుగా నియామించడం పట్ల పార్టీటి అధిష్టానంకు ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అదినేతలు సోనియాగాంధి, రాహుల్ గాంది, మాల్లికార్జున కార్గే, ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ఇంచార్జీ నటరాజన్‌కు, స్థానిక ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డిలకు, రాష్ట్ర ఫైనాన్స్ మెంబర్ రమేష్ మహారాజ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఎంతో నమ్మకంతో కట్టబెట్టిన జిల్లా పార్టీ అధ్యక్ష పదవి సంతోషదాయకమని, అందరి సహకారంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ భలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

### నూతన బాధ్యతలు స్వీకరించిన స్నేహమెహ్రా



**ప్రజాపక్షం/వికారాబాద్ :** శాంతి భద్రతలే తొలి ప్రాధాన్యం, మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటం అని జిల్లా నూతన ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన స్నేహమెహ్రా, హైదరాబాద్ సౌత్‌జోన్ డిసిపిగా సమర్థవంతగా విధులు నిర్వహించారు. స్నేహమెహ్రా వికారాబాద్ జిల్లా ఎస్‌పిగా పోలీస్ కార్యాలయం లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిస్థితులను గత చరిత్రను క్షుణంగా పరిశీలిస్తామని, అందుకు అనుగుణంగానే పోలీస్‌విధానాలలో అవసరమైన మార్పులు తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. నేర నియంత్రణ తన మొదటి లక్ష్యం అని జిల్లాలో నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్థానిక సమస్యలను తెలుసుకొని, వాటి నవారణకు చర్యలు తీసుకుంటామని తద్వారా ప్రజలు మరింత ప్రశాంతంగా, భద్రతగా ఉండే వాతావరణాన్ని కల్పిస్తామని, దొంగతనాలు, మత్తుపదార్థాలు, సైబర్ నేరాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మహిళలకు, పిల్లల భద్రతకు, రక్షణకు, సిబ్బంది సంక్షేమానికి కూడా తగిన చర్యలు తీసుకుంటాం అని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రాములు నాయక్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తా:ఎమ్మెల్యే మర్రి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొని వస్తే వాటి పరిష్కారానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తాన ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఆయన విద్యుత్ శాఖ ఏడిఈ శ్రీనివాస్, ఎఇ.లత, జిహెచ్ఎంసి అధికారులు డిఇ లౌక్య, ఎఇ. నవీన్, జలమండలి మేనేజర్ నవీన్‌లతో కల్సి వినాయక్ నగర్ డివిజన్‌లోని రేణుకానగర్, నాగలక్ష్మి ఫంక్షన్ హాలు లైన్, శివసాయినగర్, జెకె కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. అసంపూర్తిగా ఉన్న సిసి రోడ్లు పూర్తి చేయాలని, వీధి స్థంభాల మరమ్మత్తులు చేపట్టాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు.



## ముఖ్యమంత్రి పర్యటనపై ఏర్పాట్లను పరశీలించిన ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్:** కొండగల్ నియోజకవర్గంలోని ఎన్కేపల్లి గ్రామ శివారునందు అక్షయ పాత్ర శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి వస్తున్న సందర్భంగా విస్తృత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా, రెండు అంబులెన్స్‌లు, వైద్యసౌకర్యాలు అన్నింటినీ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. శానిటేషన్, బారికేడ్స్, మొబైల్ టైయిలెట్స్, త్రాగునీరు. స్టేజీ ఏర్పాట్లు, విఐపి పార్కింగ్ పూర్తి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం హెలిఫ్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనింగ్ కలెక్టర్ హర్స్ చౌదరి, గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, కడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకదేవి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహసాల్దార్ రాంబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ప్రజాపక్షం/ఉప్పల్ :** పార్టీలకు అతీతంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఉప్పల్ సర్కిల్ రామంతపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావుతో కలిసి గురువారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంతో కృషి చేస్తూ మల్కాజిగిరి నియోజకవర్గానికి అదనపు నిధులకోసం కృషి చేస్తున్నామని, నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం సంతోష్ కుమార్, జిహెచ్ఎంసి డిఇ నాగమణి, మున్సిపల్ అధికారులు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా తోటకూర వజ్రేష్ యాదవ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా తోటకూర వజ్రేష్ యాదవ్ అలియాస్ జంగయ్య యాదవ్ (58) నియమితులయ్యారు. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేసారు. బిసి వర్గానికి చెందిన ఆయన ప్రస్తుతం మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. బోడుప్పల్ ప్రాంతానికి చెందిన రైతు కుటుంబీకుడయిన ఆయన తెలుగుదేశం పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించి కొద్ది ఏళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరాడు. పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా వ్యవహరిస్తూ తనదైన శైలిలో పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనే ఆయన పిసిసి దృష్టిలో జిల్లా స్థాయి నాయకుడిగా ఎదిగాడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజితుడయ్యాడు.



## వైష్ణవి టెక్నో పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** జగద్గిరిగుట్టలోని వైష్ణవి టెక్నొ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్, మల్లారెడ్డి ఆసుపత్రిలు సంయుక్తంగా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు లయన్ బిర్రు ఆంజనేయులు, జోనల్ సభ్యులు లయన్ పాషాలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనరల్, గుండె, కంటి, దంత తదితర విభాగాలలో వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు కూడా పంపిణీ చేశారు.



## పవర్ బోర్లు ప్రారంభించిన కార్పొరేటర్ సునీత

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఇకపై ఎలాంటి నీటి సమస్య లేకుండా ఉండే విధంగా ఎంపి నిధులతో పవర్ బోర్లు స్థానికులకు ఉపయోగకరంగా ఉంటాయని మౌలాలి కార్పొరేట ర్ సునీత శేఖర్‌యాదవ్ అన్నారు. శనివారం ఓల్డ్ సఫిల్ గూడ భజనమండలి ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్ బోర్లను ఆమె ప్రారంభించారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులను పూర్తిచేసానని, మరే ఇతర సమస్యలున్నా తన దృష్టికి తీసుకొని రావాలన్నా రు. ఈ కార్యక్రమంలో కిరణ్, వెంకటేష్, అరుణ్, విమల, కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన పెద్దేముల్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ, అనంతరం కోట్‌పల్లి మండలానికి చెందిన 11మంది లబ్ధిదారులకు రూ.11లక్షల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి సిఎం రేవంత్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోట్ పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు,మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎంపిడిఒ రతన్,అధికారులు తదితరులు పాల్గోన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

**ప్రజాపక్షం/యాచారం :** కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని డివైఎఫ్ఐ యాచారం మండల కన్వీనర్ చందునాయక్ విమర్శించారు. శనివారం మండల పరిధిలోని మాల్ గ్రామంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్మికుల చట్టాలను ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్ అమలును తక్షణమే ఉపసంహారించుకోవాలని కోరారు. కార్పోరేటు, సంస్థలకు, పెట్టుబడిదారులకు ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయన్నారు. కార్మికులను బానిసలుగా మార్చడానికి కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బట్టు సత్యనారాయణ, కాగు నర్సింహ్మా, సుజాత, అబ్బయ్య, గున్‌గంటి జంగయ్య, రెడ్డమోని నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/కేశంపేట:** పేదింటి ఆడబిడ్డ వివాహానికి కాంగ్రెస్ నేతలు ఆర్థిక సహాయం చేశారు. శనివారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన బిసా కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన దివంగత పోలమోని శేఖర్, చెన్నమ్మ దంపతుల కుమార్తె అఖిత వివాహం సందర్భంగా గ్రామ కాంగ్రెస్ నాయకులు పదివేలు ఆర్థిక సహాయం చేయడంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో గుత్తి చంద్రశేఖర్, గుత్తి చంద్రయ్య, చిట్టిరెడ్డి, రాంరెడ్డి, కల్వకోల్ నిరంజన్, శంభుల శేఖర్, ఆలూరు నర్సింహారెడ్డి, కందన శివయ్య, లాలమోని పాండు, లక్ష్మయ్య, పోలమోని అంజయ్య, సత్తయ్య, చెన్నయ్య, భాషమోని సాయన్న, రోయ్యల శ్రీరాములు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారంతో ఆరోగ్యం

### డిప్యూటి డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శిశువులకు ఆరోగ్యకరమైన పౌష్టిక ఆహారం అందించాలని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో సూపరిండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవజాత శిశువుల సంరక్షణ గురించి ప్రతి తల్లి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సవిల్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, డాక్టర్ సెమినా నస్రిన్, డాక్టర్ ఆంజనేయులు పాల్గొన్నా

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : కోదండరామ్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమ కారులను అదుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి కోరారు. శనివారం హైద్రాబాద్‌లో ప్రొఫెసర్ కోదంరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. ఇందుకు స్పందించిన కోదండరామ్ మాట్లాడుతూ ఉద్యమ కారుల సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, విద్యావంతుల వేదిక రాష్ట్ర కోశాధికారి టిజి శ్రీనివాస్, కళ్లెం నరసింహారెడ్డి, ఆంజనేయులు, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/కేశంపేట:** మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్, ఎస్‌డిఎఫ్ నిధులతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సే ల్ అధ్యక్షుడు కోడూరు రాములు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పిఆర్ఎఇ నర్సింగ్‌రావు, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోడూరు శ్రీశైలం, పర్వతాలు, సింగిడి మల్లారెడ్డి, గోపని భీమయ్య, కోడూరు నర్సింహులు, అస్మాభేగం, శివకుమార్, కోరే నారాయణ, మల్లేష్, సొంటే మల్లేష్, శివశంకర్, పంది లింగం, బైపాల్‌రెడ్డి, ఎల్లయ్య, నాగయ్య పాల్గొన్నారు.

## రేవతి హైస్కూల్లో పుష్పాల దినోత్సవం




**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** శంకర్ పల్లి పట్టణములోని రేవతి హైస్కూల్లో శనివారం పుష్పాల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రంగురంగుల వేషాధారణలతో నృత్య ప్రదర్శనలు చేశారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రకరకాల పూలు తీసుకువచ్చారు. వాటి ప్రాముఖ్యతను పిల్లలకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ పావని, పాఠశాల ప్రిన్సిపల్ విజయ్ శేఖర్, ఇంచార్జ్ అరుణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి సహకరిస్తా : కొప్పుల



**ప్రజాపక్షం/హయత్ నగర్:** మన్సూరాబాద్ డివిజన్ అభివృద్ధికి సహకరిస్తానని కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు. హయత్‌నగర్ ప్రాంతంలోని పవనగిరి ఫేస్3లో పూర్తి చేసిన సిసి రోడ్డును శనివారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి కాలనీ మహిళా బృందంతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు హరి ప్రసాద్, మాధవ్‌రెడ్డి, సాయిలు, సిఐ సైదిరెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, హరి నాథ్, లక్ష్మారెడ్డి, కాలనీవాసులు బిసి నరసింహుడు, వెంకటేశ్వర రావు, సంపత్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, డి.వెంకటేష్, సికిందర్ రెడ్డి, జలేందర్, వెంగల్ రెడ్డి, హరినాధ రెడ్డి, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలు సద్వినియోగం



**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్ అన్నారు. శనివారం పట్టణంలోని లిటిల్ స్టార్స్ హైస్కూల్లో సంగారెడ్డి ఎంఎన్ఆర్ డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రణీత్ కుమార్, ప్రశాంత్, మహమ్మద్ హుస్సేన్, రఘు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భయం, అత్యాశే సైబర్ నేరగాళ్ల పెట్టుబడి

### సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల భయం, అత్యాశే సైబర్ నేరగాళ్లకు పెట్టుబడిగా మారుతోందని హైదరాబాద్ కమిషనర్ విసి సజ్జనార్ అన్నారు. సైబర్ నేరాల విషయంలో ప్రతిఒక్కరికి అప్రమత్తత అవసరమని ఆయన సూచించారు. హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద శనివారం నిర్వహించిన 'జాగృత్ హైదరాబాద్– సురక్షిత్ హైదరాబాద్' సైబర్ నేరాల అవగాహన కార్యక్రమానికి నగర సిపి సజ్జనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోలీస్‌అధికారులతో కలిసి చార్మినార్ పరిసరాల్లో సైబర్ క్రైం నివారణ కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం చార్మినార్ నుంచి మదీనా వరకు తలపెట్టిన సైబర్ క్రైం అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో సైబర్ ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన కార్యక్రమంలో సిపి సజ్జనార్ మాట్లాడుతూ హైదరాబాద్‌ను సైబర్ నేరరహితంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రతి మంగళ, శనివారాల్లో 'జాగృత్ హైదరాబాద్ సురక్షిత్ హైదరాబాద్' సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారంలో ఈ రెండు రోజులు ప్రతి ఇంటికి పోలీస్ అధికారులు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారని ఆయన వివరించారు. అవగాహన లేమితోనే అనేక మంది సైబర్ నేరాల బాధితులవుతున్నారని అన్నారు. ఏ రకమైన సైబర్ మోసం అయినా, వాటికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజలకు స్వీయ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సైబర్ నేరాల నివారణకు ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని, స్వచ్ఛందంగా వలంటీర్లుగా ముందుకు వచ్చే వారు సైబర్ సింబాలుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఒక సైబర్ సింబా తయారై తన కుటుంబాన్ని, సమాజాన్ని సైబర్ మోసాల నుంచి రక్షించాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ ఫోటోలు, వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో అప్లోడ చేయవద్దని, అలా చేస్తే ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలు సోషల్ మీడియాకు అడిక్ట్ అవుతున్నారని, ముఖ్యంగా ఆడపిల్లలు అజ్ఞాత వ్యక్తులతో చాటింగ్ చేసి వ్యక్తిగత వివరాలు సమర్పించుకొని బాధితులు అవుతున్నారని చెప్పారు. ఆడ పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, వారికి ఫోన్లు ఇచ్చే ముందు జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుంటున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాల పట్ల వారి పిల్లలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా హెల్ప్ లైన్ నంబర్ 1930 కి చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. అలాగే, జాతీయ సైబర్ పోర్టల్ www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల్లో గోల్డెన్ అవర్ చాలా కీలకమని, మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్టవచ్చని స్పష్టం చేశారు. అనుమానాస్పద కాల్స్, లింక్స్, యాప్‌లను నమ్మవద్దని, ఓటీపీలు, పాస్వర్డ్లు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. కార్యక్రమంలో క్రైమ్స్ అదనపు సిపి ఎం.శ్రీనివాస్, సౌత్ జోన్ అడిషినల్ డిసిపి.ఎం.మాజిద్, సౌత్ జోన్ ఎసిపిలు పి.చంద్రశేఖర్, సిహెచ్.చంద్రశేఖర్, జి.శ్యామ్ సుందర్, ఎంఎ జావీద్, తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన మహేష్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ల నామినేషన్‌ల ప్రక్రియ

### 48 మంది 66 సెట్ల నామినేషన్‌ల దాఖలు

### కలెక్టర్ హరిచందన దాసరి వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్‌ల ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ముగిసింది. 48 మంది నుండి 66 నామినేషన్లు స్వీకరించినట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నామినేషన్లు స్వీకరించామని, శనివారం 12 మంది అభ్యర్థులు 14 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆమె చెప్పారు. శనివారంతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసిందన్నారు. నామినేషన్లు చివరి రోజు వరకు మొత్తం 48 మంది అభ్యర్థులు 66 సెట్లు నామినేషన్లు వచ్చాయన్నారు. ఈ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో డిఆర్ఓ ఈ. వెంకటాచారి, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ (ఎస్ఈఎం) జ్యోతి, లా ఆఫీసర్ శ్రీధర్, డిసిఓ ప్రసన్న, మహేష్ బ్యాంక్ అధికారి అరవింద్, జిల్లా కోఆపరేటివ్ అధికారులు సుమలత, ఎం.డి. అజార్ యాఖూబ్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## పరిష్కారమైన సున్నంచెరువు సమస్య

### ఆ ప్రాంత నివాసితులతో హైడ్రా కమిషనర్ సమావేశం

### ఆంజనేయ గుడి, చిల్లా తరలింపునకు అంగీకారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాధాపూర్, బోరబండ సరిహద్దుల్లోని సున్నం చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోకి వస్తున్న ఆంజనేయగుడితో పాటు ముస్లింల ప్రార్థనా స్థలం చిల్లా తరలింపునకు అంగీకారం కుదిరింది. సున్నం చెరువు పరిసర ప్రాంత ప్రజలతో శనివారం హైడ్రా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరుపక్షాలకు చెందిన వారు ఇందుకు సమ్మతి వ్యక్తంచేశారు. హైడ్రా మొదటివిడతలో పునరుద్ధరిస్తున్న ఆరు చెరువుల్లో సున్నం చెరువు కూడా ఉంది. అయితే ఈ చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో చిన్న ఆంజనేయగుడితో పాటు ఆ సమీపంలోనే ముస్లింల చిల్లా కూడా ఉంది. ఇవి ఎఫ్‌టిఎల్ పరిధిలోకి వస్తున్నందున వీటిని చెరువు గట్టువైపు తరలించాలని హైడ్రా భావించింది. వీటి తరలింపునకు సంబంధించిన అంశం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశం అయ్యింది. ఈ నేపథ్యంలో ఇరుపక్షాలకు చెందిన స్థానికులతో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ శనివారం హైడ్రా కార్యాలయంలో చర్చించారు. సుప్రింకోర్టు మార్గదర్శకాలనువివరించారు. ఆంజనేయ విగ్రహంతో పాటు, చిల్లాను చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో కాకుండా, చెరువు గట్టు వైపు తరలించే విషయమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇరు పక్షాలకు చెందిన స్థానికులు అంగీకారం చెప్పడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. సున్నం చెరువు చెంత, వాటిని సురక్షితంగా తరలించడానికి స్థానికులు అంగీకారం వ్యక్తం చేశారు.

## పొరపాట్లు జరగకుండా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** డిసెంబర్ 8, 9 తేదీలలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌కు ఎక్కడ, ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కందుకూర్ మండలం వైల్కుంట తాండలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతాన్ని , హెలిప్యాడ్ పనులను ఆయన పరిశీలించారు. గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో ఎక్కడ, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. తమకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కందుకూర్ ఆర్‌డిఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎసిపి కె.వి.రాజు, తహసీల్దార్ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

## అజ్ఞాత వ్యక్తుల మేసేజ్‌లకు స్పందించొద్దు

### వినియోగదారులకు జలమండలి విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గుర్తు తెలియని మొబైల్ నెంబర్లనుంచి జలమండలి నల్లా బిల్లు చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని, తప్పుడు సమాచారాన్ని వినియోగదారులకు ఎస్ఎంఎస్ ద్వారా చేరవేస్తున్నారని అలాంటి మెసేజ్‌లకు స్పందించకూడదని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది. వివిధ మొబైల్ నెంబర్ల నుంచి గతనెల బిల్లు చెల్లించకపోతే మీ నల్లా కనెక్షన్‌లు తొలగిస్తామని మెసేజ్ పంపిస్తున్నారని జలమండలి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ ప్రజలు ఇటువంటి సందేశాలకు స్పందించకుండా, పై నెంబర్‌లను సంప్రదించకుండా, వాట్సాప్‌కు వచ్చిన ఎపికె ఫైల్‌లను డౌన్‌లోడ్ చేయకుండా, ఇన్‌స్టాల్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని జలమండలి వినియోగదారులకు విజ్ఞప్తి చేస్తోంది. ఏవైనా సమస్యలు లేదా సేవా సంబంధిత సందేహాలు ఉంటే జలమండలి కస్టమర్ కేర్ 155313కి సంప్రదించాలని వినియోగదారులకు జలమండలి సూచించింది.

## వందేమాతరం గీతానికి ప్రత్యేకత

**ప్రజాపక్షం/యాచారం :** వందేమాతర గీతం రాసి 150 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం హర్షించదగ్గ విషయమని బిజెపి కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపల్లి అంజయ్య యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల బిజెపి అధ్యక్షులు జరుపుల విజయ్‌నాయక్ ఆధ్వర్యంలో వందేమాతం గీతాన్ని విద్యార్థులతో కలిసి అలపించారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం, జగదీష్‌యాదవ్, విజయ్‌కుమార్, ఈశ్వర్, పాండురంగారెడ్డి, తాండ్ర రవీంధర్, శ్రీశైలం, నరేశ్, జంగయ్య, కృష్ణ,రాజు, సురేశ్, నాగరాజు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు

### పుస్తకాల నర్సింగ్‌రావు డిమాండ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సిపిఐ సీనియర్ నాయకుడు పుస్తకాల నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం రాజేంద్రనగర్ సిపిఐ ఆఫీసులో బికెఎంయు జిల్లా కార్యవర్గ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు జె.అంజయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పుస్తకాల నర్సింగ్‌రావు, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్యారంటీలు అమలు చేయాలని సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని బలమైన సంఘంగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సిపిఐ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగే బహిరంగ సభ సంఘం తరపున పెద్ద ఎత్తున కార్యకర్తలను ప్రజలను సమీకరించాలని కోరారు. కార్యక్రమంలో బికెఎంయు జిల్లా ఉపాధ్యక్షులు జిల్లెల్ల వెంకటేష్, స్వరూప, జిల్లా కార్యవర్గ సభ్యులు గవినికాడి జంగయ్య, వీరేష్, రాములు, వెంకటేష్, సత్యం, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి సహకారం





### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్/కొందుర్గు:** దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని అయోధ్యపూర్ తండాలో ఆంజనేయ స్వామి దేవాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ.25వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జటావత్ మంగులాల్‌నాయక్, రవినాయక్, లిబియా నాయక్, గోబ్రునాయక్, తావునాయక్, శశినాయక్, సునీల్, శ్రీకాంత్, సురేష్, అరుణ్, శంకర్, రెడ్యా, అనిల్, సత్తినాయక్, అయోద్యాపూర్ తండా వాసులు పాల్గొన్నారు.

**కార్యకర్తలు స్వేచ్ఛ ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్...** కార్యకర్తలకు పూర్తిస్వేచ్ఛ ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుట్ట రాజు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అంబటి రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, అంబటి రాజు దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విజయ్, కుమార్, రాజు, శ్రీశైలం, దయాసాగర్, నారం రెడ్డి, పటాన్‌పాషా, శ్యాంసుందర్, మల్లేష్, సురేందర్, భరత్, లడ్డు, అరుణ్‌లు పాల్గొన్నారు.

## ప్రజల ఆస్తులపై దాడులు అన్యాయం

**ప్రజాపక్షం/హయత్ నగర్:** ఎల్‌బి నగర్‌లో ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి అనుచరుడికి ఒక న్యాయం, సామాన్యుడికి మరో న్యాయం చేయడం ఏమిటని బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మన్సూరాబాద్, శ్రీరామ్ నగర్ కాలనీ రాఘవేంద్ర హోటల్ ఎదురుగా ఉన్న మడిగలను, ఎలాంటి నోటీసు లేకుండా, కేవలం రాజకీయ కక్ష్యసాధింపులో భాగంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే అధికార దుర్వినియోగంతో సీజ్ చేయించడంపై బిజెపి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బిజెపి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి , కార్పొరేటర్లు వంగ మధుసూదన్ రెడ్డి , బద్దం ప్రేమహేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆస్తులపై అడ్డగోలుగా దాడులు చేస్తే, బిజెపి నిరసనలకు దిగడానికి వెనుకాడదన్నారు. సీజ్ ఆర్డర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు,మునుగల హరీష్‌రెడ్డి, నాంపల్లి శంకరయ్య, పోట్లపల్లి సాయిరామ్‌గౌడ్, దామోదర్‌గౌడ్, యంజాల్ జగన్, మహిళా నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# క్రీడ

## నేడు భారత జట్టు ఎంపిక..

### కెప్టెన్‌గా పంత్ లేదా కేఎల్ రాహుల్!



భారత్, సౌతాఫ్రికా మధ్య ప్రస్తుతం జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్ నవంబర్ 26న ముగుస్తుంది. తర్వాత రెండు జట్ల మధ్య పరిమిత ఓవర్ల సిరీస్‌లు జరగనున్నాయి. నవంబర్ 30 నుంచి మూడు వన్డేల సిరీస్, డిసెంబర్ 9 నుంచి ఐదు టీ20ల సిరీస్ ప్రారంభంకానున్నాయి. ఈ మ్యాచ్‌ల కోసం భారత సెలక్టర్లు నేడు జట్లను ప్రకటించే అవకాశముంది. సఫారీలతో తొలి టెస్టులో మెడ నొప్పి కారణంగా మైదానాన్ని వీడిన శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతి ఇవ్వనున్నారు. టీ20 సిరీస్‌కల్లా అతను పూర్తిగా కోలుకుంటాడని సెలక్టర్లు ఆశిస్తున్నారు. అందుబాటులో ఉండే ఛాన్స్ ఉంది. శుభ్‌మన్ స్థానంలో రిషభ్ పంత్ లేదా కేఎల్ రాహుల్‌ను తాత్కాలిక వన్డే కెప్టెన్‌గా నియమిస్తారని బిసిసిఐ వర్గాలు తెలిపాయి. గత నెలలో ఆస్ట్రేలియాతో జరిగిన సిడ్నీ టెస్టులో గాయపడిన శ్రేయస్ అయ్యర్ మార్చి వరకు ఆటకు దూరంగా ఉండే ఛాన్స్ ఉందని సమాచారం.

**వన్డే సిరీస్ షెడ్యూల్**

తొలి వన్డే – నవంబర్ 30 (రాంచీ)
రెండో వన్డే – డిసెంబర్ 3 (రాయ్‌పూర్)
మూడో వన్డే – డిసెంబర్ 6 (విశాఖపట్నం)

**టీ20 సిరీస్ షెడ్యూల్...**

తొలి టీ20 – డిసెంబర్ 9 (కటక్)
రెండో టీ20 – డిసెంబర్ 11 (ముల్లాన్‌పూర్)
మూడో టీ20 – డిసెంబర్ 14 (ధర్మశాల)
నాలుగో టీ20 – డిసెంబర్ 17 (లఖ్‌నవూ)
ఐదో టీ20 – డిసెంబర్ 19 (అహ్మదాబాద్)

## 'శత'క్కొట్టిన హెడ్

### రెండ్రోజుల్లోనే ముగిసిన యాషెస్ తొలి టెస్టు

### 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా విజయం

ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టు రెండు రోజుల్లోనే ముగియగా.. ఇంగ్లిష్ జట్టును ఆస్ట్రేలియా చిత్తు చేసింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 205 పరుగుల



లక్ష్యాన్ని కంగారూలు 28.2 ఓవర్లలోనే రెండే వికెట్లు కోల్పోయి ఛేదించారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (123; 83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) టీ20 మ్యాచ్‌లా చెలరేగి ఆడి ఆసీస్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు. మార్నస్ లబుషేన్ (51*; 49 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో మెరిశాడు. జేక్ వెదరాల్ (23) పరుగులు చేశాడు. ఆరంభం నుంచే ఇంగ్లాండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన హెడ్.. ఎడాపెడా బౌండరీలు బాదేశాడు. అతను 36 బంతుల్లో అర్ధ శతకం, 69 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. బెన్ స్టోక్స్ వేసిన 17 ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో కలిపి మొత్తం నాలుగు బౌండరీలు రాబట్టాడు. అనంతరం ఆర్చర్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్ బాదాడు. అట్కిన్సన్ వేసిన 20 ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టి 90ల్లోకి వచ్చేసి కాసేపటికే శతకం పూర్తి చేసుకున్నాడు. హెడ్ లబుషేన్ రెండో వికెట్‌కు 92 బంతుల్లో 117 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్‌లో తొలి రోజే 19 వికెట్లు కూలాయి. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 172 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 123/9తో రెండో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ 132 పరుగులకు ఆలౌటైంది. 40 పరుగుల ఆధిక్యం సంపాదించిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 164 పరుగులు చేసింది. గస్ అట్కిన్సన్ (37) టాప్ స్కోరర్. బెన్ డకెట్ (28), ఓలీ పోప్ (33)), బ్రైడన్ కార్స్ (20), జేమీ స్మిత్ (15) పరుగులు చేశారు. ఆసీస్ పేసర్లు బోలాండ్ (4/33), మిచెల్ స్టార్క్ (3/55), డాగెట్ (3/51) సత్తాచాటారు.

## ఒక గ్రూప్‌లో ఐదు జట్లు..

**వచ్చే ఏడాది భారత్, శ్రీలంక పురుషుల పొట్టి ప్రపంచ కప్ టోర్నీ నిర్వహిస్తున్నాయి. ఫిబ్రవరి 7న విశ్వ క్రీడా సమరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి ఇప్పటికే ఇరుదేశాల్లో కలిపి8 నగరాలను ఎంపిక చేసింది. తాజాగా టోర్నీలో ఆడనున్న 20 జట్లను నాలుగు గ్రూప్‌లుగా చేసింది ఐసిసి. ఆతిథ్య జట్లైన టీమిండియా, శ్రీలంక గ్రూప్ దశలో కఠిన ప్రత్యర్థులతో తలపడనున్నాయి. ఈసారి కూడా దాయాదులైన భారత్, పాక్ ఒకే గ్రూప్‌లో ఉండడంతో మరో ఉత్కంఠ పోరుకోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.**

పొట్టి వరల్డ్ కప్ నిర్వహణ పనుల్లో వేగం పెంచింది ఐసిసి. టోర్నీకి సమయం దగ్గరపడుతున్నందున వేదికలను ఖరారు చేసిన ఐసిసి శనివారం 20 జట్లను గ్రూప్‌లుగా విభజించింది. ఒక్కదాంట్లో ఐదు చొప్పున నాలుగు గ్రూప్‌లను చేసింది. ఆతిథ్య దేశమైన టీమిండియా గ్రూప్‌లో పాకిస్థాన్ మాత్రమే పెద్ద జట్టు. కానీ, శ్రీలంక గ్రూప్‌లో ఆస్ట్రేలియా ఉండడంతో ఆ జట్టుకు కఠిన సవాల్ ఎదురవ్వనుంది. ఇక గ్రూప్ 3లో ఇంగ్లాండ్, వెస్టిండీస్.. గ్రూప్ 4లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ వంటి టెస్టు క్రికెట్ ఆడే జట్లు ఉన్నాయి.

**గ్రూప్ –1 :** భారత్, పాకిస్థాన్, నెదర్లాండ్స్, నమీబియా, యూఎస్‌ఏ.
**గ్రూప్ –2 :** శ్రీలంక, ఆస్ట్రేలియా, జింబాబ్వే, ఐర్లాండ్ ఒమన్.
**గ్రూప్ –3 :** ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, నేపాల్, ఇటలీ.
**గ్రూప్ –4 :** దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్, యూఏఈ, కెనడా.

భారత్, న్యూజిలాండ్ మధ్య నాగ్‌పూర్‌లో జనవరి 21న తొలి టీ20 జరగనుంది. రాయ్‌పూర్‌లో 23న రెండో మ్యాచ్, గౌహతి జనవరి 25న మూడో టీ20, వైజాగ్‌లో జనవరి 28న నాలుగో మ్యాచ్, చివరిదైన ఐదో టీ20 జనవరి 31న త్రివేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్ ముగియగానే సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో స్క్వాడ్‌ను ప్రకటించనున్నారు సెలెక్టర్లు. ఆతిథ్య దేశాలైన భారత్‌లో ఐదు, లంకలోని రెండు నగరాలను ఎంపిక చేసింది ఐసిసి. అహ్మదాబాద్, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, ముంబై.. శ్రీలంకలో కొలంబో, క్యాండీ సిటీల్లో ప్రపంచ కప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అహ్మదాబాద్‌లోనే మార్చి 8న ఫైనల్ జరుగనుంది. సెమీఫైనల్స్ కోసం ఒకటి కోల్‌కతా, అహ్మదాబాద్ నగరాలను ఆడించాలని షార్ట్ లిస్ట్ చేశామని ఐసిసి తెలిపింది. అయితే.. ముంబైలోని వాంఖడే స్టేడియం పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. పాకిస్థాన్ జట్టు మ్యాచ్‌లన్నీ శ్రీలంకలో ఆడించడంపై పాక్ బోర్డు, బిసిసిఐ మధ్య అంగీకారం కుదిరింది. ఒకవేళ పాక్ టీమ్ ఫైనల్ చేరితే అహ్మదాబాద్‌లో కాకుండా మ్యాచ్ నిర్వహించడం ఖాయం. అక్టోబర్ 17న ప్రకటించనట్టే ఈసారి కూడా 20 జట్లతో టోర్నీని నిర్వహించనున్నారు. టోర్నీకి అర్హత సాధించిన జట్లను ఏ గ్రూప్‌లో ఉంచాలి? ఏ మ్యాచ్‌లు ఎక్కడ ఆడించాలి? అనే వివరాల్ని కూడా త్వరలోనే ఐసీసీ ప్రకటించనుంది.

# ఫోకస్ బిజినెస్






## పతనంతో ముగిసిన షేర్ మార్కెట్లు

ఈ వారం షేర్ మార్కెట్లు కొంత వరకూ మెరుగైన ఫలితాలను చూపినప్పటికీ, లావాదేవీలకు చివరి రోజైన శుక్రవారం (నవంబర్ 21) పతనంతో ముగిశాయి. తేజస్ యుద్ధ విమానం దుబాయ్ ఎయిర్ షో ప్రదర్శనలో కుప్పకూలిన ఘటన భారత షేర్ మార్కెట్లపై ప్రభావం చూపింది. ఈ విమానాన్ని తయారు చేసిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్) స్టాక్స్ దాదాపు మూడు శాతం నష్టాన్ని చవిచూశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో 84,562.78 పాయింట్లతో మొదలైన సెన్సెక్స్ 819.24 పాయింట్లు మెరుగుపడి, 85,382.02 పాయింట్ల వద్ద ముగిసింది. అదే విధంగా జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ 25,910.05 పాయింట్లతో మొదలై, 199.4 పాయింట్ల పెరుగుదలతో, 26,109.45 పాయింట్లకు చేరింది. కాగా, ఈనెల 24వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమయ్యే తాజా లావాదేవీలు ఒడిదుడుకుల మధ్య కొనసాగే అవకాశాలు ఉన్నట్టు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రత్యేకించి తేజస్ విమాన తయారీదారు హెచ్‌ఎఎల్ ప్రభావం మార్కెట్లపై ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2024 మార్చి నెలలో రాజస్థాన్‌లో తేజస్ యుద్ధ విమానం కూలిపోగా, దుబాయ్ సంఘటన రెండోది. మొదటి ఘటన తర్వాత కూడా హెచ్‌ఎఎల్ షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. అదే పరిస్థితి ఇప్పుడు కూడా ఉండవచ్చని అంటున్నారు. సంఘటన జరిగిన శుక్రవారం నాటి సెన్సెక్స్ 251 పాయింట్లు కోల్పోవడాన్ని ఉదాహరణగా పేర్కొంటున్నారు. మొత్తం మీద స్టాక్ మార్కెట్‌లో వచ్చేవారం హెచ్‌ఎఎల్ చుట్టూ లావాదేవీలు కేంద్రీకృతమయ్యే అవకాశాలు ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### అంతర్జాతీయంగా..

ఈ వారం గ్లోబల్ మార్కెట్లు అస్థిరంగా కొనసాగాయి. యుఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గించే అంశంపై నెలకొన్న ఊహాగానాలను స్టాక్ మార్కెట్‌పై ప్రభావాన్ని చూపాయి. కృత్రిమ మేధస్సు (ఎఐ) స్టాక్స్ మీద ఒత్తిడి పెరిగింది. ఈ పరిస్థితి ఎక్కువగా అమెరికాలో కనిపించింది. సుమారు 1.49 శాతం నష్టాన్ని ఐటి మార్కెట్లు ఎదుర్కొన్నాయి. యూరోప్ మార్కెట్లు ఈవారం ఆరంభంలో కొంత పెరుగుదలను నమోదు చేసినప్పటికీ, ఆ తర్వాత అస్థిరత కొనసాగింది. యూరో స్టాక్స్ ఒక రోజు పెరిగితే, మరోరోజు తగ్గడాన్ని గమనించవచ్చు. ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై స్పష్టత రాని కారణంగా బ్యాంక్, ఫైనాన్షియల్ సెక్టర్ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఈవారం ఆసియా మార్కెట్లు కూడా డౌన్ ట్రెండ్‌లకు గురయ్యాయి. ఉదాహరణకి, నిక్కే (జపాన్) ఈ వారం పతనాన్ని నమోదు చేసింది. చైనాకు చెందిన సిఎస్ఐ300 సూచిక దిగజారింది. స్టాక్ మార్కెట్లు డోలాయమాన పరిస్థితులకు గురవుతున్న నేపథ్యంలో మదుపరులు ఎక్కువగా బంగారం వంటి తక్కువ రిస్క్ ఉన్న మార్గాలవైపు మొగ్గు చూపుతున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు.

### బులియన్: పసిడి ధరలు పైపైకి..

అంతర్జాతీయ మార్కెట్లో పెరుగుతున్న అనిశ్చితి, ద్రవ్యోల్బణ భయాలు వెంటాడుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారుల రక్షణాత్మక కొనుగోళ్ల కారణంగా బంగారం ధరలు పెరుగుతునే ఉన్నాయి. డాలర్ బలహీనత, జియోపాలిటికల్ ఉద్రిక్తతలు, ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లలో నెలకొంటున్న ఒత్తిడి బంగారాన్ని మళ్లీ 'రక్షణాత్మక పెట్టుబడి కేంద్రం'గా మారింది. దీనికి తోడు పెళ్ళిళ్ల సజీన్ కూడా వస్తుండడంతో, దేశీయ బులియన్ మార్కెట్ జోరందుకుంది. మార్కెట్ ధరలకు అదనపు మద్దతు లభించడంతో, బంగారం ధరలు ఒక్కసారిగా నింగిని తాకాయి. సామాన్యులకు చుక్కలు చూపించాయి. శనివారం దేశంలో బంగారం ధరలను పరిశీలిస్తే, 24 క్యారెట్ల గ్రాము ధర రూ.186 పెరిగి రూ.12,584 వద్ద ట్రేడ్ అవుతున్నది. ఇక 22 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.170 పెరిగి రూ. 11,535గా ఉంది. అలాగే, 18 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.139 పెరిగి రూ.9,438కు చేరింది. కాగా, 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.18, 600 పెరిగి రూ.12,58,400 వద్ద ట్రేడ్ అవుతుండగా, 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.17,000 పెరిగి రూ. 11,53,500కు చేరింది. 18 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ 13,900 పెరిగి రూ.9,43,800గా ఉంది. హైదరాబాద్ నగరంలో ధరలను పరిశీలిస్తే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1860 పెరిగి రూ.1,25,840 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1700 పెరిగి రూ.1,15,350 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,390 పెరిగి రూ.94,380గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితికి, పెళ్లిళ్ల సీజన్ కూడా జతకలవడంతో, బులియన్ మార్కెట్ వచ్చే వారం కూడా ఇదే ఒరవడిని కొనసాగించడం ఖాయంగా కనిపిస్తున్నది.



### వచ్చేవారం..

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు వచ్చే వారం ఎలా ఉండబోతున్నాయన్న ప్రశ్నకు కనీస అంచనాలు కూడా లేకుండాపోతున్నాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల అంశం ఎటూ తేలకపోవడంతో, ఆ ప్రభావం స్టాక్ మార్కెట్లపై కనిపిస్తున్నది. అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులు ఫెడ్ రిజర్వ్ నిర్ణయాలపై ఎక్కువగా ఆధారపడతాయన్నది వాస్తవం. అమెరికా నిర్ణయం ఎంత త్వరగా వెలువడితే, మార్కెట్ రిస్క్‌ను అంత త్వరగా తగ్గించవచ్చని నిపుణులు అంటున్నారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఫెడ్ రిజర్వ్ నిర్ణయంపై అంచనాలు కూడా వేయలేకపోతున్నారు. ఆసియా మార్కెట్ల పరిస్థితి కూడా ఇందుకు భిన్నమేమీ కాదు. అయితే, ఎఐ, టెక్ రంగాలు తీవ్ర ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

## నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు

### ఎఐటియుసి నిరసనలు



ప్రజాపక్షం/నిజామాబాద్ : నాలుగు లేబర్ కోడ్ల అమలును ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్ర ధాన కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. శనివారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులకు మరణ శాసనం విధించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికులకు ఎలాంటి రక్షణ లేకుండా పని భద్రత లేకుండా గుర్తింపు లేకుండా ఉన్న సందర్భంలో చట్టాన్ని తొలగించి లేబర్ కోడ్ల ద్వారా 12 గంట లు పని చేయాలని చెప్పటం సిగ్గు చేటన్నారు. మహిళా కార్మికులు మూడు పూటలు పని చేయాలని చెప్పడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా రాబోచే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చక్రపాణి, నాయకులు హైమది బేగం, హన్మాండ్లు, అనిల్, కవిత, స్వరూప, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ మల్కాజిగిరి :** కేంద్ర ప్రభు త్వం తీసుకొని వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు కె.రవిచంద్రన్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం ఆల్వాల్ జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులు హరించే కుట్ర చేస్తుందని విమర్శించారు. తమ హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికలోకం పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికులకు రూ. 25 లక్షలు నష్టపరిహారంగా ఇవ్వటంతో పాటు అంత్యక్రియల నిమిత్తం రూ.30 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని, పదవీ విరమణ చేసిన వారికి రూ.10 లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్‌గా చెల్లించాలని ఈ సందర్భంగా కె.రవిచంద్రన్ డిమాండ్ చేశారు. అనంతరం జిహెచ్‌ఎంసి అసిస్టెంట్ కమిషనర్ హేమలతకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** కార్మిక హక్కులను కాలరాస్తు 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే నాలుగు లేబర్ కోడ్‌ల అమలును తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలని, రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట హైదరాబాద్ రాయచూరు రోడ్డుపై నిరసన చేపట్టి లేబర్ కోడ్‌ల పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నామరూపం లేకుండా చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లలో కార్మిక వ్యతిరేక అనేక అంశాలు పొందుపరిచారని, పైకి మాత్రం కార్మికుల సంక్షేమ అంటూ విషప్రచారం సాగిస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌లు అమలును తక్షణమే నిలిపివేయకపోతే ఐక్య పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు గోపాల్ నాయక్, మొగులయ్య, దేవానంద్, జే.నరసింహ, అంజి, జగ్గా నాయక్, నరసింహులు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, టంకర వెంకటయ్య, కొండయ్య, సత్తయ్య, యాదగిరి, వసంత, నాగమ్మ, సత్త్యమ్మ, పద్మ, దేవి, అంజమ్మ, వరలక్ష్మి, తిరుపతమ్మ, కవిత, మంజుల, నాగలక్ష్మి, సవిత, జ్యోతి, మమత, నిర్మల, నర్సమ్మ, విజయ నిర్మల, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.






## ఆపరేషన్ కగార్ ఆపాలి




### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా

ప్రజాపక్షం/వరంగల్ : ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని, బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలని, అక్రమంగా అరెస్టు చేసిన మావోయిస్టులను విడుదల చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. వరంగల్ పట్టణంలోని శివనగర్ తమ్మెర భవన్ లో సిపిఐ వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం గుండె బద్రి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా షేక్ బాష్ మియా పాల్గొని మాట్లాడుతూ ఆపరేషన్ కగారు పేరుతో, అడవిలోని ఆదివాసులను, అటవీ సంపదలను, జంతు వైవిధ్యాన్ని కాపాడుతూ వస్తున్న మావోయిస్టులను ఊచకోత కోయడమే ధ్యేయంగా కేంద్రప్రభుత్వం, అమిత్ షా, మోడీ వ్యవహరిస్తున్నారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ రాజ్యాంగ విరుద్ధంగా హత్యలు గావిస్తూ ప్రజలను, మావోయిస్టులను పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి ప్రభుత్వమే ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని ఎండగట్టకపోతే ప్రజలు దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అడవిలోని ఆదివాసి ప్రజలను అక్కడి నుంచి ఖాళీ చేయించి ఆ భూమిని అంబానికి, ఆదానికి కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం సుదీర్ఘకాలంగా ప్రయత్నం చేస్తూఉందని విమర్శించారు. ఇందులో భాగంగా ఎంతోమంది మావోయిస్టులను, ఆదివాసి ప్రజలను చివరికి ఆరు నెలల పసిపాపను కూడా వదిలిపెట్టకుండా హత్యలు చేస్తుందన్నారు. ఈ హత్యాకాండను బిజెపి ప్రజా వ్యతిరేక తీరును ప్రశ్నించిన ప్రతి ఒక్క గొంతుకను అరెస్టు చేసి జైల్లో బంధించడం జరిగిందన్నారు. మావోయిస్టు అగ్రనేతలు ఎంతోమందిని పట్టుకొని చిత్రహింసలు పెట్టి వారిని కాల్చి హత్య చేసి చంపిదాని ఎన్‌కౌంటర్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని అడ్డుకోవాలన్నారు. దేశంలో మావోయిస్టులను లేకుండా అంతం చేస్తామని పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా శపదం చేసి అదే పనిగా మావోయిస్టులను హత్య చేస్తున్నారన్నారు. కానీ ఈ దేశంలో ఉన్న పేదరికాన్ని ఈ దేశంలో ఉన్న ఆకలి చావులను నిరుద్యోగతను, అసమానతులను, అరాచకాలను, మహిళల పట్ల జరుగుతున్న దాడులను, హత్యలను, మానభంగాలను తగ్గిస్తామని దానికి సంబంధించిన ఎటువంటి శపదం చేయకుండా ఉండడం సిగ్గుచేటన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని ఎండగట్టకపోతే దేశంలో ప్రజలు దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓర్సు రాజు, పరికరాల రమేష్, ఎండి అక్బర్ పాషా, జన్ను రవి, తాళ్ల పెల్లి జాన్ పాల్, సుంకరి భవాని, చిట్యాల, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎఐఎస్ఎఫ్




ప్రజాపక్షం/ములుగు : విద్యారంగ సమస్యలను వెంటనే రాష్ట్రప్రభుత్వం పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్‌టియు భవన్‌లో ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపైన పోరాటాలను ఉధృ తం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని, విద్యారంగానికి 15 శాతం నిధులు విడుదల చేయాలని కోరారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ములుగు జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గిరిజన యూనివర్సిటీకి అధిక నిధులు కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, కామన్ విద్యా విధానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ ములుగు జిల్లా మహాసభలు డిసెంబర్ 22, 23న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, పగిడి అన్వేష్, కొండగొర్ల సాయి కుమార్, రణదీప్, చెన్నూరు రామ్ చరణ్, దుర్గం శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలోకి ప్రముఖ వైద్యుడు కిరణ్‌కుమార్

### ఆహ్వానించిన కూనంనేని




ప్రజాపక్షం/ఖమ్మం : దుర్గ విరించి హాస్పటల్ అధినేత, ప్రముఖ గుండె, షుగర్ వైద్యనిపుణులు కిరణ్‌కుమార్ గుదిగొండ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు సమక్షంలో సిపిఐలో చేరారు. జాతీయసమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ కంట్రోల్ కమీషన్ చైర్మన్ మహామ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఎం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన గుదిగొండ రామలింగం ద్వితీయ కుమారుడు కిరణ్‌కుమార్. రామలింగం సిపిఐ నాయకుడిగా పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారు. తన తండ్రి ఆశయాలను అనుగుణంగా సిపిఐలో చేరడం ఆనందంగా ఉందని కిరణ్‌కుమార్ తెలిపారు. కిరణ్‌కుమార్‌తో పాటు సిపిఐలోకి చేరిన వారిలో బెతంపూడి ఉపేందర్, ఆదెర్ల ప్రవీణ్, గుదిగొండ లోకేష్, యలగాడి వరలక్ష్మి, తుమ్మల రఘు తదితరులున్నారు. కార్యక్రమంలో ఎండి సలాం, బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, సాంబశివ రెడ్డి, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, షేక్ సైదా, ఆకెన పవన్ తదతరులున్నారు.



# స్థానికం
REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## పోలింగ్ స్టేషన్స్‌లో వసతులు పరిశీలించాలి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లలో కనీస వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ మధు సూదన్ నాయక్ జిల్లా పంచాయతీ అధికారి నిఖిలతో కలిసి శనివారం ఎం.పి.డి.ఓలు ఎంపీవోలు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో జిల్లాలో అన్ని గ్రామలలో గల పోలింగ్ స్టేషన్స్ లో విద్యుత్ సౌకర్యం, తాగు నీరు సౌకర్యం, స్త్రీలకు, పురుషులు విడిగా మరుగుదొడ్ల సౌకర్యం, వికలాంగులకు, వృద్ధులకు రాంప్ సౌకర్యం, కంపౌండ్ సౌకర్యం, వసతులు పరిశీలన చేసి మధ్యాహ్నం వరకు రిపోర్ట్ అంద చేయాలని ఆయన ఆదేశించారు.

## నక్సలైట్లు పంథం మార్చుకోవాలి

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** భారతదేశం నేడు ప్రపంచంలో అభివృద్ధి వైపు దూసుకొని పోతున్న తరుణంలో మావోయిస్టులు, నక్సలైట్లు అనుసరిస్తున్న విధానాల వలన అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా ఒక ప్రకటనలో తెలిపారు. వారు లొంగిపోయిన కేంద్ర, రాష్ట్ర మావోయిస్టుల, నక్సలైట్ల మాదిరిగా జన జీవన స్రవంతిలోకి వచ్చి బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో మానోయిస్టులపై జరుగుతున్న ఎంకౌటర్లను వ్యతిరే కించే వారు పోలీసు అధికారులను, పోలీసు బలగాలను, ప్రజా ప్రతినిధు లను మావోయిస్టులు, నక్సలైట్లు చంపితే ఎందుకు మౌనం పాటిస్తారో తెలి యచేయాలని అన్నారు. నారాయణ పేట జిల్లాలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, వారి కొడుకు చిట్టెం వెంకటేశ్వర రెడ్డిని చంపిన నక్సలైట్‌లు ఏమి సాధించారో తెలుపాలని అన్నారు. ప్రపంచంలోనే మావోయిజం, నక్స లిజం అంతరించి పోయిందని అన్నారు. భారతదేశంలో హింసకు తావు లేదు కావున మావోయిస్టులు, నక్సలైట్లు వారి యొక్క పంథం మార్చుకొని పే ప్రజల ఉన్నతి కోసం రాజ్యాంగబద్ధంగా పోరాటం చేయలని కోరారు.

## భవన నిర్మాణానికి మంత్రి హామీ



**ప్రజాపక్షం/మాగనూర్ :** రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ముదిరాజ్ సోద రుల యొక్క మత్స్య సహకార సంఘం భవన నిర్మాణానికి మాగనూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి మత్స్య సహకార సంఘం భవన శంకుస్థాపన పూర్తి చేసి ముఖ్యమంత్రి లేదా మంత్రులను తీసుక వచ్చి ప్రారంభం చేయిస్తానని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మాగనూర్ మత్స్య సహకార సంఘం అధ్యక్షులు పూంజనూర్ ఆంజనేయులు, ఉపాధ్య క్షులు దండు ఆనంద్, ప్రధాన కార్యదర్శి గడ్డం నరేష్, సంఘం డైరెక్టర్ దండు బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన




**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని బాయ్స్, గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులకు స్నేహ ఫౌండేషన్ సహకారంతో స్కూల్ షూస్ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యాశాఖను పూర్తిగా భ్రష్టు పట్టిందన్నారు. ప్రజాప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయ కత్వంలో విద్యాశాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తున్నామన్నారు. ముఖ్యంగా దేవరకద్ర నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలను పట్టించుకో లేదని, గతంలో సిఎస్ఆర్ నిధులను నాయకులు తమ స్వప్రయోజనాలకు వాడుకున్నారని, వారికి భిన్నంగా తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి నేటి వరకు కొత్తకోట ప్రభుత్వ పాఠశాలను నాలుగు సార్లు పరిశీలించి, వారి అవసరాలను గుర్తించి నియోజకవర్గ వ్యాప్తంగా పదవ తరగతి విద్యా ర్థులకు తన సొంత నిధులతో స్టడీ మెటీరియల్ అందజేస్తామని, బాలికల పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని, త్వరలోనే భవన నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. విద్యార్థులు కాలికి చెప్పులు లేకుండా ఉండడానికి గమనించి, నియోజకవర్గంలోని పలు కార్పొరేట్ కంపెనీలతో మాట్లాడి, సిఎస్ఆర్ నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. త్వరలోనే టై, బెల్టులు పంపిణీ చేస్తామని అన్నారు.

## మహిళా ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



**ప్రజాపక్షం/వనపనర్తి న్యూటౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని, మహిళా ఆర్థిక స్వావలంబనను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలలో మహిలలను భాగస్వామ్యం చేస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొ న్నారు. శనివారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి జంగమయ్య పల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పనులు చేపట్టింద న్నారు. ఇతర పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారు అభివృద్ధికి ఆటంకాలుగా మిగులుతారని ఏ ఒక్కరికి అవకాశం ఇవ్వకూడదని ఆయన సూచించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అద్యక్షురాలు స్వరూప, మాజీ జడ్పిటిసిలు వెంకటస్వామి, రమేష్ గౌడ్, వేణుగోపాల్, నాయకులు మణిగిల్ల తిరుపతి రెడ్డి, శ్రీశైలం యాదవ్, మహిళా సమాఖ్య సభ్యురాలు అధికారులు దళితులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఉన్నత ఉద్యోగాలు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా స్థాయి క్రీడా పోటీలు (ఎస్జిఎఫ్ పాఠశాలల సమాఖ్య వాలీబాల్ అండర్ 14 సంవత్సరాల బాల బాలికల వాలీబాల్ క్రీడా పోటీలు ఎంపికలు శనివారం జిల్లా కేంద్రం లోని స్టేడియం మైదానంలో జరిగాయి. జిల్లాలోని 13 మండలాల నుండి దాదాపు 260 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్ హాజరై యారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి డిఈఓ గోవింద రాజు పాల్గొన్నారు. ప్రారంబోత్సవ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ వాలీడాల్ క్రీడా అనేది చాలా ప్రాముఖ్యత కలిగిన ఆట అన్నారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కలిగిన వారు ఉన్నత ఉద్యోగాలు సాధిస్తారని అన్నారు. నారాయనపేట జిల్లా సీఎం జిల్లా అని అలాగే ప్రభుత్వం క్రీడాల పట్ల అభివృద్ధి చేస్తుందని ఏయంసి చైర్మన్ సదశివారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏయంసి, వైస్ చైర్మన్ హన్మంతు, ఆర్టీఐ డైరె క్టర్ రాజేష్, ఎస్జిఎఫ్ సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, పిడిలు నర్సిములు, రత్నయ్య, వెంకటప్ప, అనంతసేన, సాయినాథ్, రామకృష్ణ, నర్సింహారెడ్డి, శ్రీధర్, వేణు, పారిజాత, రాజేశ్వరి, అక్తర్, బసంతరెడ్డి లు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపిక కాబడిన విద్యార్థులు 24న గద్వాల్‌లో జరుగు ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌పిఎఫ్ వాలీబాల్ క్రీడ పోటీలలో పాల్గొంటారు.

# ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యం

చీరల పంపిణీలో మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/నర్వ/మక్తల్:** ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మక్తల్ పట్టణం ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మహిళలకు ఇందిరమ్మ చీరలను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ ఇందిరమ్మ చీరలను అందుకుంటున్న అక్కా చెల్లెల్లకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మహిళలందరికీ ఒక అన్నగా మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మన కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంచుతున్నాడన్నారు. మీకు ఇచ్చే నాణ్యమైన చీరలతో మాకు గౌరవం పెరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో బతుకమ్మ పేరుతో నాసిరకం చీరలు ఇచ్చా రని విమర్శించారు. కాని మన సీఎం మాత్రం అలాంటి చీరలను కాకుండా మంచి నాణ్యమైన చీరలనే ఇస్తున్నాడన్నారు. మహిళలపై నిజమైన ప్రేమ ఎవ రికి ఉన్నదో మీరే గుర్తెరగాలని హితవు పలికారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యమని, ప్రధానమంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు ఇప్పించడం, పెట్రోల్ పంపుల నిర్వాహణ, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్లుల ఏర్పాటు వంటి అనేక వ్యాపారాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇందిరా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, పాఠశాలల్లో బాలికలకు స్కూళ్లు తెరిచిన వెంటనే స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ ఒకటవ తారీఖున 4500 కోట్ల బడ్జెట్ తో మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ పర్యటనను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

**ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి**

మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిని మక్తల్ టిఎన్జీవోస్ యూనిట్ మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మునవర్ అలీ అధ్యక్షులు , శ్రీధర్ అసో సియేటెడ్ ప్రెసిడెంట్, నరసింహారెడ్డి జిల్లా నాయకులు, మురళీధర్ గౌడ్, మునెప్ప, వైస్ ప్రెసిడెంట్లు విజయ్ గౌడ్, ట్రెజరర్ యాదగిరి, జాయింట్ సెక్ర టరీ సువర్ణ, సులోచనమ్మ, విష్ణప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్ పబ్లిసిటీ సెక్రెటరీ చంద్రకాంత్ ఈసీ మెంబర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా మంత్రి స్పందించారు.




# మహిళ అభివృద్ధితోనే ప్రగతి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మహిళ అభివృద్ధితోనే రాష్ట్రప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని మహిళాసమైక్యభవ నంలో శనివారం చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై చీరలు పంపిణీచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ప్రభుత్వం చీరలు అందిస్తు న్నట్లు తెలిపారు. కల్వకుర్తి మండలానికి 8400చీరలకుగాను 7వేల చీరలు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఆడపడుచుకు చీరలు అందిస్తామన్నారు. ప్రతిచీరపై ప్రభుత్వం రూ.650 చెల్లించిందన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఉచితంగా రుణాలను అందిస్తూ వాటిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుం దన్నారు. కల్వకుర్తికి దాదాపు కోటి 13లక్షల రూపాయలు రుణాలు మాఫీ చేయడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమం కోసం సోలార్, పెట్రోల్‌పంపులు, ఆర్‌టిసిబస్సులు, వరికొనుగోలు కేంద్రాలు, మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పిసిబి మెంబర్ ఠాగూర్ బాలాజిసింగ్, ఆర్‌డిఓ జనార్ధన్‌రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, మాజీ జడ్పిటిసి అశోక్‌రెడ్డి, ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్‌అండ్ మానిటరింగ్‌కమిటి మెంబర్ జిలెల్ల రాములు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చిమ్ముల‌శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్‌డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, మాజీకౌన్సిలర్లు గోరటిశ్రీనివాసులు, షేక్ ఎజాస్, మాజీ సర్పంచ్ దామోదర్‌గౌడ్, కాంగ్రెస్ యువనాయకుడు సంతు యాదవ్, జమ్ములశ్రీకాంత్, డిపిఎం శ్రీనివాస్, ఎపిఎం చంద్రయ్య, మహి ళలు పాల్గొన్నారు.

## 26న నిరసన దీక్ష



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో గిరిజన మహిళా వసతి గృహం యందు గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్త్యావత్ రమేష్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదిన టీటీడీ కళ్యాణ మండపం, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం యందు సాయంత్రం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్య క్రమం నిర్వహించబడును. కావున అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలానే అసత్య , తప్పుడు ఆరోపణలు చేస్తూ, గిరిజన తెగల మధ్య చిచ్చు పెడుతూ విద్య, ఉద్యోగ, ఆర్థికంగా, రాజకీయ పరంగా లంబాడీలు అభివృద్ధి చెందకుండా లంబాడీల బతుకులను ఆగం చేయాలనే ఉద్దేశంతో కుట్రలను పన్నుతూ ఎస్టి జాబితా నుండి లంబాడీలను తొలగించా లనే అసంబద్ధమైన, అసాధ్యమైన డిమాండును తమ రాజకీయ పబ్బం గడుపు కోవడం కోసం మాజీ ఎంపి సోయం బాబురావు, ఎమ్మెల్యే వెంకట్రావు అనే కాంగ్రెస్ పార్టీ నాయకులు సోదరభావం కలిగిన గిరిజన తెగల మధ్య వైరు ధ్యాన్ని సృష్టిస్తున్నారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లంబాడి బిడ్డలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్త్యావత్ రమేష్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్, నరేష్ నాయక్, శాంతి, సరిత, శారద, గాయత్రి, కవిత, మంజుల, రాధిక, భాగ్య, పద్మ, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# కోటి చీరలు పంపిణీ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ప్రజాపక్షం/అచ్చంపేట :** తెలంగాణలో కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట మండలం పలకపల్లి గ్రామంలో ఇందిరమ్మ మహిళాశక్తి చీరల పంపిణి నిర్వహించారు. ప్రతి పేదమహిళకు గౌరప్ర దంగా అందించే చీరలు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఈచీరలు రాజన్న సిరిసిల్ల , కరీంనగర్, హన్మకొండ జిల్లాలో వేయించినట్లు తెలిపారు. ఇంది రామహిళాశక్తి కింద చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ప్రయాణపథకం, గ్యాస్‌సిలిండర్ పథకం, జిరో వంటి రుణాలు , మహిళాసంఘాలకు పెట్రోల్‌బంకులు, బస్సులకొనుగోలు, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కోటిమంది మహిళ లను కోటిశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట మున్సిపల్‌చైర్మన్ గార్లపాటిశ్రీనివాసులు పాల్గొన్నారు.

**ఓట్‌కి చోర్ గద్దిచోడ్ నినాదాన్ని ప్రజలకు తెలియజేయాలి**

కేంద్రప్రభుత్వం దొంగ ఓట్లతో అధికారాన్ని దక్కించుకున్న సందర్భంగా ఓట్‌కిచోర్ గద్దిచోడ్ అనేనినాదాన్ని ప్రజలందరికి తెలియజేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శనివారం అచ్చంపేటలోని అంబేద్కర్ ప్రజాభవన్‌లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల కాంగ్రెస్‌నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కేంద్రప్ర భుత్వం దొంగ ఓట్లతో అధికారం సాధించిందని దానికోసం దొంగ ఓట్లను వదిలించుకునేందుకు కేంద్రప్రభుత్వం గద్దెదిగాలన్నారు. గతంలో ఎన్నో జిమ్మిక్కులుచేసి రెండుసార్లు కేందప్రభుత్వం గద్దెనెక్కిందని మూడోసారి దొంగ ఓట్లతో అధికారం చేజిక్కించుందని ఇది గమనించి రాహుల్‌గాంధీ ప్రతి రాష్ట్రంలో ఉన్న దొంగ ఓట్ల వివరాలు గుర్తించాడని అన్నారు.



# డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్




ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు ముందుగా పెండింగ్‌లో ఉన్న కేసు లను పరిష్కరించాలని శనివారం జరిగిన కో ఆర్డినేషన్ మీటింగ్‌లో డిసెంబర్ 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్ కార్య క్రమం నిర్వహించబడుననీ న్యాయమూర్తులకు, పోలీస్ అధికారులకు ముందుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే కేసులు త్వరగా పరిష్కారమై సత్వర న్యాయం అందుతుందని ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ తమ కేసులను రాజ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలి తెలిపారు. పరిష్కారం తగిన కేసులు యాక్సి డెంట్ కేసులు, కొట్టుకున్న కేసులు, చీటింగ్ కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగతనం కేసులు, కరోనా సమయం లోని పెండింగ్ లో ఉన్న కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తెలిపారు. తదు పరి ఎగ్జిక్యూషన్ పిటిషన్ (ఈపి), క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు సివిల్ కేసులు, సైబర్ క్రైమ్స్, ఎన్ఐ ఆక్ట్ పెండింగ్ కేసుల గురించి ఆరాదీశారు. తదుపరి ఎన్‌బిడబ్ల్యూ కేసులు, చార్జ్‌షీట్ దాకలు చేసారా పెండింగ్ లో ఉంటే త్వరగా ఎంక్వయిరీ చేసి ఎగ్జిక్యూట్ చేయమన్నారు. ఈ సమావే శంలో న్యాయమూర్తులు బోయ శ్రీనివాసులు, సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ డివిఎల్ఎస్ఏ వింధ్య నాయక్, ఏస్పిడిఓ ఎన్. లింగయ్య, ఇతర పోలీస్ అధికా రులు పాల్గొన్నారు.

## మైనార్టీ సంక్షేమానికి మరో ముందడుగు



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వస తుల సంస్థ సహకారంతో మహబూబ్‌నగర్ నగరం, వీరన్నపేటలోని రహ్మా నుల్లా షాహ్ దర్గా ప్రాంగణంలో రీడింగ్ రూమ్, కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు , కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్ట నున్న ఈ పనులు మైనార్టీ యువతకు విద్యా వాతావరణం మెరుగుపరచ డంలో కీలకంగా నిలవనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రీడింగ్ రూమ్ ద్వారా విద్యార్థులకు ప్రశాంతమైన అధ్యయన వాతావరణం లభించనుందన్నారు. అభివృద్ధిలో మైనార్టీలకు సమాన న్యాయం అందించే దిశగా తమ ప్రయత్నం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, నాయకులు అవేజ్, అజ్మత్ అలి, తాహెర్, ఖాజా పాషా, సాదుల్లా, రాషెద్ ఖాన్, మోసిన్, ప్రవీణ్ కుమార్, ఫైసల్, రియాజ్, పులిజాల రవికిరణ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, దర్గా కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, తదిత రులు పాల్గొన్నారు.

## నిరంకుశ వైఖరి నశించాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రధానమంత్రి నరేంద్రమోడి కార్మికులపట్ల నిరంకుశ వైఖరి నశించాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలు, ప్రతిపక్షాల అభ్యంతరాలు బేఖాతర్ చేస్తూ 29కార్మిక చట్టాల్ని రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చారు అన్నారు. బీహర్‌లో ఎన్‌డిఎ కూటమికి అత్యధిక మెజారిటి రావడంతో కేంద్రంలో కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు వేగవంతమైందన్నారు. దానిలో భాగంగానే 29కార్మిక చట్టాలను రద్దుచేసి వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కార్పొరేట్లకు బడా పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేసే విధంగా ఈచట్టాలను రూపొందించారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# పిల్లల భవిష్యత్తును నాశనం చేయొద్దు

డిఫెన్స్ కౌన్సిలర్ కే. లక్ష్మీ పతి గౌడ్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జాతీయ న్యాయ సేవ ప్రధాన న్యాయమూర్తి అధికారి ఆదేశాలకు లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట లోని ప్రభుత్వ గవర్నమెంట్ హైస్కూల్ (గ్రౌండ్)లో ఆడపిల్లలను రక్షించ దండి, బాల్య వివాహాలు, బాల లేబర్‌పై న్యాయ విజ్ఞాన సదస్సును పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె.లక్ష్మీ పతి గౌడ్ నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత పై దృష్టి పెట్టాలి, సమాజం, దేశం అభివృద్ధికి బాలికలు కీలకమని, వారిని గౌరవించడం, రక్షించడం మనందరి బాధ్యత, బాలికలకు విద్యనందించడం, వారిని పాఠశాలలకు పంపించడం ద్వారా సమాన అవ కాశాలు పొందుతారు. బాలికల విద్యను మెరుగుపర్చాలి, పోషకాహార లోపాన్ని నివారించి, శిశు మరణాలను తగ్గించాలి, ఆడపిల్లల హక్కులు, సాధికారత గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వివరించారు. పేదరికం, నిరుద్యోగం, కుటుంబ సమస్యలు వంటి కారణాల వల్ల ఈ నేరాలు పెరుగుతున్నాయి. అక్రమ రవాణాకు గురైన పిల్లలు శారీరకంగా, మానసికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటారని తెలిపారు. పిల్లలకు చట్టపరమైన సేవలను అందించడం అలాగే చట్టపరమైన సహాయాన్ని అందు బాటులోకి తీసుకురావాలి, అది వయస్సుకు తగినట్లుగా ఉండేలా చూసుకో వాలి, పిల్లలకి స్నేహపూర్వక న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అంద రికీ సమాన హక్కులు కల్పించిందన్ని అన్నారు. న్యాయ సలహాల కోసం 15100 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యను చెప్తే ఈ సంస్థలో పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మీ పతి గౌడ్, తిరుపతయ్య (చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్), అబ్దుల్ నయీమ్ (ఇంచార్జి హెడ్ మాస్టర్), డి.నర్సిములు (డిస్ట్రిక్ట్ మిషన్ కోర్డినేటర్), పార లీగల్ వాలంటీర్ పాల్గొన్నారు.



## స్కూల్ అదనపు గదుల భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలం విలియం కొండ గ్రామం వద్ద రాజా బహదూర్ వెంక ట్రామిరెడ్డి ఆర్‌బివిఆర్‌ఆర్ స్కూల్ అదనపు గదుల భవన నిర్మాణం కోసం, డార్మెటరీ హాల్, డైనింగ్ హాల్ నిర్మాణం కోసం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల రవీందర్ నాథ్ రెడ్డి, బసిరెడ్డి, ఆర్‌బివిఆర్‌ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు తదితరులతో కలిసి పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ విద్యా వ్యాప్తి కోసం విశేషంగా కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త రాజా బహదూర్ వెంకటరామారెడ్డిని కొనియాడారు, వారి బాటలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్య, వ్యాప్తి కోసం విశేషంగా కృషి చేస్తూ, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యాబోధనలను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, విద్యార్థుల్లోని స్కిల్స్‌ను గురించి, వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ఏటీసీలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఆర్‌బివిఆర్‌ఆర్ పాఠశాల ఎక్స్టెన్షన్ చేసుకోవడానికి, మౌలిక వసతుల ఏర్పాటుకు, ప్రభుత్వ పరంగా ఎలాంటి సహకారమైన అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.

## ఉత్తమ సేవలకు ప్రత్యేక గుర్తింపు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** వృద్ధులకు ఉత్తమసేవలందిస్తున్న వృద్ధాశ్రమ నిర్వా హకులు పెరుమాళ్ల వెంకటయ్యను జిల్లా ఆడిషనల్ కలెక్టర్ అమరేందర్, డిడబ్ల్యూ రాజేశ్వరిలు సత్కరించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివా రం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిడబ్ల్యూఓ రాజేశ్వరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ఆడిషనల్ కలె క్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పట్టణంలో గత 16 సంవత్సరాలుగా వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ వృద్ధులకు అన్ని విధాలుగా తోడుగా ఉంటూ సేవలందిస్తున్న నిర్వాహకులు పెరుమాళ్ల వెంకటయ్యను అభినందిస్తూ శాలువా, మెమోంటోతో సత్కరించారు. వృద్ధులకు సేవచే యడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు సీనియర్ సిటిజన్స్ నాయకులు ,అధికారులు, బిజినేపల్లి వృద్ధా శ్రమ నిర్వాహకురాలు రాణికుమారి, పలువురు వృద్ధులు పాల్గొన్నారు.

# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల



## సమస్యలను పరిష్కరించండి



ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండా మండల సిపిఐ పార్టీ శ్రేణులు శనివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బీర్ల అయిలయ్యకు మండలంలోని పలు సమస్యలను వివరించి వాటిని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడంతో తక్షణమే స్పందించిన ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పొత్తులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సిపిఐ పార్టీకి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామ చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు ఆది సాయన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర పాల్గొన్నారు.



## మహిళల కోసం ఇందిరమ్మ చీరలు

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రజాపక్షం/చిట్యాల: మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెలుతుందని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. పట్టణంలో శనివారం జరిగిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రెండు విడతలుగా ఇందిరమ్మ చీరలను రాష్ట్ర మహిళలకు అందించడం జరుగుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ శ్రీనివాస్‌రావు, మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోద, మున్సిపాలిటి మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెలిమినేడు పిఏసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి



ప్రజాపక్షం/హాలియా: మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూత అందిస్తుందని నాగార్జునసాగర్ ఎంఎల్ఏ కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. శనివారం హాలియాలోని లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తుందని మహిళల కోసం తమ ప్రభుత్వం పెట్రోల్ బంక్ లు, మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసి ఆర్థిక చేయూత అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,పీడీ రాజ్ కుమార్,ప్రత్యేక అధికారి బిక్షపతి,ఏడీఏ సరిత, తహసిల్దార్ రఘు,కమిషనర్ రామదుర్గారెడ్డి,కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్‌లు తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి,అంకతి సత్యం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేస్తాం

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



ప్రజాపక్షం /మునుగోడు: ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా మా ప్రభుత్వం నెరవేరుస్తుందని మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి చీరలను మండల మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలను చిన్నచూపు చూస్తూ బతుకమ్మ చీరల పేరుతో నాణ్యతలేని చీరలను పంచి మహిళలను అవమానపరిచారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూనే తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,చండూరు ఆర్‌డిఓశ్రీదేవి,ఇన్చార్జి తహసిల్దార్ నరేష్, ఎంపిడివో యుగంధర్, ఏపిఎం భాస్కర్, మండలంలోని వివిధ గ్రామాల మహిళా సంఘాల లీడర్లు మహిళలు పాల్గొన్నారు.

## గంజాయితో పట్టుబడ్డ యువకుడు



ప్రజాపక్షం/తుర్కపల్లి : ఉప్పల్ నుంచి కొమురవెళ్ళికి గంజాయి సరఫరా చేస్తున్న యువకుడు పోలీసులకు పట్టుబడ్డ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో చోటుచేసుకుంది. తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం సమయంలో బీబీనగర్ మండలం బట్టుగూడెం గ్రామానికి చెందిన పార్వతీ లాలి(23) అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో తుర్కపల్లి గ్రామ శివారులోని కరెంట్ సబ్ స్టేషన్ వద్ద యువకుణ్ణి, స్ప్లేండర్ ప్లేస్ టీఎస్ 30H1925 వాహనాన్ని తనిఖీ చేయగా ఒక కవర్లో సుమారు 100 గ్రాముల గంజాయి పట్టుబడిందని తెలిపారు. జిల్లా జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ శ్రీనివాస్ నాయుడు పర్యవేక్షణలో నిందితుడి వద్దనుంచి 100 గ్రాముల గంజాయి, మోటార్ సైకిల్, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మాదకద్రవ్యాలు, డ్రగ్స్ స్మగ్లింగ్ చేసినా, అసాంఘీక కార్యక్రమాలు చేపట్టినా చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మత్స్యకారుల బలోపేతానికి కృషి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : మత్స్యకారుల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ చెరువులో సీనియర్ నాయకులు తూముల భుజంగరావు, పోతు భాస్కర్‌లతో కలిసి ఉచిత చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత చేప పిల్లల పథకం మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వారు ఆర్థికంగా బలోపేతానికి దోహదపడుతుందని చెప్పారు.గూడెపుకుంట తండలో నూతన పంచాయితీ కార్యాలయానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం మాచారం గ్రామంలో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన పలువురు కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

# రైస్ మిల్లులు ఏర్పాటు చేయిస్తాం

మహిళలను కోటీశ్వరులుగా చేయడానికి

నల్లగొండ నుండే పైలట్ పద్ధతిలో ప్రారంభించేందుకు చర్యలు

ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీలో మంత్రి కోమటిరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తెచ్చిదిద్దాలన్న సంకల్పంతో మహిళల కోసం ఉచిత బస్సుసౌకర్యం,బస్సులు, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ ద్వారా ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడేందుకు చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.ప్రభుత్వమే మహిళా సంఘాలకు రుణం మంజూరు చేసి ఆర్అండ్‌బి శాఖ ద్వారా రైస్ మిల్లులు నిర్మిస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.శనివారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదీత్య భవన్లో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీకార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. మహిళలను కోటీశ్వరులను చేయడంలో భాగంగా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పైలెట్ పద్ధతిన నల్లగొండ జిల్లాలో మహిళల చేత రైస్ మిల్లులు ఏర్పాటు చేయిస్తామని, జిల్లాలో రైస్ మిల్లుల కొరతను ఈ విధంగా తీరుస్తామని,ఇందుకుగాను వారికి ముందుగా రుణాలు అందజేసి రైస్ మిల్లులను వారే నిర్వహించుకునేలా దానిపై వచ్చే లాభం ద్వారా ప్రతినెల తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించేలా, తద్వారా లాభం పొందే విధంగా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన స్థలాలను చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వచ్చే క్యాబినెట్ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రైస్ మిల్లులు ఏర్పాటు చేసే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకునేలా చూస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 29 వేల కోట్ల రూపాయలు ఇందిరమ్మ ఇండ్లపై ఖర్చు చేయడం జరుగుతున్నదని,400 కోట్లతో నల్లగొండ జిల్లాలో డబుల్ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ తో పాటు, నల్గొండ నియోజకవర్గానికి సంబంధించి రెండు కోట్ల 20 లక్షల రూపాయల విలువ చేసే కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ హఫీజ్ ఖాన్, ఇన్చార్జి డిఆర్ఓ అశోక్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆధార్ మ్యాండేటరీ బయోమెట్రిక్ పూర్తి చేయాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : విద్యార్థుల ఆధార్ మ్యాండేటరీ బయోమెట్రిక్ పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన బయోమెట్రిక్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి ఒక ఆపరేటర్‌ను ఎస్.ఎన్.ఆర్ ఏజెన్సీ వారి ద్వారా రాష్ట్ర కార్యాలయం నియమించినట్లు తెలిపారు. అన్ని పాఠశాలలో విద్యార్థులు ఆధార్ సవరణలు (పేరు, పుట్టిన తేది) చేసి అలాగే మ్యాండేటరీ బయోమెట్రిక్‌లు కూడా అప్‌డేట్ చేయాలని సూచించారు. ఇట్టి అప్‌డేట్‌లు జిల్లా వ్యాప్తంగా 24,532 విద్యార్థులకు చేయాలన్నారు. ప్రతి ఒక్కరు 10 సంవత్సరాలకి ఒకసారి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలి కాని తల్లిదండ్రులు తెలియక చాలా మందికి చేయించలేదన్నారు. ప్రతి ఒక్క ఆపరేటలకు పాఠశాలల వారిగా ఉన్న వివరాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇట్టి ఏజెన్సీ ఆపరేటర్లు పాఠశాలకు వెళ్ళి విద్యార్థుల బయోమెట్రిక్స్ త్వరితగతిన పెండింగ్ ఉన్న వారివి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రవీణ్, జిల్లావిద్యాశాఖ అధికారి అశోక్, శ్రవణ్ కుమార్, సూర్యనారాయణ, జిల్లా సెక్టోరియల్ అధికారులు ఆపరేటర్లు పాల్గొన్నారు.

# చెన్నారెడ్డి అడుగుజాడల్లో నేటి యువత...

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతున్నటువంటి ప్రచార .జాత యాదగిరిగుట్టలో రెండో రోజు కొనసాగింది. శుక్రవారం కాచారం చౌరస్తాలో ఉన్న స్వాతంత్ర సమరయోధులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు పరెడ్డి చెన్నారెడ్డి, భద్రారెడ్డి, దుంపల మల్లారెడ్డిల స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతాకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం జరిగినటువంటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని పోరాటాలు చేసిన నాయకులు చెన్నారెడ్డి అని వారి అడుగుజాడల్లో నేటి యువత పనిచేయాల్సినటువంటి అవసరం ఉందని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్ర ప్రసాద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరు రాజయ్య, బండి జంగమ్మ, ఎండి ఇమ్రాన్, పెరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, ఇంజా హేమలత, పెరబోయిన బంగారి రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపి, ఎమ్మెల్యే



ప్రజాపక్షం/బీబీనగర్ : మండల కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి ఒక కోటి 56 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు సామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం పైన నమ్మకం కలిగించాలని కోరారు. మండల కేంద్రంలో ఉన్న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా మండలంలోని గొల్లగూడెం గ్రామానికి రూ.30 లక్షలు, రావిపహడ్ గ్రామానికి రూ.40 లక్షలు, రావిపహడ్ తండా గ్రామానికి రూ.20 లక్షలు, మాదారం గ్రామానికి రూ.30 లక్షల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, డిఎంహెచ్ఓ మనోహర్, ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ మౌనికా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పింగాల్ రెడ్డి పాల్గొన్నారు.

# యువత శక్తివంతంగా ఉంటేనే దేశం శక్తివంతం

నేటి యువత తమ ప్రతిభను వెలికి తీసి దేశ అభివృద్ధి దిశగా అడుగులు

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : యువత చదువులోనేకాకుండా,సంస్కృతి,కళలలు, సాహిత్యం, పెయింటింగ్ రంగాలలో రాణించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు.జిల్లా యువజన , క్రీడల శాఖ ఆధ్వర్యంలో2025 26 జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను శనివారం ఆయన కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఉత్సవాలను ప్రారంభించారు.యువతను ఉద్దేశించి జె సి మాట్లాడుతూ నేటి యువత తమ ప్రతిభను వెలికి తీసి దేశ అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని, స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. యువత శక్తివంతంగా ఉంటే దేశం శక్తివంతంగా ఉంటుందని, మీభవిష్యత్తును నిర్ణయించి శక్తి మీలోనే ఉందని,స్వామి వివేకానంద బోధనలు ప్రతి యువతలో దృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ పెంచుతాయని అన్నారు. గమ్యస్థానం చేరుకునే దాకా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, మీలో ఉన్న ఉత్తేజం దేశానికి, శక్తికి ప్రతిక కావాలని,యువత చదువులోనే కాకుండా సంస్కృతి ,కళలలు, సాహిత్య రంగంలో రాణించాలని, వివేకానందుడు ప్రపంచానికి భారతీయ సంస్కృతి, విలువలు, యువత శక్తిని గుర్తు చేసిన మహానుభావుడు అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ ల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి కాలేజీ ప్రిన్సిపల్ ఉపేందర్,ఒకేషనల్ ప్రిన్సిపల్ రాకేంద్,నాగార్జున డిగ్రీ ఓపెన్ కళాశాల ప్రిన్సిపల్ బొజ్జ అనిల్ ,కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మనిషా సింగ్, బాలు పాల్గొన్నారు.



## పత్తి రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

కాటేపల్లి సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ



ప్రజాపక్షం/మోటకొండూర్: పత్తి మిల్లులలో పత్తి రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆయన శనివారం మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి వరి దాన్యం కొనుగోలు కేంద్రం, సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనికి చేశారు. రోజు వారీగా ఎన్ని స్లాట్‌లు బుక్ అయితున్నాయని, ఎంత మంది రైతులు పత్తి తీసుకొని వస్తున్నారని, అందులో ఎంత తేమ శాతం వచ్చిన పత్తి ఉంటుందని, ఇప్పటి వరకు ఎంత పత్తి కొనుగోలు చేశారని రిజిస్టర్‌లు చెక్ చేశారు. రైతులను ఎలాంటి ఇబ్బందులు పెట్టకూడదని, వాళ్లకు డబ్బులు కూడా వెంటనే పడేలా నిర్వాహకులు చొరవ తీసుకోవాలి అన్నారు. వరి దాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని, కేంద్రంలో ఇంకా ఎంత ధాన్యం ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం టాబ్ ఎంట్రీ పూర్తి అయిందా, రైతులకు వాళ్ల అకౌంట్‌లలో డబ్బులు పడ్డాయా, రోజు సరిపడా లారీలు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

## ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ కృషి

ప్రజాపక్షం/సూర్యాపేట : రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. శనివారం సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాంతో కలిసి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి 65 కొత్త వ్యవసాయ మార్కెట్ రోడ్ జంక్షన్‌ను పరిశీలించారు. వాహనాల యొక్క వేగం, ప్రజల రాకపోకలు, రోడ్డు క్రాసింగ్, ఇంజనీరింగ్ లోపాలు, లైటింగ్ ఏర్పాట్లు, బారికేడ్‌ల ఏర్పాటు మొదలగు అంశాలను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా పోలీసులు ప్రజల రక్షణకై పనిచేస్తున్నామని తెలిపారు. బ్లాక్ స్పాట్స్ వద్ద స్థానిక ప్రజలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. రోడ్డు ప్రమాద స్థలాల వద్ద స్థానిక ప్రజలు జాగ్రత్తగా ఉంటూ రోడ్లు దాటాలని విజ్ఞప్తి చేశారు. వేగ నియంత్రణతో వాహనాలు నడపాలని, రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయవద్దని సూచించారు. ప్రమాదాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా 43 రోడ్డు ప్రమాద నివారణ కమిటిలను ఏర్పాటు చేశామన్నారు.



# 30 శాతం పెంచుతూ.. దుకాణాలు సొంతం

ఉపాధికి టెండర్లకు స్థానికుల డిమాండ్

వైటిడిఏ నిధులు రూ.కోట్లు వృథా!

నిధుల లేమితో పూర్తికాని దుకాణ సముదాయాలు

చెట్లు మొలిచి నిరుపయోగం

వర్తకులకు అప్పగించడంలో మరింత ఆలస్యం



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : విశ్వక్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానంలో వర్తక వెల్ఫేర్ సంఘం పేరుతో వర్తకులు ఏకమై గత ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొండపైన దుకాణాలు ఏర్పాటు చేశారు. కానీ, వర్తక సంఘం దుకాణాలు టెండర్లు నిర్వహించకుండా ప్రభుత్వ పాలకులు, నిబంధనలు కఠినంగా అమలు చేసే అధికారులు ఎందుకు వదిలేస్తున్నారో ఎంతకి అంతు చిక్కడం లేదు. దేవస్థానానికి చెల్లించాల్సిన మొత్తం రెన్యువల్ చేయాల్సిన ప్రతిసారి 30 శాతం పెంచుతూ ఆ దుకాణాలను వర్తకులే సొంతం చేసుకుంటున్నారు. టెండర్ల ద్వారా కొండపైకి చేరిన వర్తకులు పలుకుబడితో ఏళ్ల తరబడి కొండపైన స్థిరపడి దుకాణాలను శాశ్వతం చేసుకుంటున్నారు. టెండర్ల ద్వారా దక్కించుకున్న దుకాణాల యజమానులు ఏటేటా శాశ్వతంగా దేవాదాయ శాఖ నుండి అనుమతి పొంది ఇక్కడ వర్తక సంఘంలో చేరిపోతున్నారు. వీరికి సంబంధించిన దుకాణాలకు తక్షణమే టెండర్ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తూ దేవాదాయ శాఖ, యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోకు స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. వర్తక సంఘంలోని దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తేనే ఔత్సాహికులకు అవకాశం ఉంటుంది. ఎందుకంటే వర్తక సంఘంలోని దుకాణదారులే మిగతా దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తే ఔత్సాహికులకు దక్కకుండా అవకాశం రాకుండా అడ్డు తగులుతారు. దేవస్థానంలోని అన్ని దుకాణాలకు టెండర్ నిర్వహించి ఔత్సాహికులు, స్థానికులకు ఉపాధి కోసం డిమాండ్ పెరుగుతుంది. అయినప్పటికీ ఆలయ అధికారులు మాత్రం వాటి రెన్యువల్‌కే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

2022లో ఆలయం పునరుద్ఘాటన తర్వాత నేటికీ నిర్మాణాలు పూర్తి కాలేదని స్థానికులు అసంతృప్తి చెందుతున్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన దుకాణాల సముదాయాలు నిరుపయోగంగా ఉన్నాయి. కొండ కింద ఆధ్యాత్మిక వాడలో యాదగిరిగుట్ట పట్టణ ప్రధాన రహదారి నిర్వాసితుల కోసం వైటీడీఏ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం దుకాణ సముదాయాలు నిర్మించింది. అవి ఇంకా పూర్తి కాకపోవడంతో కంపచెట్లు మొలిచి నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. పాలకులు, అధికారులు దృష్టి సారించకపోవడం చేత నిర్వహిస్తులకు న్యాయం చేయలేకపోతున్నారు. ప్రభుత్వ పాలకులు, దేవాదాయ శాఖ అధికారులు వీటి నిర్మాణాలు కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టలేకపోతున్నారు.

ఈ దేవస్థానంలో కొంతమంది వర్తకులు సబ్‌లీజుకు ఇతర వ్యక్తులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. దుకాణాల నిర్వహణకు పలుకుబడిని ఉపయోగించి చర్చల్లో పాల్గొనేందుకు వారే ముందుంటారు. వర్తక సంఘం పేరుతో పైరవీలు చేసి వారి దుకాణాలకు టెండర్లు జరగకుండా ప్రభుత్వ పాలకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కోట్లల్లో ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారులు కూడా సొమ్ము చేసుకొని పైరవీల బూచి చూపుతూ వర్తకులను గట్టెక్కిస్తూ వస్తున్నారని ఆరోపణలు వెలబడుతున్నాయి. ఈ వర్తకులే దేవస్థానంలో మిగతా విభాగాల్లో నిర్వహించే టెండర్లల్లో ఔత్సాహికులకు అవకాశం రాకుండా అడ్డు తగులుతున్నారు. వర్తకులు నిర్వహించే దుకాణాలకు ఏటేటా టెండర్లు నిర్వహిస్తే దేవస్థానానికి రూ.కోట్లల్లో ఆదాయం సమకూరుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు గాను దేవస్థాన అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తూ వర్తక సంఘంలోని దుకాణాలకు తక్షణమే టెండర్లు నిర్వహించాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను స్థానిక భక్తులు డిమాండ్ చేశారు.

# రీల్

## 'ఛాంపియన్'లో అనస్వర గ్లింప్స్



యంగ్ హీరో రోషన్ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'తో అలరించ బోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన క్యారెక్టర్ బేస్డ్ గ్లింప్స్ విడుదల చేశారు. టీజర్ ప్రేక్షకులను మైఖేల్ సి విలియమ్స్ వరల్డ్‌ని పరిచయం చేయగా, ఫస్ట్ సింగిల్ గిర గిర గింగిరాగిరే ప్రోమో అనస్వర రాజన్ పోషించిన చంద్రకళని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. గ్లింప్స్‌లో చంద్రకళని ఓ ధైర్యసాహసాలున్న పల్లెటూరి అమ్మాయిగా పరిచయం చేశారు.

## 'ప్రేమంటే' సక్సెస్ మీట్



ప్రియదర్శి లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ప్రేమంటే. ఆనంది హీరోయిన్ గా నటించింది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేశారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నరంగ్ నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ బ్యానర్‌పై నిర్మించిన చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రజెంట్ చేసింది. దివంగత నారాయణ్ దాస్ నారంగ్‌కి ట్రిబ్యుట్‌గా నిలిచే ఈ చిత్రానికి ఆదిత్య మెరుగు సహ నిర్మాత. 21న విడుదలైన ఈ సినిమా అద్భుతమైన రెస్పాన్స్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో ప్రియదర్శి మాట్లాడుతూ.. ఇంత మంచి సూపర్ హిట్ సినిమా ఇచ్చినందుకు ప్రేక్షకులకు థాంక్యూ వెరీ మచ్. మా నిర్మాతలకు డైరెక్టర్‌కి టీం అందరికి థాంక్యూ. సినిమాకు వచ్చిన రెస్పాన్స్ నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. సినిమాని మీ అందరూ అప్రిషియేట్ చేస్తున్నందుకు థాంక్యూ వెరీ మచ్. డైరెక్టర్ నవనీత్ శ్రీరామ్ మాట్లాడుతూ.. సినిమాకి ఆడియన్స్ ఇచ్చిన రెస్పాన్స్ అదిరిపోయింది. ప్రతి చోట ఎంజాయ్ చేస్తున్నారు. డైరెక్టర్ కావాలనేది నా డ్రీమ్. అది ఈరోజు తీరినందుకు చాలా ఆనందంగా ఉంది. ఆడియన్స్ చాలా క్లీన్ సినిమా అనే ఫీడ్‌బ్యాక్ ఇస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఫ్యామిలీ, యూత్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. ప్రియదర్శిగారు ఆనంద్ పర్ఫామెన్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. మీరందరూ కూడా సినిమాని థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను అన్నారు.



## నా సినిమాల్లో ఏదో ఒక సందేశం ఉంటుంది

### 'అఖండ– 2' కన్నడ ట్రైలర్ విడుదలలో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం 'అఖండ–2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఎస్.థమన్ సంగీతం అందించారు. కర్నాటకలో ట్రైలర్ ఆవిష్కరణ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. మా నాన్న, ఇటు కన్నడకు రాజ్ కుమార్ వాళ్లు చేయని పాత్ర లేదు. శివరాజ్ కుమార్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళుతున్న శివన్నకు ఆశీర్వాదం అందిస్తున్నాను. అఖండ కేవలం తెలుగు సినిమా కాదు కన్నడ సినిమా కాదు ఇది పాన్ ఇండియా సినిమా. కరోనాలో అందరూ భయపడుతున్న సమయంలో మొట్టమొదటి భారతీయ చిత్రంగా ఆ సమయంలో అఖండ చిత్రాన్ని విడుదల చేశాం. ఆ తర్వాత మిగతా సినిమాలన్నీ రిలీజ్ అయ్యాయి. ఆ సినిమాలో పిల్లలు ప్రకృతి ధర్మం జోలికి వస్తే భగవంతుడు మనుషులకి ఆవహిస్తాడు అని చూపించడం జరిగింది. యువత మీరందరూ మంచిదారిలో నడవడానికి నా ప్రతి సినిమాలో ఏదో ఒక సందేశం ఉంటుంది. ఈ సినిమా ఎంత అద్భుతంగా ఉండబోతుందో మీరు చూస్తారు అని అన్నారు. కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ అఖండ–2 ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి రావడం చాలా ఆనందంగా ఉంది. మేము ఒకే కుటుంబం. మేమిద్దరం బ్రదర్స్ లాగే ఉంటాము. బాలయ్య నటన డైలాగులు యాక్షన్‌లో ఒక అద్భుతమైన ఎనర్జీ ఉంటుంది. రాజకీయాల్లో కూడా అద్భుతంగా రాణిస్తున్నారు. ఇంత వర్షంలో కూడా అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. మీ అభిమానానికి ఆ వర్షం కూడా ఆగింది. ఈవెంట్ అద్భుతంగా జరిగింది. మీ అందరి ప్రేమ నమ్మకానికి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటాం. డిసెంబర్ 5న తప్పకుండా ఈ సినిమా మీ అందరిని ఎంతగానో అలరిస్తుంది.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బోయపాటి శ్రీను, నటుడు ఆది పినిశెట్టి, హీరోయిన్ సంయుక్త, నిర్మాత గోపి ఆచంట తదితరులు పాల్గొన్నారు.

## 'మా చిన్ని శివ' పాట ఆవిష్కరణ



ప్రముఖ సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ స్వరపర్చి పాడిన మా చిన్ని శివ డివోషనల్ వీడియో సాంగ్ లాంఛ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మా చిన్ని శివ సాంగ్ ను విడుదల చేశారు. ఈ పాటను జి. మణి లక్ష్మణరావు ప్రొడ్యూస్ చేశారు. భారతి బాబు లిరిక్స్ అందించగా శ్రీరామ్ కంగటాల డీవోపీ, ఎడిటింగ్‌తో పాటు దర్శకత్వ బాధ్యతలు వహించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం శ్రీలేఖ మాట్లాడుతూ నేను గతంలో శివుడి డివోషనల్ సాంగ్స్ చేశాను. శివుడి పాటలు వైబ్రెంట్‌గా మంచి సౌండింగ్‌తో ఉంటాయి. ప్రొడ్యూసర్ మణి లక్ష్మణరావు ఈ పాట కోసం డిఫరెంట్ కాన్సెప్ట్ ఆలోచించి చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ జి.మణి లక్ష్మణరావు, గేయ రచయిత భారతి బాబు, నటి ప్రియ జాస్పర్, డైరెక్టర్ రామ్ గణపతి పాల్గొన్నారు.

## 'పాంచ్ మినార్' సక్సెస్ మీట్

యంగ్ టాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరో ఫన్ టాస్టిక్ బ్లాక్ బస్టర్ 'పాంచ్ మినార్'. రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్‌లో రాశి సింగ్ హీరోయిన్‌గా నటించింది. గోవింద రాజు



ప్రజెంట్ చేసిన ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ బ్యానర్‌పై మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మించారు. 21న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బ్లస్టర్ రెస్పాన్స్‌తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ.. ఈ సినిమాకి మీడియా వారు ఇస్తున్న సపోర్ట్‌కి థాంక్యూ. శ్రీనివాస్ రెడ్డికి నేను ఫ్యాన్ బాయ్. ఆయనతో కలిసి పనిచేసిన అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన వెంకీ సినిమాకి ఇప్పటికీ ఒకేలా ఉన్నారు. శేఖర్ చంద్ర అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. మా ప్రొడ్యూసర్ మాధవికి మంచి సినిమా చేయాలని తపన కథ మీద ఉన్న నమ్మకం, మా డైరెక్టర్ పడ్డ కష్టం, ఈ సినిమాకి ఏదైనా తెచ్చి పెట్టాలని మా గోవిందరాజు ఆయనపై వేసుకున్న భారం.. ఇవన్నీ కలిసి నాకు దొరికిన అదృష్టం పాంచ్ మినార్. చూసిన ప్రేక్షకులందరికీ థాంక్యూ వెరీ మచ్. హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ.. సినిమాకి ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ ఉంది. నిన్న దేవి థియేటర్‌కి వెళ్ళాను. సినిమా చూసినోళ్లు అందరు కూడా చాలా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రొడ్యూసర్ మాధవి మాట్లాడుతూ.. ఇది కంప్లీట్‌గా ఫ్యామిలీ ఎంటర్టైనర్. తప్పకుండా థియేటర్స్‌లో చూడండి. రెండు గంటల పాటు నాన్ స్టాప్ నవ్వులు ఎంజాయ్ చేస్తారు. గోవిందరాజుకి చాలా థ్యాంక్స్. ఈ సినిమా ఈరోజు ఈ స్టేజ్‌కి వచ్చిందంటే కారణం ఆయనే. రాజ్ తరుణ్ మిగతా అందరు కూడా చాలా అద్భుతంగా నటించారు. డైరెక్టర్ ప్రతి క్యారెక్టర్ చాలా చక్కగా తీర్చిదిద్దారు. తప్పకుండా ఈ సినిమా అందరూ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.


ఈ కార్యక్రమంలో గోవిందరాజు, డైరెక్టర్ రామ్, మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్, నటుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## త్రీ రోజెస్–2 ట్రైలర్ లీజ్



ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 డిసెంబర్ 12వ తేదీ నుంచి స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ సిరీస్‌ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా.. కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈవెంట్‌లో 'త్రీ రోజెస్' సీజన్ 2 టీజర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ 'త్రీ రోజెస్' కాన్సెప్ట్‌తో ఎన్ని సిరీస్‌లు అయినా చేయొచ్చు. అలాంటి యూనిక్ కాన్సెప్ట్ మారుతి ఇచ్చారు. టాక్సీవాలా మూవీ చేశాక ఓటీటీలో ఏదైనా కంటెంట్ ప్రొడ్యూస్ చేసేందుకు కావాల్సినంత కాన్ఫిడెన్స్ ఇచ్చింది 'త్రీ రోజెస్'. ఈ కార్యక్రమంలో ఆహా కమర్షియల్ హెడ్ రాజేశ్ వాసిరెడ్డి, ఆహా కంటెంట్ హెడ్ కవిత, రైటర్ సందీప్ బొల్ల, యాక్టర్ సూర్య శ్రీనివాస్, డైరెక్టర్ కిరణ్ కె కరవల్ల, హీరోయిన్ కుషిత కల్లపు, హీరోయిన్ రాశీ సింగ్, హీరోయిన్ ఈషా రెబ్బా పాల్గొన్నారు.

## 'మోహన రాగ' మ్యూజిక్ సంస్థ ప్రారంభం




రాకింగ్ స్టార్ మంచు మనోజ్ తన కొత్త మ్యూజిక్ లేబుల్ 'మోహన రాగ' ప్రారంభించారు. లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్ అనే క్యాప్షన్‌తో మన సంగీతాన్ని వరల్డ్ వైడ్ రీచ్ చేసేందుకు మోహన రాగ మ్యూజిక్ లేబుల్‌తో తనదైన ప్రయత్నం చేయబోతున్నారు మంచు మనోజ్. సోషల్ మీడియా ద్వారా మంచు మనోజ్ ఈ ప్రకటన చేశారు. సంగీతం మీద తనకున్న ప్రేమే మోహన రాగ మ్యూజిక్ లేబుల్ స్థాపించేలా స్ఫూర్తినిచ్చిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఫ్రెష్ సౌండ్స్, బోల్ టాలెంట్, ఫియర్ లెస్ క్రియేటివిటీ తమ మ్యూజిక్ లేబుల్ ద్వారా సంగీత ప్రపంచానికి పరిచయం చేస్తామని మంచు మనోజ్ తెలిపారు.

## 'రాజు వెడ్స్ రాంబాయి' రూ.1.47 కోట్ల గ్రాస్ వసూళ్లు




అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని దక్కించుకుంది. హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ అంటూ ప్రేక్షకులు, క్రిటిక్స్ ఈ సినిమాకు ప్రశంసలు అందిస్తున్నారు. ఈ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఓపెనింగ్స్‌తో బాక్సాఫీస్ జర్నీ మొదలుపెట్టింది. తొలి రోజు ఏపి, తెలంగాణలో ఈ సినిమాకు 1.47 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు దక్కాయి. డే 1 ట్రెండ్ చూస్తుంటే 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా మంచి వసూళ్లను దక్కించుకుంటుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టైన్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ ఈ సినిమాను థియేటర్‌లో విడుదల చేశారు.

# ధర్మభిక్షం పేరు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొన్నం ప్రభాకర్, గౌరవ అతిథిగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి హాజరయ్యారు. సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గీత కార్మికులు కులవృత్తి రక్షణతోపాటు తమ పిల్లల విద్యాభ్యాసానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తమ పిల్లలు నెగ్గేందుకు విద్య చాలా అవసరమని, ప్రతి తల్లిదండ్రులు కష్టపడి చెమటోడ్చుతూ తమ పిల్లలను చదివించాలని చెప్పారు. రాష్ట్ర మంత్రిగా తనవంతు బాధ్యతగా గీత కార్మికులకు ఎక్స్ గ్రేషియా, కాటమయ్య రక్ష, సంఘపరమైన భవనాలకు సంబంధించి అన్ని గౌడ కుల పెద్దలతో కలిసి అమలయ్యే విధంగా చూద్దామన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, తాను కలిసి ముఖ్యమంత్రితో మాట్లాడి ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటును త్వరలో పెట్టబోతున్నట్టు చెప్పారు. ఏ విషయంలోనూ నిరాశ చెందొద్దని, ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కల్లు గీత వృత్తి ప్రధానమైందని, కొన్ని ప్రాంతాల్లో గౌడ్‌లు కాకుండా ఇతర కులాల వారు కూడా కల్లు గీత వృత్తి చేస్తుండేవారన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం పార్టీలు, కులాలకు అతీతంగా గీత పనివారల సంఘం స్థాపించి, గీత వృత్తి రక్షణకు పాటుపడ్డారని కొనియాడారు. గీత వృత్తి గ్రామీణ పరిశ్రమగా అభివృద్ధి చెందాలని గీత వారల సంఘం అనేక మార్గాలను ప్రభుత్వాలకు సూచించిందని తెలిపారు. కార్మికులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించడంలో గీత పనివారల సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. సామాజిక చైతన్యం కలిగించడం కోసం సంస్కరణలు తీసుకురావటంలో, స్వాతంత్ర్య పోరాటంలో ధర్మభిక్షం కీలక పాత్ర పోషించారన్నారు. ధర్మభిక్షం చరిత్ర తెలుసుకుని సూర్యాపేట జిల్లాకు ఆయన పేరును పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు అనేక త్యాగాలు చేశారని, ఇదే మాదిరిగా నక్సలైట్లు కూడా త్యాగాలు చేసిన వారేనని పేర్కొన్నారు. ప్రజల ఆలోచనలో మార్పు వచ్చిందని, కాలం మారిందని, కమ్యూనిస్టులు మరింత బలోపేతం కావాలంటే మరింత ఐక్యత అవసరమన్నారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గీత పనివారల కుటుంబాలకు రూ.13 కోట్ల ఎక్స్ గ్రేషియా బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గీత కార్మికులు వృత్తిలో ప్రమాదవశాత్తూ మరణించినా, అంగవైకల్యం చెందిన రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కోరారు. పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కల్లు వృత్తిలో హర్రాస్ విధానానికి వ్యతిరేకంగా, త్రివిధ పన్నులకు బదులుగా ఒకే పన్ను ఉండాలని ధర్మభిక్షం పోరాడారని గుర్తు చేశారు. ధర్మభిక్షం కలలు కన్న కల్లు గీత పారిశ్రామీకరణకు నీరా ప్రాజెక్టును ట్యాంక్ బండ్ వద్ద పెట్టారన్నారు. ఈ సమావేశంలో గీతపనివారల సంఘం ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలు గౌడ్, సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షులు కెవిఎల్, దూసరి శ్రీరాములు, పండ్ల రాములు, కార్యదర్శులు పబ్బారి దేవేందర్ గౌడ్, బొమ్మగాని శ్రీనివాస్, గౌడ్ సంఘం నేతలు అంబాల నారాయణగౌడ్, పల్లె వినయ్‌గౌడ్, కొండా కోటయ్య, వేణు, బొడిగె సైదులు, బంధం నాగేశ్వరరావు, నాగార్జున్, రవికిశోర్, గోపాల్, లక్ష్మయ్య, ధనుంజనయ్యగౌడ్, బొడ్డు రామచద్రుడు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్‌లకు మోడీ ప్రభుత్వం ఊడిగం

### నైజాంకు ముగింపు పలికినట్లే మోడీకి పలకడం ఖాయం
### సిపిఐ వందేళ్ల సభలో లక్షలాదిగా పాల్గొనండి
### సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/జనగామ :** మోడీ సారధ్యంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మోకరిల్లింది. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుంది. అందుకే నైజాంకు ముగింపు పలికినట్లే మోడీకి ముగింపు పలకాల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. సిపిఐ వందేళ్ల సభలో లక్షలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ జరగనుండగా రాష్ట్రంలో చేపట్టిన ప్రచార జాతా శనివారం జనగామకు చేరుకుంది. ఈ సందర్భంగా చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం జరిగిన సభకు మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అధ్యక్షత వహించగా పశ్య పద్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 1917లో సోవియల్ రష్యాలో రాజరిక వ్యవస్థ కుప్పకూలిందన్నారు. 1925లో దేశంలో సిపిఐ ఏర్పడక ముందే ప్రపంచంలోని అనేక దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఏర్పాడి ప్రజా పాలన సాగిందన్నారు. ప్రజలకు కావల్సిన అన్ని సమస్యలు తీరేవన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన తరువాత అనేక పోరాటాలు జరిగాయని ఈ ప్రాంతంలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి, భుక్తి, వెట్టి చాకిరి కోసం పోరాటం జరిగిందన్నారు. దీని మూలంగా నైజాం సంస్థానంతో పాటు దేశంలోనే 568 సంస్థానాలు విలీనం కాక తప్పలేదన్నారు. ప్రభుత్వంతో కొట్లాడి అనేక సంస్కరణలు తీసుకు వచ్చామని బ్యాంక్‌ల జాతీయకరణ,




భూగరిష్ట చట్టం వంటివి తీసకురావడం జరిగిందన్నారు. భైరాన్‌పల్లి చరిత్ర తెలిస్తే ఆనాడు నైజాంకు వ్యతిరేకంగా ఎర్రజెండా నీడలో ఎంత బలమైన పోరాటం జరిగిందో తెలుస్తుందన్నారు. గుతపలు, బరిసెలు, కొడవళ్లు పట్టుకొని రజాకార్లను ఎదిరించారన్నారు. భైరాన్‌పల్లిలో ఒకేసారి 88 మందిని నిలబెట్టి కాల్చి చంపిన చరిత్ర ప్రపంచ దేశాలకు విస్తరించిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది చంపబడగా పది లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగిందన్నారు. పరిశ్రమలు స్థాపించబడ్డాయని, పాఠశాలలు ఏర్పడ్డాయన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచినట్లు ఉచిత విద్య అందడం లేదన్నారు. గత పదేళ్లలో బిజెపి పాలనలో దేశం ఆగమైపోయిందని కోటీశ్వర్లు శతకోటీశ్వర్లు అవుతున్నారన్నారు. కోటీ ఉద్యోగాలు ఏమయ్యాయని పద్మ ప్రశ్నించారు. అందుకే మోడీని గద్దె దింపాలని, సిపిఐ వందేళ్ల పండుగకు భారీగా ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రీ, తెలంగాణ రైతు సంఘం కోశాధికార డిజి నరేంద్రప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, మోటే శ్రీశైలం, వైకుంఠం, సఖి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చోద్యం చూస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఏపిలో కలిపిన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని, గోదావరి కరకట్టలను పటిష్ట పరిచి వరదబారి నుండి ఈ ప్రాంత ప్రజలను రక్షించాలని అన్నారు. ప్రశ్నించే వారిని నిర్బంధిస్తూ, వారి గొంతులను నొక్కే ప్రయత్నం పాలకులు చేయుట సిగ్గుమాలిన చర్య అన్నారు. సిపిఐ శతవసంత ఉత్సవాలను పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్‌లో కోమరం భీమ్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం ప్రారంభమైన ప్రచార జాత 12 జిల్లాల మీదుగా 35 నియోజకవర్గాల పరిధిలో కొనసాగి శనివారం భద్రాచలంలో ముగిసింది. ప్రచారజాత బృందం భద్రాచలం గోదావరి బ్రిడ్జీ సమీపానికి రాగానే సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి పూల మాలలు వేశారు. అనంతరం పట్టణ పురవీధుల్లో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ సాగింది. అంబేద్కర్ విగ్రహంతో పాటు విప్లవ వీరుల విగ్రహాలకు పూల మాలలు వేసిన నాయకులు జోహార్లు అర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా ఆటాపాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో భాగంగా స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జాతా ముగింపు సభలో చాడా, తక్కెళ్లపల్లి మాట్లాడారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కులాలు, మతాలపేరుతో దేశంలో గందరగోళ వాతావరణాన్ని సృష్టిస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని అమలు పర్చాల్సిన పాలకులు హిందుత్వ ఎజెం



డాను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్యలో కోట్లాది రూపాయలు వెచ్చించి రామమందిరాన్ని నిర్మించిన నరేంద్రమోడి ప్రభుత్వం భద్రాచలం రామాలయాన్ని విస్మరించారన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు కలివేన శంకర్, ఎం బాలనర్సింహా మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ ఓ పచ్చి బూటకం అని, ఎన్ కౌంటర్ల పేరుతో మావోయిస్టులను పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి హతమారుస్తున్నారన్నారు. ఈ ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకుని న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశారు. కమ్యూనిజాన్ని హత్యలు, నిర్బంధాలతో అడ్డుకోవడం ఎవరి తరం కాదని, అది అనునిత్యం ఉదయించే అరుణ వర్ణమన్నారు. మావోయిస్టులను చంపేందుకు డెడ్‌లైన్ పెట్టిన కేంద్రం వారితో శాంతి చర్చలకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు.

అనంతరం ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యానికి కమంటే ముందే ఆవిర్భవించిన సిపిఐ అంతరాలు లేని సమాజ స్థాపనే ధ్యేయంగా నాటి నుండి నేటి వరకు పోరాడుతూనే ఉందన్నారు. స్వదేశ కాంక్షను తొలూత ప్రజల్లో రగిలించింది సిపిఐ అని, స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో యువకిశోరాలు ప్రాణతర్పణం చేశారని చెప్పారు. ఈ వందేళ్ల ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్న సిపిఐ ప్రజాక్షేత్రంలో సబ్బండ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం మరింత ఎరుపెక్కిన పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతుందని, మరో వందేళ్లయినా ఇదే స్ఫూర్తి కొనసాగుతుందన్నారు. సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉద్యమాల ఖిల్లా ఖమ్మం జిల్లా కేంద్రంలో డిసెంబర్ 26న ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ జరగబోతోందని, కనీవినీ ఎరుగని రీతిలో జరిగే ఈసభకు 45 దేశాల నుండి ప్రతినిధులు, దేశ విదేశాల నుండి కవులు, కళాకారులు, మేధావి వర్గ ప్రతినిధులు హాజరువుతున్నారని చెప్పారు. ఈ శతవసంత ఉత్సవ ముగింపు సభ విజయవంతానికి భారీ ఎత్తున ప్రజలను తరలించాలని, ఇందుకోసం పార్టీ నాయకులు,కార్యకర్తలు, సానుభూతి తిపరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర, ఎస్‌డి సలీం, కమటం వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాస్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, కంచర్ల జమలయ్య, అడ్డగర్ల తాతాజీ, ఉప్పుశెట్టి రాహుల్, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు పల్లె నర్సింహా, మారపాక అనీల్, కసిరెడ్డి మణికంఠా రెడ్డి, రెహమాన్, లక్ష్మీ నారాయణ, జిల్లాలోని మండలాల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com